గ్రంథ ప్రతులు వలయువారు.

శ్రీ దయానంద పొన్నాల రాజయోగిగారు

4-1-96 రాజయోగాశ్రమ వీధి

సుభాష్‌నగర్-నిజామాబాద్

అని వ్రాయవలెను.

అస్పర్శయోగము
అనే
శ్రీ మద్భగవద్గీత

రాజయోగీయము

ద్వితీయ భాగము

(7 నుండి 12 అధ్యాయములు)

వ్యాఖ్యాత :
శ్రీ దయానంద పొన్నాల రాజయోగి
సికింద్రాబాద్.

వెల రు. 6-/

శ్రీమదచలఋషి

శ్రీ మద్దయానంద పొన్నాల రాజయోగీంద్రులవారి ప్రియ శిష్యులు



శ్రీ కోటపాటి కృష్ణారావుగారు, B. A.

వీరి సతీమణి

శ్రీమతి, రమాకుమారిగారు

అపూర్వయోగము అనే శ్రీ మద్భగవద్గీత

రెండవ భాగము (7 నుంచి 18 అధ్యాయములు)

పీఠిక

శ్రీమద్భగవద్గీత, అర్జునుని వ్యాజముతో సమస్త మానవాళికి శ్రీ కృష్ణుడు ప్రపంచ పారమార్ధికములలో కర్తవ్య ముపదేశించిన గ్రంధరాజము. కురుపాండవ పక్షములు యుద్ధ సన్నద్ధులై ముఖాముఖి నిలబడి సేనాధ్యక్షుల ఆజ్ఞలకై నిరీక్షించుచూ వేచియుండిన సమయము యుద్ధరంగమే వుపదేశ స్థలము. పూజనీయులగు గురువులు, తాత, తండ్రులు ప్రేమ పాత్రులగు బంధువర్గము తమ్మెదిరించ వచ్చినట్లు కనుగొని వారిని చంపవలసి వచ్చునేయని అర్జునుడు విషాదగ్రస్తుడై రధమున చతికిలబడెను. మాధవుడు గురువు. మానవోత్తముడగు అర్జునుడు శిష్యుడు. ఇవి గీతోపదేశమునకు దేశకాల పాత్రలు.

700 శ్లోక సంఖ్యగల విస్తృతమైన భగవద్గీతయంతయు నిజముగా నపుడు శ్రీ కృష్ణుడర్జునునికి ప్రబోధించి యుండెనా! పూరక పఠించుటకే కనిసము రెండు గంటల కాలము కావలెనే? ఒకరిపైనొకరు గుకుటకు తొందరపడుచున్న వీరాగ్రేసరులందరు పూరక నిలబడి అపుడేమి చేయుచుండిరి? మహాభారతమందలి యీ గీతా శ్లోకములు కవి ప్రకాండుడగు వ్యాసుడు తన సహజ పాండిత్యముతో విస్తరించి వ్రాసి యుండునేమోనని చెప్పవలసివుండును. అట్టి సంక్లిష్టసమయమున ఏవో కొన్ని సూటిమాటలచే అర్జునునికి దుఃఖోపశమనము గావించి కర్తవ్యోన్ముఖుని గావించునేగాని, వేదాంత సర్వస్వమును గూర్చి దీర్ఘోపన్యాసము సేసి పదునెనిమిది యోగములు (మార్గములు) విపులపరచి బోధించుచూ కాలక్షేపము సేయునుగదా! కనుక అర్జునుని దుఃఖ కారణమగు మోహముయొక్క నిరాకరణము గావించి కర్తవ్య నిష్ఠునిగావించిన గీతయందలి ముఖ్యమార్గమేదియో నరయవలసివున్నది.

ఇంతకు ముందుగా అర్జునుని విషాదమునకు మూలకారణము లేమో తెలియవలసి వున్నది. స్వస్వరూప జ్ఞానము బడయు విశేషజ్ఞానమొక్క మానవోపాధియందే గలదు. కాని "అజ్ఞానేనావృతం జ్ఞానం తేన ముహ్యంతి జంతవః" ఆ స్వస్వరూపము అజ్ఞానముచే నావరింప

బడియుండుటచే అజ్ఞాన కార్యములగు కామ క్రోధ లోభ మోహ భయములచే మానవుడే, యెక్కువగా వివశుడగుచున్నాడు. అర్జునుడు ముఖ్యముగా గురుభక్తి, బంధుప్రీతి పాపభీతి మొదలగు వానిచే స్వధర్మోచిత కర్మ నిర్వాహణనుంచి పరాన్ముఖుడైనాడు. మరియును యుద్ధమునందు వైరులను "నేను నా పరాక్రమముచే చంపబోవు చున్నాను అని స్వాభిమాన పూరితమైన వ్యష్ట్యహంకారమునకు గురియైనాడు. స్వరూప జ్ఞానముచేత మాత్రమే భేదబుద్ధి రహితమై మోహావృత్తి నశించగలదు. కర్తృత్వ త్యాగరూపమైన శరణాగతి చేత మాత్రమే కర్తృత్వాహంకారము నశించును. కనుక మోహావృత్తి నశించుటకు స్వస్వరూప మెరిగించి స్థితప్రజ్ఞుని చేయు సాంఖ్య యోగమును కర్తృత్వాహంకార నాశనమునకు శరణాగతి పరాకాష్ట గాగల చరమ శ్లోకమును శ్రీ కృష్ణుడు ప్రబోధించవలసివుండెను.

కామక్రోధాదులకు అంతఃకరణముతో గూడిన చిజ్జడాత్మకమగు చేతనాత్మయే ముఖ్యకారణమనియు ఆ చేతనాత్మ కన్యముగా యే పరిపూర్ణ పరబ్రహ్మము కలదో దానియందు కామాదివృత్తుల కత్యంత మూలకారణము చేతనాత్మకు స్థానముగాని మూలముగాని లేదని దెలసి ఆ పరిపూర్ణ పరబ్రహ్మమును చేతనాత్మను యెరిగి పంచతన్మాత్ర విషయములకు లోనుగాక పరిపూర్ణత దనరువాడే స్థితప్రజ్ఞుడు. కనుక సాంఖ్యయోగములో ముందుగా చేతనాత్మయు, పరిపూర్ణ పరబ్రహ్మము, దెల్పి తుదకు స్థితప్రజ్ఞ లక్షణములు చెప్పబడినవి ఈ సాంఖ్య యోగము కపిలసాంఖ్యమువంటిదికాదు "సమ్యగ్ ఖ్యాపనంసాంఖ్యం" అనగా ఆత్మను సంపూర్తిగా వివరించునదిసాంఖ్యము ఎటుల పరిపూర్ణ లక్షణములు ఏ విధంగా ఇందు చెప్పబడినవి? అని ప్రశ్నించవచ్చును? ఆత్మ శబ్దము నానార్థములలో ప్రయోగింపబడుచున్నది. దేహము, మనస్సు, బుద్ధి, అంతఃకరణము, జీవుడు, ప్రత్యగాత్మ, పరమాత్మ బ్రహ్మము (పరిపూర్ణ బ్రహ్మము) యివన్నియు ఆత్మ శబ్దార్థములే. ఇందు లక్ష్యార్థముచే పరమాత్మయు, లక్ష్యలక్ష్యార్థముచే పరిపూర్ణ పరబ్రహ్మమున్ను అర్థముగా గ్రహించవలెను. గీతయందలి సాంఖ్య

యోగములో 12 నుంచి 16 వరకుగల శ్లోకములు లక్ష్యార్థముచే, చేతనాత్మను వివరిస్తే, లక్ష్యలక్ష్యార్థముచే 17 నుంచి 29 వరకుగల శ్లోకములు పరిపూర్ణ పరబ్రహ్మను ననువదించుచున్నవని గ్రహించవలసియున్నది. ఇట్లు, ఎరుక పరిపూర్ణములు, తదుపరి స్థితప్రజ్ఞ లక్షణాము యీ సాంఖ్యయోగమున దెలుపబడినవి.

మిగతా అధ్యాయములలో లోకంలోగల కర్మ భక్తి జ్ఞాన, ధ్యానాది మార్గములన్నియు (సర్వధర్మములు) ప్రబోధింపబడినవి. మరిన్ని ప్రపంచమందుగల వైదిక లౌకిక నైతిక సాంఘిక (వర్ణాశ్రమాచార) ధర్మములన్నియు చెప్పబడినవి. చివరకు కర్తృత్వ త్యాగ రూపమైన కర్మాచరణము చెప్పబడి "సర్వధర్మాన్ పరిత్యజ్యమామేకం శరణం వ్రజ" అంటూ ఎరుక విడుచు నుపాయం కూడా నుద్ఘాటింపబడినది. విభిన్న ప్రకృతులుగల వ్యక్తులకు విభిన్న మార్గములు గీత సూచిస్తూ వచ్చనది కాని ఆద్యంతములయందు అనగా సాంఖ్య యోగమునందును చరమ శ్లోకమునందును, పరిపూర్ణ మెరుకలను తెల్పి ఎరుకను విడచు నుపాయము చెప్పియున్నది. "శిష్యస్తేహం శాధి మాం త్వాం ప్రపన్నమ్" అంటూ శరణాశ్రయించిన సచ్ఛిష్యుడైన అర్జునునికి సద్గురువైన శ్రీకృష్ణుడు తొలుతనే సాంఖ్యయోగములోనే పరిపూర్ణ మెరుకల తెల్పి చరమ శ్లోకములో యెరుకలు విడిపించు నుపాయము దెల్పి మధ్యలో కర్తృత్వత్యాగ రూపమైన కర్మకౌశల మొసగించి సర్వసంశయ రాహిత్యమును గావించెను.

"అతనికి దయవస్తే అరనిమిషమునందే బోధస్థితి నీకు కుదిరించు" ననే న్యాయంగా ఒకటి రెండు మాటలలోనే సూటిగా పరిపూర్ణ బోధను దెల్పి స్వధర్మ కర్మ నిర్వహణతో గూడిన రాజమార్గము నుపదేశించి "నష్టో మోహః స్మృతిర్లబ్ధా త్వత్ప్రసాదాన్మయాచ్యుత స్థితోస్మి గత సందేహః కరిష్యే వచనం తవ" అని గీత అర్జునునిచే పలికించినది. కనుక సర్వధర్మాధర్మములను విడచి త్రికరణ శుద్ధిగా తను మనధనములు ధారబోసి సర్వభారమును గురునిపైనే వదలి గురుని ఆజ్ఞాసారము ప్రవర్తించుటయే అస్పర్శ యోగమునకు పరాకాష్ఠ.

"సర్వేజనా సుఖినోభవంతు" (గ్రంథకర్త)

శుభాశీస్సు

శ్రీయుత కోటపాటి పున్నయ్య వీరి సతీమణి శ్రీమతి పున్నమ్మ గార్ల పుణ్య గర్భవాసమున జన్మించిన చి॥ కృష్ణారావు పుట్టినవెంటనే తల్లి పరమపదించినందున, గుంటూరుజిల్లా రేపల్లె తాలూకా, మంత్రి పాలెంలో మాతామహి శ్రీమతి గోగినేని మహాలక్ష్మమ్మగారీతనిని అల్లారుముద్దుగా పెంచి, విద్యాబుద్ధుల గరపి, ఆలపర్తివారి కుటుంబము నుండి, రమాకుమారి యనే కన్యారత్నమును వివాహ మొనర్చి తన కున్న స్థిరచరాస్తు లిచ్చియుండెను. వీరి పూర్వజన్మ సుకృత విశేష మున శ్రీ మదచలఋషి రామనుగు శ్రీ శివరామ దీక్షిత పీఠాధికా రులగు అచలఋషి శ్రీ దయానంద పొన్నాల రాజయోగీశ్వరుల నాశ్రియించి ధర్మోపదేశముపొంది శక్తిద్వయ నిరాసకంబై, క్షరాక్ష రోపాధి ద్వయదోష రహితంబై యొప్పు పరిపూర్ణ తత్వమును తెలిసికొని, వీరు జనన మరణ భ్రాంతి రహిత పరిపూర్ణ స్థితినిబొంది కృతార్థులైరి. తద్వత్తుగా సోదర మానవులు కృతార్థులగుట కొఱకు యీ గ్రంథము నకు ద్రవ్య సహాయ మొనర్చియున్నారు. వీరికి మా శుభాశీస్సులు.

ఇట్లు

పీఠాధిపతి:

సికింద్రాబాద్ : **శ్రీ మదచలఋషి దయానంద పొన్నాల రాజయోగి**

15–4–74 : గ్రంథకర్త.

శ్రీ శివరామ దీక్షిత అచల గురు పీఠాధిపతులు

అ చ ల ఋ షి



శ్రీ మద్దయానంద పొన్నాల రాజయోగి

గ్రంథకర్త.

అస్పర్శయోగము అనే

శ్రీ మద్భగవద్గీత

రాజయోగీయము

సప్తమాధ్యాయము

విజ్ఞాన యోగము

శ్రీ భగవాన్ ఉవాచ :

శ్లో॥ మయ్యాసక్తమనాః పార్థ యోగం యుంజన్మదాశ్రయః।
అసంశయం సమగ్రం మాం యథా జ్ఞాస్యసి తచ్ఛృణు ॥ 1

శ్రీ కృష్ణుడు పల్కెను అర్జునా! నా యందు ఆసక్తమైన చిత్తముతో శరణాగతుడవై యోగమును అభ్యసించుచునుండువేని, విభూతి బలైశ్వర్యాది సంపన్నమగు నా పూర్ణ స్వరూపమును నిస్సంశయముగ తెలిసికొనగల రీతిని వినుము.

శ్లో॥ జ్ఞానం తేఽహం సవిజ్ఞానమిదం వక్ష్యామ్యశేషతః।
యజ్జ్ఞాత్వా నేహ భూయోఽన్యత్ జ్ఞాతవ్యమవశిష్యతే ॥ 2

నేను నీకు అనుభవముతో గూడిన బ్రహ్మతత్త్వమును సంపూర్ణముగా చెప్పెదను దానిని గ్రహించిన యీ శ్రేయోమార్గమున, యిక తెలిసికొనదగిన దేదియు మిగులదు.

శ్లో॥ మనుష్యాణాం సహస్రేషు కశ్చిద్యతతి సిద్ధయే।
యతతామపి సిద్ధానాం కశ్చిన్మాం వేత్తి తత్త్వతః॥ 3

మనుష్యులలో వేయింటికి యే ఒక్కడో ఆత్మజ్ఞానమును బొంద ప్రయత్నించును. యిట్లు ప్రయత్నించు ముముక్షువులలో నెవడో ఒకడు మాత్రమే అరుదుగా నన్ను యథార్థముగ తెలిసికొనగలుగుచున్నాడు.

శ్లో॥ భూమిరాపోనలో వాయుః ఖం మనోబుద్ధిరేవచ ।
అహఙ్కార ఇతీయం మే భిన్నా ప్రకృతిరష్టధా ॥ 4

పృథివి, నీరు, అగ్ని, గాలి, ఆకాశము సంకల్ప వికల్పాత్మక మగు మనస్సు, నిశ్చయాత్మకమగు బుద్ధి, నేను నేను అను అహంకారము, అని ఈ నామాయాశక్తి యెనిమిది విధములుగా విభజింప బడినది.

శ్లో॥ అపరేయమితస్త్వన్యాం ప్రకృతిం విద్ధి మే పరమ్ ।
జీవభూతాం మహాబాహో యయేదందార్యతే జగత్ ॥ 5

అర్జునా! అష్టవిధమగు ఈ ప్రకృతి అపరము అనగా వికార మని గ్రహింపుము దీనికంటె వేరుగా నా పరాప్రకృతి జీవస్వరూపమున వెలయుచున్నది. ఈ జీవభూతమగు ప్రకృతియే జగత్తును ధరించుచున్నది.

శ్లో॥ ఏతద్యోనీని భూతాని సర్వాణీత్యుపధారయ ।
అహం కృత్స్నస్య జగతః ప్రభవః ప్రలయస్తథా ॥ 6

నా యొక్క ఈ ఉభయ విధ ప్రకృతుల నుండి క్షేత్ర క్షేత్రజ్ఞ రూపమగు సర్వము జనించుచున్నదని గ్రహింపుము. నేను ప్రకృతితో గూడియున్న సమస్త జగత్తుయొక్క సృష్టి ప్రళయములకు కారణ భూతుడను.

శ్లో॥ మత్తః పరతరం నాన్యత్కించిదస్తి ధనంజయ ।
మయి సర్వమిదం ప్రోతం సూత్రే మణిగణా ఇవ ॥ 7

అర్జునా! నా కంటె శ్రేష్ఠతరమగు కారణము వేరొకటి యేదియును లేదు. దారమున గుచ్చబడిన పెక్కు మణులవలె ఈ జగత్తు నా యందు ఆశ్రయించుకొనియున్నది

శ్లో॥ రసోఽహ మప్సు కౌన్తేయ! ప్రభాస్మి శశిసూర్యయోః ।
ప్రణవ స్సర్వవేదేషు శబ్దః ఖే పౌరుషం నృషు ॥ 8

కుంతీపుత్రా! నేను నీటియందు రసతన్మాత్రను. చంద్రసూర్యులలో ప్రకాశమును. నాల్గు వేదములలో ఓంకారమును. ఆకాశములో శబ్దతన్మాత్రను. మనుష్యులలో పురుషకారమునైయున్నాను.

శ్లో॥ పుణ్యోగన్ధః పృధివ్యాం చ తేజశ్చాస్మి విభావసౌ ।
జీవనం సర్వభూతేషు తపశ్చాస్మి తపస్విషు ॥ 9

నేను పృధివియందలి సుగంధమును అగ్నియందలి దీప్తిని జీవోపాధులలో ప్రాణమును. తపోనిష్ఠయందు శీతోష్ణాది ద్వంద్వసహన సామార్థ్యమును అయియున్నాను.

పంచభూతములలో గుణరూపంగానున్న పంచతన్మాత్రలు స్వభావికముగ పవిత్రమైయుండును. ప్రాణులు అధర్మపద్ధతుల నపేక్షించి అపవిత్రత పొందుచున్నవి. గనుక నా నిర్ణయ పద్ధతి తెలిసిన వారు విషయంబులచే అపవిత్రత నొందక తన్మాత్రలు నేనేయని నిర్ణయించి ప్రవర్తించవలయునని భగవానుని నిర్ణయము.

శ్లో॥ బీజం మాం సర్వభూతానాం విద్ధి పార్థ సనాతనమ్ ।
బుద్ధి ర్బుద్ధిమతా మస్మి తేజ స్తేజస్వినా మహమ్ ॥ 10

అర్జునా నన్ను స్థావర జంగమములగు సకల భూతములకు సనాతనమగు కారణముగ దెలిసికొనుము. వివేకులగు వారి వివేక బుద్ధిని నేను మరియు తేజోవంతులగువారి తేజస్సును గూడ నేనే అయియున్నాడను.

శ్లో॥ బలం బలవతాం మస్మి కామరాగ వివర్జితమ్ ।
ధర్మావిరుద్ధో భూతేషు కామోఽస్మి భరతర్షభ! ॥ 11

భరతశ్రేష్ఠా! బలవంతులగు వారియందుండు కామ, రాగ

విసర్జితమగు స్వధర్మానుష్ఠాన సామర్థ్యమును నేనే అయియున్నాడను మరియు జీవులలో నుండు శాస్త్ర విరుద్ధము కాని కామమును నేనే.

శ్లో॥ యే చైవ సాత్త్వికా భావా రాజసా స్తామసాశ్చ యే ।
మత్త ఏవేతి తాన్విద్ధి న త్వహం తేషు తే మయి ॥ 12

సాత్త్వికములగు పదార్థములును రాజసికమగు పదార్థములును తామసిక పదార్థములును భావములును యేవేవికలవో అవన్నియు నా నుండియే కలిగినవని తెలిసికొనుము. కాని నేను వాని యధీనుడను కాను. అవి యన్నియు నా యధీనములు.

శ్లో॥ త్రిభి ర్గుణమయై ర్భావై రేభి స్సర్వమిదం జగత్ ।
మోహితంనాభిజానాతిమా మేభ్యః పరమవ్యయం ॥ 13

త్రిగుణ జాతములగు ఈరాగ ద్వేష మోహాదులవలన భ్రాంతి నంది ప్రాణి సమూహము, ఈ గుణ జాతకములగు భావములకంటె విలక్షణమగు, సర్వవికారవర్జితమగు నన్ను తెలిసికొనజాలకున్నది.

శ్లో॥ దైవీ హ్యేషా గుణమయీ మమ మాయా దురత్యయా ।
మామేవ యే ప్రపద్యంతే మాయా మేతాంతరన్తి తే ॥ 14

త్రిగుణాత్మకమగు నామాయ, అలౌకికము. అనగా దైవికపద్ధతి గనుక దానినతిక్రమించుట అత్యంత కష్టము. కాని యెవరు యితర సాధనలలో తృప్తి జెందక నన్నే ఆశ్రయించుచున్నారో వారే దుస్తరమగు ఈమాయ నతిక్రమించి నన్ను దెలిసికొని ముక్తులగుచున్నారు.

శ్లో॥ న మాం దుష్కృతినో మూఢాః ప్రపద్యంతే నరాధమాః ।
మాయయాపహృతజ్ఞానా ఆసురం భావమాశ్రితాః ॥ 15

దుష్కర్ములును అజ్ఞులును నీచులును అగువారి వివేకము మాయవలన కప్పబడిపోయినందున వారు అసుర స్వభావమును పొంది నన్ను భజింపకున్నారు.

శ్లో॥ చతుర్విధా భజన్తే మాం జనా స్సుకృతినోఽర్జున,
ఆర్తో జిజ్ఞాసు రర్థార్థీ జ్ఞానీచ భరతర్షభ. 16

భరతశ్రేష్ఠా! అర్జునా! విపన్నుడు తత్వ జిజ్ఞాసువు అర్థకాామి తత్వజ్ఞాని అను నాలుగుతెరగతుల పుణ్యజనులు నన్ను భజించుచున్నారు.

శ్లో॥ తేషాం జ్ఞానీ నిత్యయుక్త ఏకభక్తి ర్విశిష్యతే,
ప్రియోహి జ్ఞానినోఽత్యర్థ మహం సచ మమప్రియః 17

యీ నలువురిలో సర్వదా నా యందు సమాహితుడగువాడు ఏకనిష్ఠుడునగు తత్వజ్ఞాని శ్రేష్ఠుడు యేలయననేను జ్ఞానికి అత్యంతము ప్రియుడను అతడు కూడా నాకు అత్యంతమూ ప్రియుడు.

శ్లో॥ ఉదారా స్సర్వ ఏవైతే జ్ఞానీ త్వాత్మైవ మే మతమ్.
ఆస్థిత స్సహి యుక్తాత్మా మామేవానుత్తమాం గతిమ్ 18

వీరందరును గూడ గొప్పవారు. నాకు ప్రియులును గూడ. యే భక్తుడును నా కప్రియుడు కాడు. కాని జ్ఞాని నాకత్యంతము ప్రియుడు యేమన జ్ఞాని నా ఆత్మ స్వరూపుడు. ఇది నా నిశ్చితాభిప్రాయము. ఆత్మ సమాహితుడగు ఈ జ్ఞాని నన్నే పరమగతిగ ఆశ్రయించుకొని యుండును.

శ్లో॥ బహూనాం జన్మనామన్తే జ్ఞానవాన్ మాం ప్రపద్యతే,
వాసుదేవ స్సర్వమితి స మహాత్మా సుదుర్లభః. 19

బహు జన్మముల సాధనా ఫలముగ తుది జన్మమందు తత్వజ్ఞానియై ఈ జగత్తు వాసుదేవుడేయని గ్రహించి నన్ను భజించును గనుక అట్టి మహాపురుషుడు అత్యంతము దుర్లభుడు.

శ్లో॥ కామై స్తైస్తై ర్హృతజ్ఞానాః ప్రపద్యన్తేఽన్య దేవతాః,
తంతం నియమ మాస్థాయ ప్రకృత్యా నియతా స్స్వయా. 20

పుత్రపశు స్వర్గాది వాంఛల వలన నష్ట వివేకులగువారు ఆయా

కోరికలకు తగిన జప వ్రతస్నానాది నియమములను ఆచరించి తమ స్వభావమునకు వశీభూతులై యితర దేవతలను సేవించుచున్నారు.

శ్లో॥ యో యో యాం యాం తనుం భక్తశ్శ్రద్ధయార్చితు మిచ్ఛతి
తస్య తస్యాచలాం శ్రద్ధాం తామేవ విదధామ్యహమ్. 21

ఏయే భక్తులు ఏయే దేవమూర్తులను శ్రద్ధతో అర్చింపబూను దురో నేను ఆయా భక్తులకు ఆయా దేవతారూపములయందు దృఢమగు భక్తిని గలుగజేయుచున్నాడను.

శ్లో॥ స తయా శ్రద్ధయా యుక్తస్తస్యారాధన మీహతే,
లభతేచ తతః కామాన్ మయైవ విహితాన్ హితాన్. 22

అభక్తుడు అట్టి శ్రద్ధాయుక్తుడై ఆ దేవతారాధనము నొనర్చును ఆ దేవతనుండి ఆయా కోరికలు ఫలించును కాని అవి నేను యేర్పాటు చేసినవేయని తెలుసుకోనను.

శ్లో॥ అన్తవత్తు ఫలం తేషాం తద్భవత్యల్పమేధసామ్,
దేవాన్ దేవయజో యాన్తి మద్భక్తాయాన్తి మామపి. 23

అల్పబుద్ధులగు నా వ్యక్తుల ఆరాధనా లబ్ధమగు ఆ ఫలము లశాశ్వతము. దేవతోపాసకులు దేవతలనే పొందుచున్నారు. మరి నా భక్తులో అనాద్యనంతరమును పరమానందమగు నన్ను బొందుచున్నారు.

శ్లో॥ అవ్యక్తం వ్యక్తి మాపన్నం మన్యన్తే మామబుద్ధయః,
పరంభావ మజానన్తో మమావ్యయ మనుత్తమమ్. 24

అల్పబుద్ధులగువారు నిత్యమును సర్వోత్తమమును అగు నా స్వరూపమును గ్రహింపక ప్రపంచాతీతుడను అగు నన్ను దేహ విశిష్టునిగా భావించుచున్నారు.

శ్లో॥ నాహంప్రకాశ స్సర్వస్య యోగమాయాసమావృతః,
మూఢోఽయం నాభిజానాతి లోకా మామజ మవ్యయమ్. 25

త్రిగుణాత్మయగు మాయవలన ఆవరింపబడియుండుటచే అంద రకును గోచరింపకున్నాను. కనుక మోహావృతమగు ఈ జగత్తు జన్మమృత్యు రహితమగు నా అవ్యయ స్వరూపమును గ్రహింపజాల కున్నది.

శ్లో॥ వేదాహం సమతీతాని వర్తమానాని చాఽర్జున,
భవిష్యాణి చ భూతాని మాం తు వేద న కశ్చన. 26

పార్థా నేను భూత భవిష్యద్వర్తమాన భూతముల నన్నిటిని యెరుగుదును కాని నన్ను యెవ్వరును యెరుగజాలరు

శ్లో॥ ఇచ్ఛాద్వేషసముత్థేన ద్వంద్వమోహేన భారత,
సర్వభూతాని సమ్మోహం సర్గే యాన్తి పరంతప. 27

అర్జునా జన్మముతోడనే ఇష్టానిష్టముల వలన కలుగు సుఖ దుఃఖ నిమిత్తమగు బుద్ధి భ్రాంశమున ప్రాణులందరును మోహమును పొందుచున్నారు.

శ్లో॥ యేషాం త్వన్తగతం పాపం జనానాం పుణ్యకర్మణామ్,
తే ద్వంద్వ మోహనిర్ముక్తా భజన్తే మాం దృఢవ్రతాః. 28

కాని యే పుణ్యశీలురగు జనుల పాపము సమాప్తమైనదో వారు ద్వంద్వ మోహములనుండి విడిబడి దృఢ నిష్ఠతో నన్ను భజించు చున్నారు.

శ్లో॥ జరామరణమోక్షాయ మా మాశ్రిత్య యతన్తి యే,
తే బ్రహ్మ తద్విదుః కృత్స్న మధ్యాత్మం కర్మచాఖిలమ్. 29

జరామరణములనుండి ముక్తులు కాగోరి యెవరు నన్నాశ్రయించి సాధన యొనర్చుచున్నారో వారు పరబ్రహ్మమును ఆత్మను కర్మముల నన్నిటిని గ్రహింపగలుగుచున్నారు.

శ్లో॥ సాధిభూతాధిదైవం మాం సాధియజ్ఞం చ యేవిదుః,
ప్రయాణకాలేపిచ మాం తే విదు ర్యుక్తచేతసః. 30

అధిభూత, అధిదైవ, అధియజ్ఞములతో గూడినన్న యెవ్వారె రుంగుదురో అసమాహిత చిత్తులగు వ్యక్తులు మృత్యుకాలమునగూడ నన్ను యెరుగగలరు. అనగా కృష్ణ నిర్ణయ భక్తియే యత్నముతో చేసినను బ్రహ్మ జ్ఞానము లభింపజేయునని నిర్ణయము.

సప్తమాధ్యాయ సమాప్తము.

—♦—

అస్పర్శయోగము అనే
శ్రీ మద్భగవద్గీత
రాజయోగీయము
అష్టమాధ్యాయము
అక్షరపరబ్రహ్మయోగము

అర్జున ఉవాచ :

శ్లో॥ కిం తద్బ్రహ్మ? కిమధ్యాత్మం? కిం కర్మ? పురుషోత్తమ!
అధిభూతం చ కిం ప్రోక్త మధిదైవం కిముచ్యతే? 1

పురుషోత్తమా బ్రహ్మమన యేది. అధ్యాత్మమననేమి? కర్మ స్వరూపమెట్టిది? అధి భూతమని దేని నందురు? ఏది అధి దైవమని చెప్పబడును. 5 ప్రశ్నలు.

శ్లో॥ అధియజ్ఞః కథం కోఽత్ర? దేహేఽస్మిన్మధుసూదన!
ప్రయాణకాలేచ కథం జ్ఞేయోఽసి నియతాత్మభిః 2

మధుసూదనా! ఈ శరీరమున అధిష్టించి సమస్త కర్మలను నియమించుచు ఫలముల నొసగు వాడెవడు? అతడెట్లు యీ శరీరమున వెలయుచున్నాడు? మృత్యు సమయమున నియతచిత్తులగు వ్యక్తులు యే ప్రాయమున నిన్ను తెలుసుకోగలుగుచున్నారు? (మూడు ప్రశ్నలు)

భగవాన్ ఉవాచ :

శ్లో॥ అక్షరం బ్రహ్మపరమం స్వభావోఽధ్యాత్మముచ్యతే,
భూతభావోద్భవకరో విసర్గః కర్మసంజ్ఞితః. 3

వినాశము లేనిది మూలకారణమగునదియే పరమగు బ్రహ్మము అది ప్రతి దేహమున ప్రత్యగాత్మ పద్ధతి బొందుటయే అధ్యాత్మమని చెప్పబడుచున్నది. జీవుల సృష్టి స్థితులకు కారణమగు విసర్జనము కర్మమని చెప్పబడుచున్నది.

శ్లో॥ అధిభూతం క్షరో భావః పురుషశ్చాధిదైవతమ్,
అధియజ్ఞోఽహమేవాత్ర దేహే దేహభృతాంవర! 4

నరశ్రేష్ఠుడవగు అర్జునా! నశించునవియగు దేహాదులగు పదార్థములే అధిభూతమని చెప్పబడుచున్నవి. పురుషుడు అనగా హిరణ్యగర్భుడు అధిదైవతము మరియు యీ శరీరమున నేనే విష్ణువనంబడు యజ్ఞాధిష్ఠాన దేవతను. యజ్ఞప్రవర్తకుడను. యజ్ఞఫలదాతను.

శ్లో॥ అన్తకాలే చ మామేవ స్మరన్ముక్త్వా కళేబరమ్,
యః ప్రయాతి సమద్భావం యాతి నాస్త్యత్ర సంశయః. 5

మృత్యుసమయమున నన్నే స్మరించుచు శరీరమును త్యజించి యెవడు ప్రయాణ మొనర్చునో అతడు నా స్వరూపమును పొందును యీ విషయమున యేలాటి సందేహము లేదు.

శ్లో॥ యం యం వాఽపి స్మరన్భావం త్యజత్యన్తే కళేబరమ్,
తం తమేవైతి కౌన్తేయ! సదా తద్భావభావితః 6

మరణ సమయమున యెవడెవడు యేయే దేవతా భావమును చింతించుచు శరీరమును విడుచుచున్నాడో అతడా దేవతాభావమునే పొందుచున్నాడు.

శ్లో॥ తస్మాత్సర్వేషు కాలేషు మామనుస్మర యుధ్య చ,
మయ్యర్పితమనోబుద్ధి ర్మామేవైష్యస్యసంశయః. 7

కనుక అన్ని వేళలయందు నన్ను స్మరించుము. యుద్ధము నొనర్పుము. నా యందున మనోబుద్ధుల నర్పించిన నిస్సందేహముగా నన్నే పొందుదువు.

శ్లో॥ అభ్యాసయోగయుక్తేన చేతసా నాన్యగామినా,
పరమం పురుషం దివ్యం యాతి పార్థానుచిన్తయన్. 8

అర్జునా! అభ్యాసమను వుపాయముతో కూడినదియును. యితర విషయముల దెరకు బోనిదియును అగు చిత్తముతో స్మరించుచున్న పురుషుడు, జ్యోతిర్మయుడగు పరమేశ్వరున్ని పొందును.

శ్లో॥ కవిం పురాణమనుశాసితారం మణోరణీయాంసమనుస్మరేద్యః
సర్వస్య ధాతారమచిన్త్యరూప మాదిత్యవర్ణం తమసఃపరస్తాత్. 9

శ్లో॥ ప్రయాణకాలే మనసాఽచలేన భక్త్యాయుక్తో యోగబలేనచైవ
భ్రువోర్మధ్యే ప్రాణమావేశ్య సతం పరంపురుషము
పైతిదివ్యమ్. 10

మృత్యు సమయమున భక్తియుక్తుడై యేకాగ్ర చిత్తమున భ్రూమధ్యమునందే ప్రాణమును సంపూర్ణముగా నిల్పి. సర్వజ్ఞుడును అనాదియును సూక్ష్మమగు దాని కంటెను. సూక్ష్మమగువాడును. అచింత్యస్వరూపుడును, సూర్యునివలె స్వప్రకాశించువాడును. మోహాంధకారమునకు ఆవలనుండువాడునగు పురుషుని స్మరించునో అతడు జ్యోతిర్మయుడగు పురుషుని పొందును.

శ్లో॥ యదక్షరం వేదవిదో వదన్తి విశన్తి యద్యతయో వీతరాగాః,
యదిచ్ఛన్తో బ్రహ్మచర్యం చరన్తి తత్తే పదం సంగ్రహేణ ప్రవక్ష్యే 11

వేదజ్ఞులు దేనిని అవినాశియగు పురుషుడని చెప్పుచున్నారో నిస్పృహులగు యతులు దేనియందు ప్రవేశించుచున్నారో దేనిని తెలిసికొనగోరి గురుకులవాసము పాలించుచున్నారో ఆబ్రహ్మ పదమును నీకు సంక్షేపముగా చెప్పెదను.

శ్లో॥ సర్వద్వారాణి సంయమ్య మనో హృది నిరుధ్య చ,
మూర్ధ్న్యాధాయాత్మనః ప్రాణమాస్థితో యోగధారణామ్ 12

శ్లో॥ ఓమిత్యేకాక్షరం బ్రహ్మ వ్యాహరన్మామనుస్మరన్,
యః ప్రయాతి త్యజన్దేహం స యాతి పరమాం గతిమ్. 13

యింద్రియములనన్నిటిని యేక మొనర్చి మనస్సును హృదయ పుండరీకమున నిలిపి ప్రాణమును, సహస్రారమున నిలిపి ఆత్మయోగమున వెలయుచు ఓం అను యేకాక్షర బ్రహ్మమును వుచ్చరించుచు నన్ను స్మరించుచు శరీరమును వీడి యెవ్వడు ప్రయాణ మొనర్చుచున్నాడో అతడు ఉత్తమమగు గతిని పొందుచున్నాడు.

శ్లో॥ అనన్యచేతాస్సతతం యో మాం స్మరతి నిత్యశః,
తస్యాహం సులభః పార్థ! నిత్యయుక్తస్య యోగినః

యెవడు అనన్య చిత్తుడై నన్నుయావజ్జీవము నిరంతరము స్మరించుచుండునో సదా సమాహిత చిత్తుడగు యోగికి నేను సహజముగనే లభించగలను.

శ్లో॥ మాముపేత్య పునర్జన్మ దుఃఖాలయ మశాశ్వతమ్,
నాప్నువన్తి మహాత్మానః సంసిద్ధిం పరమాం గతాః. 15

సర్వోత్తమమగు సిద్ధినిపొందిన మహాత్ములు నన్నుచేరి అనిత్యము దుఃఖ పద్ధతియగు పునర్జన్మము పొందరు.

శ్లో॥ ఆబ్రహ్మభువనాల్లోకాః పునరావర్తినోఽర్జున!
మాముపేత్య తు కౌన్తేయ! పునర్జన్మ న విద్యతే. 16

అర్జునా భూలోక మాదిగా బ్రహ్మ లోకమువరకుగల లోకములన్నియును పునరావృత్తితో గూడుకొనినవి కాని అర్జునా నన్ను బొందినవారికి మరి జన్మము కలుగదు.

శ్లో॥ సహస్రయుగపర్యన్త మహర్యద్బ్రహ్మణో విదుః,
రాత్రిం యుగసహస్రాన్తాం తేఽహోరాత్రవిదో జనాః 17

వెయ్యి యుగముల నిర్ణయ పద్ధతిగల బ్రహ్మ యొక్క దినమును అట్టి నిర్ణయ పద్ధతిగల రాత్రిని యెవరు తెలియుచున్నారో ఆయోగులు దివారాత్రము యొక్క తత్వము నెరిగినవారని నిర్ణయము.

శ్లో॥ అవ్యక్తా ద్వ్యక్తయః సర్వాః ప్రభవన్త్యహరాగమే,
రాత్ర్యాగమే ప్రలీయన్తే తత్రైవాఽవ్యక్తసంజ్ఞకే. 18

బ్రహ్మయొక్క పగలు అయినతోడనే చరాచరములగు వస్తువులన్నియు అవ్యక్తమునుండి జన్మించుచున్నవి. బ్రహ్మ యొక్క రాత్రి అయినతోడనే అవ్యక్తమగు దానియందే విలీనమగుచున్నవి.

శ్లో॥ భూతగ్రామ స్స ఏవాయం భూత్వా భూత్వా ప్రలీయతే,
రాత్ర్యాగమేఽవశః పార్థ! ప్రభవ త్యహరాగమే. 19

అర్జునా! పూర్వముండిన ప్రాణసమూహమే మరల మరల పుట్టి బ్రహ్మయొక్క రాత్రి అయినప్పుడు లయమందుచున్నవి. బ్రహ్మము యొక్క పగలు అయిన తమ తమ కర్మముల కధీనమై పుట్టుచున్నవి.

శ్లో॥ పరస్తస్మాత్తు భావోఽన్యో వ్యక్తోఽవ్యక్తాత్సనాతనః,
యస్స సర్వేషు భూతేషు నశ్యత్సు న వినశ్యతి. 20

కాని ఆప్రజాపతి నిద్రారూపమునగు అవ్యక్తముకంటె వేరగు మరియొక యింద్రియాగోచరమును అనాదియునగు యే బ్రహ్మము కలదో అయ్యది సమస్త భూతములు నశించినను అది వినాశము బొందదు.

శ్లో॥ అవ్యక్తోఽక్షరఇత్యుక్త స్తమాహుఃపరమాంగతిమ్,
యంప్రాప్య ననివర్తన్తే తద్ధామ పరమం మమ. 21

యింద్రియాగోచరమునువినాశరహితమును అని దేనినిశాస్త్రము వర్ణించుచున్నదో. దానినే శ్రేష్ఠమగు గతియని అందురు. యే అక్షరమును పొందిన తిరిగివచ్చుచుండుటలేదో అయ్యది నా శ్రేష్ఠమగు పదము.

శ్లో॥ పురుష స్సపరః పార్థ! భక్త్యా లభ్య స్త్వనన్యయా,
యస్యా న్తస్థాని భూతాని యేన సర్వమిదంతతమ్. 22

అర్జునా! జీవులందరును యెవనిమధ్య వెలయుచున్నవో యెవని వలన యీ జగత్తు అంతయును వ్యాప్తమైయున్నదో ఆ పరుడైన పురుషుని యేకాంతమగు భక్తివలన పొందవగును.

శ్లో॥ యత్రకాలేత్వనావృత్తి మావృత్తించైవ యోగినః,
ప్రయాతా యాన్తితం కాలం వక్ష్యామి భరతర్షభ. 23

భరతర్షభా! యేకాలమున మృతులైన వుపాసకులును. కర్మిష్ఠులును యథాక్రమముగా మోక్షమును పునర్జన్మమును బొందెదరో ఆ కాలమును గురించి చెప్పెదను.

శ్లో॥ అగ్నిర్జ్యోతి రహాశ్శుక్ల షణ్మాసా ఉత్తరాయణమ్,
తత్ర ప్రయాతా గచ్ఛన్తి బ్రహ్మ బ్రహ్మవిదో జనాః. 24

అగ్నిజ్యోతి దినము, శుక్లపక్షము, షణ్మాసయుక్తమగు వుత్తరాయణము, అనునవిగల దేవయానమార్గమున ప్రయాణ మొనర్చిన పరమేశ్వరోపాసకులు బ్రహ్మమును బొందుచున్నారు.

శ్లో॥ ధూమోరాత్రి స్తథాకృష్ణ షణ్మాసాదక్షిణాయనమ్,
తత్ర చాన్ద్రమసం జ్యోతి ర్యోగీ ప్రాప్య నివర్తతే. 25

ధూమము రాత్రి కృష్ణపక్షము ఆరు మాసములుగల దక్షిణాయణము అనువానితో గూడిన పితృయాన మార్గమున జనిన కర్మపరుడు చంద్రలోకమునకు బోయి జన్మాదులకు తిర్గివచ్చుచున్నాడు.

శ్లో॥ శుక్లకృష్ణేగతి హ్యేతే జగత శ్శాశ్వతే మతే,
ఏకయా యాత్యనావృత్తి మన్యయా వర్తతే పునః 26

జగత్తున శుక్లగతియును కృష్ణగతియును రెండు మార్గంబులు శాశ్వతములని గ్రహింపుము. దేవయాన మార్గమున అరిగినవారు క్రమముక్తినందుచున్నారు. పితృయాన మార్గమున చనినవాడు తిరిగి వచ్చి నురల జన్మించుచున్నాడు.

శ్లో॥ నైతే సృతీ పార్థ జానన్ యోగీ ముహ్యతి కశ్చన,
తస్మాత్సర్వేషు కాలేషు యోగయుక్తో భవార్జున. 27

అర్జునా యీ రెండు మార్గములను యెరిగిన యే వొక్క-వుపాసకుడుగాని, లేక కర్మపరుడుగాని మోహాగ్రస్తుడుకాడు అనగా అనిత్యములును వుపాసనార్జితములగు కర్మలదెసకుపోడు. పరమేశ్వర నిష్టుడగును. కనుక అర్జునా! నీవు సర్వదా సమాహిత చిత్తుడవుకమ్ము.

శ్లో॥ వేదేషు యజ్ఞేషు తపస్సు చైవ
దానేషు యత్పుణ్యఫలంప్రదిష్టమ్,
అత్యేతి తత్సర్వ మిదం విదిత్వా
యోగీ పరంస్థాన ముపైతి చాద్యమ్. 28

వేదాధ్యయనము వలన యజ్ఞాది కర్మానుష్ఠానమున శరీరశోషణాదులవలన, సత్పాత్ర దానాదులవలన, యే పుణ్యఫలము శాస్త్రములందు చెప్పబడినవో సమాహిత చిత్తుడగు వ్యక్తి ఆ సర్వమును అతిక్రమించును. మరియు జగన్మూల భూతమును శ్రేషమును అగు పదమును పొందును.

అష్టమోధ్యాయము సమాప్తము

అస్పర్శయోగము అనే
శ్రీ మద్భగవద్గీత

రాజయోగీయము

నవమోధ్యాయము

రాజవిద్యా రాజగుహ్యయోగము

శ్లో॥ ఇదం తు తే గుహ్యతమం ప్రవక్ష్యా మ్యనసూయవే,
జ్ఞానం విజ్ఞానసహితం యజ్జ్ఞాత్వా మోక్ష్యసేఽశుభాత్. 1

శ్రీ కృష్ణుడు పల్కెను. దేనిని తెలిసికొనిన సంసారబంధము నుండి విడువడగలవో అట్టి ఈ అత్యంత రహస్యమును అనుభవయుక్తమును అగు బ్రహ్మ జ్ఞానమును, దోషదృష్టిలేని నీకు వుపదేశించుచున్నాను.

శ్లో॥ రాజవిద్యా రాజగుహ్యం పవిత్ర మిద ముత్తమమ్,
ప్రత్యక్షావగమం ధర్మ్యం సుసుఖం కర్తు మవ్యయమ్. 2

ఈ బ్రహ్మ విద్యలన్నింటిలో శ్రేష్ఠమైనది, అతిగుహ్యము, అనధికారికి అగమ్యము, శ్రేష్ఠమైనది, విశుద్ధకరము, సాక్షాత్తుగా ఫలము నొసగునది, ధర్మసంగతము, అనుష్ఠింప మిక్కిలి తేలికయు మరియు అక్షయ ఫలప్రదమును అయియున్నది.

శ్లో॥ అశ్రద్దధానాః పురుషా ధర్మస్యాస్య పరంతప,
అప్రాప్య మాం నివర్తన్తే మృత్యుసంసారవర్త్మని. 3

అర్జునా! ఈ బ్రహ్మజ్ఞానమను ధర్మముయొక్క స్వరూపఫలమును యెడశ్రద్ధా హీనులగు పురుషులు నన్ను పొందక మృత్యుమయమగు సంసార పథమున పరిభ్రమించుచున్నారు.

శ్లో॥ మయా తత మిదం సర్వం జగదవ్యక్తమూర్తినా,
మత్ స్థాని సర్వభూతాని నచాహం తే ష్వవస్థితః. 4

అతీంద్రియ స్వరూపుడను కారణ భూతుడను అగు నాచే ఈ విశ్వమంతయు వ్యాప్తమైయున్నది. పంచభూతములు నాయందు వున్నవి నేను వానియందు వుండుటలేదు.

శ్లో॥ నచమత్ స్థాని భూతాని పశ్య మే యోగ మైశ్వరమ్,
భూతభృన్నచ భూతస్థో మమాత్మా భూతభావనః. 5

నా యోగైశ్వర్యమును చూడుము. భూతములు నాయందుం డుటలేదు. నా స్వరూపము భూతములను ధరించునదియును పాలించునదియును అయినను నేను భూతములయందు లేను.

శ్లో॥ యథాకాశస్థితో నిత్యం వాయు స్సర్వత్రగో మహాన్,
తథాసర్వాణి భూతాని మత్ స్థానీ త్యుపధారయ. 6

యెట్లు అంతటను దిరుగు గొప్పదగు వాయువు సదా ఆకాశమున వెలయుచున్నదో అట్లే సకల భూతములును నాయందు వెలయుచున్నవి అని గ్రహింపుము.

శ్లో॥ సర్వభూతాని కౌన్తేయ ప్రకృతిం యాన్తి మామికామ్,
కల్పక్షయే పునస్తాని కల్పాదౌ విసృజా మ్యహమ్. 7

కుంతీపుత్రా! ప్రళయకాలమున సర్వభూతములును నాత్రిగుణాత్మకమగు మాయయందు లీనమగుచున్నవి.మరల కల్పారంభమున నేను వానిని సృష్టించుచున్నాడను.

శ్లో॥ ప్రకృతిం స్వా మవష్టభ్య విసృజామి పునఃపునః,
భూతగ్రామ మిమంకృత్స్న మవశం ప్రకృతే ర్వశాత్. 8

నా అవిద్యా రూపమగు ప్రకృతిని వశమొనర్చుకొని పూర్వ సంస్కారానుసారము ఈసమస్తమును జనన మరణముల కధీనమునగు భూతసమూహమును మరలమరల సృష్టించుచున్నాను.

శ్లో॥ నచ మాం తాని కర్మాణి నిబధ్నన్తి ధనంజయ!
ఉదాసీనవ దాసీన మసక్తం తేషు కర్మసు. 9

అర్జునా ఆ కర్మములయందు నాకాసక్తిలేదు. తటస్థునివలె వెలయునన్ను అవి బంధింపజాలవు.

శ్లో॥ మయాధ్యక్షేణ ప్రకృతి సూయతే సచరాచరమ్.
హేతునానేన కౌన్తేయ! జగద్విపరివర్తతే. 10

కుంతీపుత్రా! నా అధిష్ఠానమున త్రిగుణాత్మకమగు మాయ స్థావర జంగమాత్మకమగు జగత్తును సృష్టించుచున్నది. ఈ కారణమున వ్యక్తావ్యక్తమగు విశ్వము వివిధ రూపముల పరివర్తనము నందుచున్నది.

శ్లో॥ అవజానన్తి మాంమూఢా మానుషీంతను మాశ్రితమ్,
పరంభావ మజానన్తో మమ భూతమహేశ్వరమ్. 11

సర్వభూతేశ్వరుడనగు నా పరమ తత్త్వమును మోహక మూఢులు మానవ దేహమును ధరించిననన్ను అవజ్ఞనొనర్చుచున్నారు.

శ్లో॥ మోఘాశామోఘకర్మాణో మోఘజ్ఞానావిచేతసః.
రాక్షసీ మాసురీంచైవ ప్రకృతిం మోహినీం శ్రితాః 12

వ్యర్థకాములును విఫలకర్ములును నిష్ఫలజ్ఞానులును, వివేకశూన్యులును అగు వ్యక్తులు దేహాత్మబుద్ధిని కలిగించు తామసరాజసస్వభావముగల రాక్షసులు అసురులు నన్ను అవమానించుచున్నారు.

శ్లో॥ మహాత్మానస్తు మాం పార్థ! దైవీం ప్రకృతి మాశ్రితాః.
భజన్త్యనన్యమనసో జ్ఞాత్వా భూతాది మవ్యయమ్ 13

కాని పార్థా దైవీస్వభావమును ఆశ్రయించిన మహాత్ములు అనన్యమనస్కులగుచు నన్ను జగత్కారణముగను, నిత్యునిగను ఎరిగి భజించుచున్నారు.

శ్లో॥ సతతం కీర్తయన్తో మాం యతన్తశ్చ దృఢవ్రతాః,
నమస్యన్తశ్చ మాం భక్త్యా నిత్యయుక్తా ఉపాసతే, 14

వారు సదా నన్ను కీర్తించుచు యేక నిష్ఠులై ప్రయత్నశీలురై పరమ ప్రీతిపూర్వకముగ నమస్కరించుచు సర్వదా సమాహితచిత్తులై నన్ను వుపాసించుచున్నారు.

శ్లో॥ జ్ఞానయజ్ఞేన చాప్యన్యే యజన్తో మా ముపాసతే,
ఏకత్వేన పృథక్త్వేన బహుధా విశ్వతో ముఖమ్. 15

యితరులు కొందరు భగవత్ విషయకమగు జ్ఞానము అను యజ్ఞమువలన పూజించుచు నన్ను వుపాసించుచున్నారు. బ్రహ్మైకత్వ రూపమగు పరమార్థ దర్శనము వలనను భగవంతుడగు విష్ణువే చంద్రాదిత్యాది రూపముల వేరువేరుగా వెలయుచున్నాడు అని గ్రహించియును విశ్వరూపుడనగు నన్ను రుద్రాదిత్యాది నామములచే బహు విధముల వుపాసించుచున్నారు.

శ్లో॥ అహం క్రతు రహం యజ్ఞ స్స్వధాహ మహ మౌషధమ్,
మన్త్రోహ మహమే వాజ్య మహమగ్ని రహం హుతమ్. 16

శ్రౌతయజ్ఞము, స్మార్తయజ్ఞము, శ్రాద్ధకర్మ, ఔషధము, హోమఘృతము, హోమాగ్ని, హవనక్రియ ఇవన్నియుగూడ నేనే.

శ్లో॥ పితాహ మస్య జగతో మాతాధాతా పితామహః,
వేద్యం పవిత్ర మోఙ్కార ఋక్సామయజురేవచ. 17

నేనే ఈ జగత్తునకు జనకుడను తల్లిని కర్మఫలదాతను తాతను జ్ఞేయమును శోధకములగు ప్రాయశ్చిత్తాదులును ప్రణవమును ఋగ్వేదమును సామవేదమును యజుర్వేదమును గూడా నేనే.

శ్లో॥ గతి ర్భర్తా ప్రభుస్సాక్షీ నివాస శ్శరణం సుహృత్,
ప్రభవః ప్రళయ స్థానం నిదానం బీజ మవ్యయమ్. 18

నేను కర్మఫలమును, పోషకుడను ప్రభువును సర్వప్రాణుల శుభాశుభముల దృష్టను వాసస్థానమును శరణాగతుల ఆర్తిని హరించు వాడను ప్రత్యుపకారమును గోరక హితమును గూర్చువాడను. సృష్టను సంహర్తను ఆధారమును ప్రళయస్థానమును అక్షయమగు జగత్కా-రణమును అయియున్నాను.

శ్లో॥ తపా మ్యహ మహం వర్షం నిగృహ్ణా మ్యుత్సృజామిచ,
అమృతంచైవ మృత్యుశ్చ సదస చ్చాహ మర్జున. 19

సూర్యరూపమున నేను వేడినొసగుచున్నాను. జలమును ఆక ర్షించుచు వర్షించుచున్నాడను. అమరుల అమృతమును మర్త్యుల మృత్యువును మరియు స్థూలసూక్ష్మములగు వస్తువులుగూడా నేనే.

శ్లో॥ త్రైవిద్యామాం సోమపాః పూతపాపా
యజ్ఞైరిష్ట్వా స్వర్గతిం ప్రార్థయన్తే,
తేపుణ్య మాసాద్య సురేన్ద్రలోక
మశ్నన్తి దివ్యాన్ దివి దేవభోగాన్. 20

త్రివేదజ్ఞులు యజ్ఞములవలన నన్ను పూజించి యజ్ఞశేషమున సోమరసమును త్రాగి పాప విముక్తులై స్వర్గగమనమును ప్రార్థించు చున్నారు. వారు పుణ్యఫలమగు యిందలోకమును పొంది స్వర్గలోక మున మనుష్య దేహమున బొందజాలని దేవభోగములను భోగించు చున్నారు.

శ్లో॥ తేతం భుక్త్వా స్వర్గలోకం విశాలం
క్షీణే పుణ్యే మర్త్యలోకం విశన్తి,
ఏవం త్రయీధర్మ మనుప్రపన్నా
గతాగతంకామకామా లభన్తే. 21

వారు ఫలమును స్వర్గలోకమున భోగించి పుణ్యక్షయమవగానే మనుష్యలోకమునకు తిరిగి వచ్చుచున్నారు. యిట్లు వేదోక్తధర్మము ననుసరించు భోగేచ్ఛాపరులు, జనన మరణ సంసారమును పొందుచున్నారు.

శ్లో॥ అనన్యాశ్చిన్తయన్తో మాం యే జనాః పర్యుపాసతే,
తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్. 22

నన్నే ఆత్మభావమున చింతించుచు ధ్యానమొనర్చు యేక నిష్ఠులగువారి యోగమును, క్షేమమును వహించుచున్నాడను. పొందజేయుచున్నాడను.

శ్లో॥ యేప్యన్యదేవతాభక్తా యజన్తే శ్రద్ధయాన్వితాః
తేపి మామేవ కౌన్తేయ! యజన్త్యవిధిపూర్వకమ్. 23

అర్జునా! ఆస్తిక్య బుద్ధియుక్తులై అన్యదేవతలను పూజించువారు కూడా నన్నే పూజించుచున్నారు. కాని వారు అజ్ఞానపూర్వకముగ భజించుచున్నారు.

శ్లో॥ అహంహి సర్వయజ్ఞానాం భోక్తాచ ప్రభురేవచ.
నతు మామభిజానన్తి తత్త్వేనాతశ్చ్యవన్తి తే. 24

శ్రౌతస్మార్తాదులగు సర్వయజ్ఞములకు నేను దేవతాత్మరూపమున భోక్తను, ఫలదాతనుకూడా కాని అన్య దేవతాభక్తులు స్వరూపతా నన్ను యెరుగరు. అందువలన పునరావృత్తి నందుచున్నారు.

శ్లో॥ యాన్తి దేవవ్రతా దేవాన్ పితౄన్ యాన్తి పితృవ్రతాః,
భూతాని యాన్తి భూతేజ్యా యాన్తి మద్యాజినోపి మామ్. 25

దేవోపాసకులు దేవతలను బొందుచున్నారు. పితృభక్తులు పితృగణమును జేరుచున్నారు. భూతపూజకులు భూతములను బొందు

చున్నారు. నన్ను పూజించువారు నన్నే పొందుచున్నారు. మరల జన్మించరు.

శ్లో॥ పత్రం పుష్పం ఫలం తోయం యో మే భక్త్యా ప్రయచ్ఛతి,
తదహం భక్త్యుపహృత మశ్నామి ప్రయతాత్మనః 26

యెవడు నాకుభక్తిపూర్వకముగా ఆకునో, పుష్పానో, పండునో నీటినో సమర్పించునో శుద్ధచిత్తుడగు ఆ నిష్కామ భక్తుని భక్తితో నొసగబడిన ఆ కానుకలను నేను గ్రహించుచున్నాను.

శ్లో॥ యత్కరోషి యదశ్నాసి యజ్జుహోషి దదాసి యత్,
యత్తపస్యసి కౌన్తేయ! తత్కురుష్వ మదర్పణమ్ 27

కుంతీపుత్రా! దేనిని ఆచరించుచున్నావో, దేనిని భుజించుచున్నావో, దేనిని హోమ మొనర్చుచున్నావో దేనిని దాన మొనర్చుచున్నావో, దేనిని తప మొనర్చుచున్నావో దానిని నాకు సమర్పణ చేయుము.

శ్లో॥ శుభాశుభఫలై రేవం మోక్ష్యసే కర్మబన్ధనైః,
సన్న్యాసయోగ యుక్తాత్మా విముక్తో మాము పైష్యసి. 28

యిట్లు ఆచరించిన ఇష్టానిష్ట ఫలవిశిష్టములగు కర్మబంధముల నుండి ముక్తుడవగుదువు. కర్తృత్వరహిత కర్మసమర్పణ యోగయుక్తుడవై జీవత్కాలముననే ముక్తినంది నన్ను బొందెదవు.

శ్లో॥ సమోహం సర్వభూతేషు నమే ద్వేష్యోస్తి నప్రియః,
యే భజన్తి తు మాం భక్త్యా మయి తే తేషు చాప్యహమ్. 29

నేను సకలభూతముల యెడసమడను. నాకు అప్రియుడు లేడు ప్రియుడును లేడు. కాని నన్ను భక్తిపూర్వకముగ భజించుచున్నారో వారు నాయందు మరియు నేను వారియందు వుందును.

శ్లో॥ అపి చేత్సుదురాచారో భజతే మా మనన్యభాక్,
సాధురేవ సమన్తవ్య స్సమ్య గ్వ్యవసితోహి సః. 30

అత్యంత దురాచారుడగు వాడుకూడ అనన్యచిత్తుడై నన్ను భజించు నెడల అతనిని సాధువనియే యెన్నదగును. యేమన అతని సంకల్పము మిక్కిలి ఉత్తమమైనది. అతడు భగవద్భజన వలన కృతార్థుడనగుదునని నిశ్చయించు కొనినాడు.

శ్లో॥ క్షిప్రం భవతి ధర్మాత్మా శశ్వచ్ఛాన్తిం నిగచ్ఛతి,
కౌన్తేయ! ప్రతి జానీహి నమే భక్తః ప్రణశ్యతి. 31

ఆ దురాచారి నన్ను భజించుచు శీఘ్రముగా ధర్మచిత్తుండగుచున్నాడు. పిదప నిత్యశాంతిని పొందుచున్నాడు. కౌంతేయా, నా భక్తుడెన్నడు వినష్టుడు కాడు. కృతార్థుడేయగును. నిశ్చయముగ గ్రహించి ప్రతిజ్ఞ పూర్వకముగ నుడువుము.

శ్లో॥ మాంహి పార్థ! వ్యపాశ్రిత్య యేపి స్యుః పాపయోనయః,
స్త్రియో వైశ్యాస్తథా శూద్రా స్తేపి యాన్తి పరాంగతిమ్ 32

పార్థా! నికృష్ట జన్ములగు అంత్యజులును కృష్యాది నిరతులగు వైశ్యులును, అన్యాయ నిరతులగు స్త్రీ శూద్రులును గూడ నన్ను సేవించి మోక్షమును తప్పక పొందుచున్నారు.

శ్లో॥ కింపున ర్బ్రాహ్మణాః పుణ్యా భక్తా రాజర్షయ స్తథా,
అనిత్య మసుఖం లోక మిమంప్రాప్య భజస్వ మామ్ 33

సత్కులోద్భవులగు బ్రాహ్మణులను గురించియు మరియు భక్తులగు రాజర్షులను గురించియు యేమి చెప్పనగును. అనగా వారు నన్నాశ్రయించిన తప్పక మోక్షమును బొందుచున్నారు. కనుక నీవు అనిత్య

మును సుఖరహితమును అగు మనుష్యశరీరమును పొంది నన్నే భజింపుము.

శ్లో॥ మన్మనా భవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు,
మామేవైష్యసి యుక్త్వైవ మాత్మానం మత్పరాయణః. 34

మనస్సును నాయందు నిల్పుము. నా భక్తుడవుకమ్ము. నన్నే పూజింపుము. నాకు నమస్కార మొనర్పుము. ఇట్లు నాకె శరణాగతుడవై మనస్సును నాయందు నిల్పిన నన్నే పొందెదవు.

నవమోధ్యాయః సమాప్తః.

అపూర్వయోగము అనే
శ్రీమద్భగవద్గీత
రాజయోగీయము
దశమాధ్యాయము
విభూతి యోగము

శ్రీభగవానువాచ

శ్లో॥ భూయ ఏవ మహాబాహో! శృణు మే పరమం వచః,
యత్తేహం ప్రీయమాణాయ వక్ష్యామి హితకామ్యయా. ౧

శ్రీ భగవానుడు పలికెను. అర్జునా, నీవు నా వాక్యములను సంతోషపూర్వకముగా విని ఆనందించుచున్నావు కనుక నేను నీ హితమునుగోరి మతిపరిమేయము లేని తత్వనిర్ణయము జెప్పుచున్నాను. శ్రద్ధగా వినుము.

శ్లో॥ న మే విదుః సురగణాః ప్రభవం న మహర్షయః
అహమాదిర్హి దేవానాం మహర్షీణాం చ సర్వశః. ౨

ఇంద్రాది దేవతలును భృగ్వాది మహర్షులును గూడా నా వుత్పత్తిని యెరుగరు. యేమన దేవతలకును, మహాఋషులకును గూడ సర్వవిధముల మూలకారణం నేనె గనుక నాకృపలేకున్న నన్నెవ్వరు తెలుసుకొనజాలరు.

శ్లో॥ యో మా మజ మనాదించ వేత్తి లోక మహేశ్వరమ్,
అసమ్మూఢ స్స మర్త్యేషు సర్వపాపైః ప్రముచ్యతే. ౩

యెవ్వడు నన్ను కారణ రహితునిగను జన్మరహితునిగను సర్వలోకేశ్వరునిగను తెలిసికొనునో అతడు మనుష్యులలో భ్రాంతిరహితుడై తెలిసియో తెలియకయో చేసిన పాపములనుండి విడువబడుచున్నాడు.

శ్లో॥ బుద్ధిర్జ్ఞానమసమ్మోహః క్షమా సత్యం దమః శమః,
సుఖం దుఃఖం భవోభావో భయం చాభయమేవచ. 4

శ్లో॥ అహింసా సమతా తుష్టిస్తపో దానం యశోఽయశః,
భవన్తి భావా భూతానాం మత్త ఏవ పృథగ్విధాః. 5

సూక్ష్మ విషయగ్రహణ సామర్థ్యము ఆత్మాది పదార్థముల జ్ఞానము, వ్యాకులత్వాభావము సహిష్ణుత, వినినది విన్నట్లుగను, చూచునది చూచునట్లుగను వచించుట యథార్థభాషణము, బాహ్యేంద్రియ సంయమము అంతరేంద్రియ సంయమము ఆహ్లాదము, సంతాపము, వుత్పత్తి, వినాశము మరియు భీతియును. భయరహితమును, ప్రాణికి పీడ నొనర్పకుండుట సమచిత్తత, సంతోషము మనోవాక్కాయ సంయమము, దానము, ధర్మనిమిత్తమగుకీర్తి. అధర్మనిమిత్తమగు అపకీర్తి మున్నగునవి ప్రాణులకు స్వకర్మానుసారము విభిన్నములగు భావములు నానుండియే వుత్పన్నమగుచున్నవి.

శ్లో॥ మహర్షయః సప్త పూర్వే చత్వారో మనవస్తథా,
మద్భావా మానసా జాతా యేషాం లోక ఇమాః ప్రజాః 6

భృగువు మున్నగు సప్తర్షులును వారికంటెను పూర్వపువారగు సనకుడు మొదలగు నల్వురు ఋషులును. స్వాయంభువాదులగు చతుర్దశ మనువులు నా సంకల్పము నుండియే కలిగినారు. వారు నా మానస పుత్రులు మద్గత చిత్తులగుటచేత నాప్రభావముతో నొప్పుచున్నారు. వీరినుండియే ఈ జగత్తునందలి స్థావరజంగమాత్మకమగు సంతతి కలిగినది.

1) భృగు, మరీచి, అత్రి, పులహ, అంగిర. క్రతు, పులస్త్యులు లేక మరీచి, అంగిర, అత్రి, పులస్త్య, పులహ, క్రతు, వశిష్టులు

2) సనక, సనందన, సనత్కుమార, సనత్సుజాతులు

3) స్వాయంభువ స్వారోచిష, ఉత్తమ, తామస, రైవత, చాక్షుష,
వైవస్వత, దక్షసావర్ణి, బ్రహ్మసావర్ణి, ధర్మసావర్ణి, రుద్ర
సావర్ణి, దేవసావర్ణి, ఇంద్రసావర్ణులు.

శ్లో॥ ఏతాం విభూతిం యోగంచ మమ యోవేత్తి తత్త్వతః,
సోఽవికమ్పేన యోగేన యుజ్యతే నాత్ర సంశయః.

ఎవ్వడు నా ఈ విభూతిని యోగమును యథార్థముగా గ్రహించునో అతడు చలనములేని సమ్యగ్ దర్శనముచేత స్థిరుడగు చున్నాడు. ఈ విషయమున సందేహములేదు.

1) విభూతి అనగా వివిధరూపములుగా తెలియబడుచున్నటువంటి భగవంతుని జీవేశ్వర సర్వాత్మకము 2) యోగమనగా విడివడని స్వరూపము ఏకమని తెలియుట. అనగా పరిగత్య చరమార్థమును నిలిపియున్నదని భిన్నముగా లేదని తెలియుట. యీపద్ధతి తెలిసినవాడు సందేహ రహితముగా స్థిరపద్ధతి కలిగివుండును.

శ్లో॥ అహం సర్వస్య ప్రభవో మత్తః సర్వం ప్రవర్తతే
ఇతిమత్వా భజన్తేమాం బుధా భావసమన్వితాః.

నేను సమస్త జగత్తునకు వ్యుత్పత్తి స్థానమును. నావలననే సమస్తమును కలుగుచున్నది కదలుచున్నది అని యెరిగి జ్ఞానులు భక్తియుక్తులై భజించుచున్నారు.

శ్లో॥ మచ్చిత్తా మద్గతప్రాణా బోధయన్తః పరస్పరమ్
కథయన్తశ్చమాం నిత్యం తుష్యన్తిచ రమన్తిచ.

ఎవ్వరు ప్రాణమనంబులు నాకుఅర్పించి యింద్రియవ్యాపారములు మాని జ్ఞానబల వీర్యాది విశిష్టుడనగు నన్ను అన్యోన్యము బోధించుకొనుచు సంతోషించుచున్నారు.

శ్లో॥ తేషాం సతతయుక్తానాం భజతాం ప్రీతిపూర్వకమ్,
దదామి బుద్ధియోగం తం యేన మా ముపయాన్తి తే ౧౦

ఎవరు నిత్య యుక్తులై ప్రీతితో అన్యవాంఛలు పరిత్యజించి నన్ను భజించుచున్నారో వారికి నేను మతప్రమేయములేని తత్వ విషయకమగు సమ్యగ్జ్ఞానమును ప్రసాదించు చున్నాడను, ఈ జ్ఞానము వల్ల నన్ను వారు పొందుచున్నారు.

శ్లో॥ తేషామేవాను కమ్పార్థ మహ మజ్ఞానజం తమః
నాశయా మ్యాత్మభావస్థో జ్ఞానదీపేన భాస్వతా. ౧౧

భక్తులగువారిని అనుగ్రహింప నేను వారిబుద్ధియందు నెలకొని సమ్యగ్దర్శన దీప్తితో నెలకొనిన వివేక దీపమువలన అవివేక జనిత మగు మోహాంధకారమును వినాశ మొనర్చుచున్నాను.

శ్లో॥ పరంబ్రహ్మ పరంధామ పవిత్రం పరమం భవాన్,
పురుషం శాశ్వతం దివ్య మాదిదేవ మజం విభుమ్. ౧౨

శ్లో॥ ఆహుస్త్వా మృషయ స్సర్వే దేవర్షి ర్నారద స్తథా,
అసితో దేవలో వ్యాస స్స్వయం చైవ బ్రవీషి మే. ౧౩

అర్జునుడుపలికెను. నీవు పరబ్రహ్మమవు తుదకు పరమపదమవు. పరమపావనుడవు. నీవు సర్వవ్యాపి. సనాతనుడవు. దివ్యపురుషుడవు. ఆది దేవుడవు. ఋషులందరును దేవఋషియగు నారదుడును అసితుడును దేవలుడును వ్యాసుడును కూడ నిన్నీవిధముగనే వర్ణించు చున్నారు. నీవుకూడ నాకు అట్లే చెప్పుచున్నావు.

శ్లో॥ సర్వ మేత దృతం మన్యే యన్మాం వదసి కేశవ,
నహి తే భగవన్ వ్యక్తిం విదు ర్దేవా నదానవాః ౧౪

కేశవా, నీవు నాకు చెప్పునది సమస్తమును సత్యమనియే తలచు చున్నాను. దేవా నీ ఆవిర్భావమును దేవతలును దానవులును కూడా యెరుగరు.

శ్లో॥ స్వయమే వాత్మ నాత్మానం వేత్థ త్వం పురుషోత్తమ,
భూతభావన! భూతేశ! దేవదేవ! జగత్పతే. ౧౫

పురుషోత్తమా, భూతోత్పాదకా, జీవనియామకా ఆదిత్యాది దేవతలను ప్రకాశింపజేయువాడ, విశ్వపాలక! నీవు నీయంతట నీవే సాధనాంతర వ్యతీతముగా ఆత్మస్వరూపమున నిన్ను తెలిసికొనుచున్నాడవు.

శ్లో॥ వక్తు మర్హస్య శేషేణ దివ్యా హ్యాత్మ విభూతయః,
యాభి ర్విభూతిభి ర్లోకా నిమాం స్త్వం వ్యాప్య తిష్ఠసి. ౧౬

ని ఆవిర్భావమును దేవాదులుకూడా యెరుగరు గనుక నీవు ఏ యే విభూతులవలన యీలోకముల యందంతటను వ్యాపించియున్నాడవో ఆయా దివ్యములగు ఆత్మవిభూతులను సంపూర్ణముగా వర్ణింప నీవే సమర్థుడవు.

శ్లో॥ కథం విద్యా మహం యోగిన్ త్వాం సదా పరిచిన్తయన్,
కేషు కేషు చ భావేషు చిన్త్యోఽసి భగవన్మయా ౧౭

యోగీశ్వరా నిన్నెట్లు నిరంతరము చింతించిన నేను నిన్ను యెరుగగలను? ఈశ్వరా ఏ యే వస్తువుల నిన్ను నేను ధ్యానింతును?

శ్లో॥ విస్తరేణాత్మనో యోగం విభూతిం చ జనార్దన.
భూయః కథయ తృప్తి ర్హి శృణ్వతో నాస్తి మేఽమృతమ్.

కృష్ణా నీసర్వజ్ఞత్వాదికమగు ఐశ్వర్యమును, వేరువేరుగా ధ్యేయ వస్తువులను యెక్కువగా మరల చెప్పుము. యేమన నీ వాక్యామృతమును వినెడి నాకు పరితృప్తి, చాలుననుభావము కలుగచుండుట లేదు. యింకను వినవలయుననే యున్నది.

శ్రీ భగవానువాచ

శ్లో॥ హంత తే కథయిష్యామి దివ్యాహ్యాత్మ విభూతయః,
ప్రాధాన్యతః కురుశ్రేష్ఠ! నాస్త్యంతో విస్తరస్య మే ౧౯

శ్రీ భగవానుడు పల్కెను. అర్జునా! అట్లయిన అత్యంతము ముఖ్యములును దివ్యములును ధ్యానావలంబన యోగ్యములును అగు వస్తు సమూహములను నీకుజెప్పెదను. నా అవాంతర విభూతులకు అంతము లేదు. కనుక ప్రధానములగు వానిని కొన్నింటిని వర్ణింతును.

శ్లో॥ అహ మాత్మా గుడాకేశ! సర్వభూతాశయస్థితః,
అహ మాదిశ్చ మధ్యంచ భూతానా మంత ఏవచ. ౨౦

అర్జునా! నేను ప్రాణులందరి హృదయమున వెలయు ప్రత్యగాత్మను. మరియు నేనే ప్రాణుల వుత్పత్తి, స్థితి, ప్రళయ కారణమును

శ్లో॥ ఆదిత్యానా మహం విష్ణు ర్జ్యోతిషాం రవి రంశుమాన్,
మరీచి ర్మరుతా మస్మి నక్షత్రాణా మహం శశీ. ౨౧

నేను ద్వాదశాదిత్యులలో విష్ణుడను, ఆదిత్యుడను ప్రకాశమొసగువానిలో కిరణములుగల సూర్యుడను మరుద్గణ సప్తకమున అవహానాముడనగు మరీచిని అయి యున్నాడను. నక్షత్రములకు అధిపతినగు చంద్రుడను నేనే.

శ్లో॥ వేదానాం సామవేదోఽస్మి దేవనా మస్మివాసవః,
ఇన్ద్రియాణాం మనశ్చాస్మి భూతానామస్మి చేతనా ౨౨

వేదములలో నేను సామమును. త్రింశత్ కోటిదేవతలలో నేను ఇంద్రుడను. యేకాదశేంద్రియములలో సంకల్ప వికల్పాత్మకమగు మనస్సును ప్రాణుల శరీరముననుండు జ్ఞానశక్తిని గూడ నేనే.

శ్లో॥ రుద్రాణాం శంకరశ్చాస్మి విత్తేశో యక్షరక్షసామ్,
వసూనాం పావకశ్చాస్మి మేరుశ్శిఖరిణా మహమ్ ౨౩

యేకాదశ రుద్రులలో శంకరుడను. యక్షరాక్షసులలో కుబేరుడను. అష్ట వస్తువులలో అగ్నిని. శిఖరములుగల పర్వతములలో మేరువును అయి యున్నాడను.

శ్లో॥ పురోధసాంచ ముఖ్యం మాం విద్ధి పార్థ బృహస్పతిమ్,
సేనానీ నామహం స్కంద స్సరసామస్మిసాగర: ౨౪

అర్జునా! నేను పురోహితులలో ముఖ్యుడగు బృహస్పతిని. సేనాపతులలో దేవ సేనానాయకుడనగు కుమారుడను. జలాశయములలో సముద్రుడను

శ్లో॥ మహర్షీణాం భృగురహం గిరామస్మ్యేక మక్షరమ్.
యజ్ఞానాం జపయజ్ఞోస్మి స్థావరాణాం హిమాలయః ౨౫

మహాఋషులలో నేను భృగువును. శబ్ద సమూహమున యేకాక్షరమును అనగా బ్రహ్మవాచకమగు ఓంకారమును. శ్రౌత స్మార్తాది యజ్ఞములలో జపరూపమగు యజ్ఞమును. స్థావరపదార్థములలో హిమాలయమును.

శ్లో॥ అశ్వత్థ స్సర్వవృక్షాణాం దేవర్షీణాంచ నారదః.
గంధర్వాణాం చిత్రరథ స్సిద్ధానాం కపిలో మునిః ౨౬

నేను వృక్షములలో అశ్వత్థమును. దేవఋషులలో నారదుడను. గంధర్వులలో చిత్రరథుడను. సిద్ధులలో కపిలుడను. అయియున్నాను.

శ్లో॥ ఉచ్చైశ్శ్రవస మశ్వానాం విద్ధి మామమృతోద్భవమ్.
ఐరావతం గజేంద్రాణాం నరాణాంచ నరాధిపమ్ ౨౭

నన్ను అశ్వములలోవుచ్చైఃశ్రవమునను శ్రేష్ఠములగు యేనుగులలో ఐరావతమునను మనుష్యులలో రాజునను యెరుగుము. శ్రుతి.- నా విష్ణుః పృథివీ పతిః

శ్లో॥ ఆయుధానామహం వజ్రం ధేనూనా మస్మి కామధుక్,
ప్రజనశ్చాస్మి కందర్ప స్సర్పాణామస్మి వాసుకిః ౨౮

ఆయుధములలో వజ్రమును. ఆవులలో కామధేనువును, సంతానోత్పాదకుడనగు మన్మథుడను నేనే. విషయుక్తములగు సర్పములకు అధిపతియగు వాసుకియును గూడ నేనే.

శ్లో॥ అనంతశ్చాఽస్మి నాగానాం వరుణో యాదసా మహమ్,
పితౄణా మర్యమాచాఽస్మి యమస్సంయమతా మహమ్
నేను విషములేని పాములలో అనంతుడను జలదేవతలలో, వరుణుడను పితృదేవతలలో అర్యముడను. నియమించు లేక శాసించు వారిలో యముడను అయియున్నాను.

శ్లో॥ ప్రహ్లాదశ్చాస్మి దైత్యానాం కాలః కలయతా మహమ్.
మృగాణాంచ మృగేంద్రోఽహం వైనతేయశ్చ పక్షిణామ్ 30
దైత్యులలో నేను ప్రహ్లాదుడను. గణకులలో కాలమును, మృగములలో సింహమును, పక్షులలో వినతాసుతుడనగు గరుడుడను నేనే.

శ్లో॥ పవనః పవతామస్మి రామశ్శస్త్ర భృతామహమ్
ఝషాణాం మకరశ్చాస్మి స్రోతసామస్మి జాహ్నవీ 31
పవిత్రమొనర్చు లేక వేగవంతమగు వానిలో వాయువును నేను. ఆయుధ ధారులలో శ్రీరాముడను లేక పరశురాముడను మత్స్యాదులలో మొసలి యనబడు మత్స్యజాతి విశేషమను, నదులలో గంగను.

శ్లో॥ సర్గాణామాదిరంతశ్చ మధ్యంచై వాహమర్జున,
అధ్యాత్మవిద్యా విద్యానాం వాదః ప్రవదతామహమ్ 32
అర్జునా! నేను ఆకాశాది సృష్ట వస్తువు లన్నిటికిని వుత్పత్తి, స్థితి, సంహారకుడనగు కర్తను. విద్యలలో మోక్షప్రదమగు అధ్యాత్మ విద్యను. తార్కికుల వాద, జల్ప, వితండములలో వాదమను

వాదము=తత్వనిర్ణయార్థమగు తర్కము
వితండము=పరపక్ష దూషణము
జల్పము=ఆత్మపక్షసమర్థనము

యీ మూటియందు వాదమే తత్వనిర్ణయ సమర్థముకాన భగవద్విభూతిగా చెప్పబడినది

శ్లో॥ అక్షరాణామకారోఽస్మి ద్వంద్వస్సామాసికస్యచ,
అహమేవాక్షయః కాలో ధాతాఽహం విశ్వతోముఖః 33

అక్షరములలో నేను అకారమును. సమాసములలో ద్వంద్వ సమాసమును ప్రవాహ రూపమగు కాలమును సర్వతో ముఖుడనగు కర్మఫలదాతయును కూడ నేనే

శ్లో॥ మృత్యుస్సర్వహరశ్చాహ ముద్భవశ్చభవిష్యతామ్,
కీర్తిః శ్రీర్వాక్చనారీణాం స్మృతిర్మేధా ధృతిః క్షమా. 3౪

సంహారకులలో నేను సర్వ సంహారకుడనగు మృత్యువును భవిష్యత్తున గొప్పతనమును గలిగించెడి కల్యాణ గుణములలో అభ్యుదయమును. ధర్మపత్నులగు కీర్తి శ్రీ వాక్కు స్మృతి మేధ ధృతి క్షమయును కూడా నేనే.

శ్లో॥ బృహత్సామ తథా సామ్నాం గాయత్రీ ఛందసామహమ్,
మాసానాం మార్గశీర్షోఽహ మృతూనాం కుసుమాకరః. 3౫

అటులనే నేను సామ గీతములలో ఇంద్రుని సర్వేశ్వరునిగా స్తుతించుటచే శ్రేష్ఠమగు బృహత్సామమును. ఛందో విశిష్టమగు ఋక్కులలో గాయిత్రిని. మాసములలో నేను మార్గశీర్షమును ఋతువులలో వసంతమును.

శ్లో॥ ద్యూతం ఛలయతామస్మి తేజస్తేజస్వినామహమ్,
జయోఽస్మి వ్యవసాయోఽస్మి సత్త్వం సత్త్వవతామహమ్. 3౬

నేను వంచన పరులగువారి జూదమును. ప్రభావశాలుర తేజమును, జయశీలుర విజయమును, వుద్యమపరుల వుద్యమమును, సాత్వికులగు పురుషుల సత్వగుణమును, అగుచున్నాను.

శ్లో॥ వృష్ణీనాం వాసుదేవోఽస్మి పాండవానాం ధనంజయః,
మునీనామప్యహం వ్యాసః కవీనాముశనా కవిః 3౭

యాదవులలో నేను శ్రీకృష్ణుడను. పాండవులలో అర్జునుడను. సర్వపదార్థ జ్ఞానులు అగు వారియందు వేదవ్యాసుడను. సూక్ష్మార్థ వివేకముగలవారిలో శుక్రుడను.

శ్లో॥ దండో దమయతా మస్మి నీతి రస్మి జిగీష తామ్,
మౌనం చైవాస్మి గుహ్యానాం జ్ఞానం జ్ఞానవతా మహమ్. ౩౮

నేను దమన మొనర్చువారి దండించువారి దండనీతిని అగుచున్నాడను. జయింపగోరువారి రాజనీతిని అగుచున్నాడను. గోపనీయ విషయములకు సంబంధించిన మౌనము కూడా నేనే. తత్వజ్ఞానుల యందు నా విభూతి జ్ఞాన రూపమున వెలయుచున్నది

శ్లో॥ యచ్చాపి సర్వభూతానాం బీజం తదహ మర్జున,
నతదస్తి వినా యత్స్యాన్మయా భూతం చరాచరమ్. ౩౯

అర్జునా యెయ్యది సర్వభూతములకు మూలకారణమో అయ్యది కూడా నేనే. నేను లేకుండిన స్థావరజంగమాత్మకములగు వస్తువులలో ఏ ఒక్కటియును నా శక్తి లేకుండిన నిలువబడ గలిగినది లేదు.

శ్లో॥ నాంతోఽస్తి మమ దివ్యానాం విభూతీనాం పరంతప,
ఏష తూద్దేశతః ప్రోక్తో విభూతే ర్విస్తరో మయా. ౪౦

అర్జునా దివ్యమగు నా విభూతులకు పరిమితి లేదు. అయినను సంక్షేపముగా ఈ విభూతులను వర్ణన మొనర్చితిని.

శ్లో॥ యద్యద్విభూతిమత్సత్త్వం శ్రీమదూర్జితమేవవా,
తత్త దేవావగచ్ఛత్వం మమ తేజోంశసంభవమ్, ౪౧

ఐశ్వర్య యుక్తమును శ్రీమంతమును సర్వశ్రేష్టమును అగు వస్తు వెయ్యదియైనను కానిమ్ము అది నా శక్తి అంశమునుండి కలిగినది అని నీవు గ్రహింపుము.

శ్లో॥ అథవా బహునైతేన కింజ్ఞాతేన తవార్జున,
విష్టభ్యాహమిదం కృత్స్నమేకాంశేన స్థితో జగత్ ౪౨

అర్జునా నా విభూతులను యింత యెక్కువగా తెలిసుకొనగా నీకు కలిగెడి లాభమేమి? నాయొక్క అంశమువలననే సమస్త విశ్వమును వ్యాపించి ధరించియున్నాను అని తెలిసికొనుము.

దశమోధ్యాయము సమాప్తము.

అస్పర్శయోగము అనే
శ్రీ మద్భగవద్గీత
రాజయోగీయము

ఏకాదశాధ్యాయము

విశ్వరూప సందర్శన యోగము

అర్జున ఉవాచ :

శ్లో॥ మదనుగ్రహాయ పరమం గుహ్య మధ్యాత్మసంజ్ఞితమ్,
యత్త్వయోక్తం వచస్తేన మోహోఽయంవిగతోమమ. ౧

అర్జునుడు పల్కెను భగవంతుడా! నన్ను అనుగ్రహింప పురుషార్థ ప్రదమును అత్యంత రహస్యమును ఆత్మానాత్మ వివేక విషయమును ఆధ్యాత్మమనబడునదియును అగు ఏ వాక్యము నీచే చెప్పబడినదో దానివలన నా ఈ భ్రమ తొలగినది.

శ్లో॥ భవాప్యయౌహి భూతానాంశ్రుతౌ విస్తరశో మయా,
త్వత్తః కమలపత్రాక్ష మాహాత్మ్య మపి చావ్యయమ్. ౨

శ్రీ కృష్ణా నీనుండి విశదముగనే భూతముల వుత్పత్తి ప్రళయములను అక్షయమగు నీ మహాత్మ్యము గూడ వింటిని.

శ్లో॥ ఏవమేతద్యథాత్థత్వ మాత్మానం పరమేశ్వర,
ద్రష్టుమిచ్ఛామి తే రూప మైశ్వరం పురుషోత్తమ. ౩

పరమేశ్వరా! నీవు ఏ ఆత్మతత్త్వమును నుడివితివో అది యథార్థము. పురుషోత్తమా! జ్ఞానైశ్వర్య శక్తి బల వీర్యాది సంపన్నమగు నీ ఈశ్వరీయ రూపమును సాక్షాత్కరింపజేసుకొన గోరుచున్నాను.

శ్లో॥ మన్యసే యది తచ్ఛక్యం మయా ద్రష్టు మితి ప్రభో,
యోగేశ్వర! తతో మేత్వం దర్శయాత్మాన మవ్యయమ్. ౪

ప్రభూ. ఆ విశ్వరూపమును నాచే దర్శింపబడుటసాధ్యము అని తలంతువేని యోగేశ్వరా! ఇక నీవు నాకు నిత్యమగు నా జగదాత్మ రూపమును చూపుము.

శ్రీ భగవానువాచ :

శ్లో॥ పశ్యమే పార్థ! రూపాణి శతశోఽథ సహస్రశః,
నానావిధాని దివ్యాని నానావర్ణాకృతీనిచ. ౫

శ్రీ కృష్ణుడు పల్కెను. పార్థా నానావిధ వర్ణములతోడను ఆకృతులతోడను, ఒప్పునవియును, అనేకములును, విభిన్నములును అగు దివ్యరూపములను దర్శింపుము.

శ్లో॥ పశ్యాదిత్యాన్ వసూన్ రుద్రా నశ్వినౌ మరుతస్తథా,
బహూన్యదృష్టపూర్వాణి పశ్యాశ్చర్యాణి భారత. ౬

భారతా! ద్వాదశాదిత్యులను, అష్ట వసువులను, ఏకాదశ రుద్రులను, అశ్వనీకుమార ద్వయమును, మరుద్దేవతా సప్తకమును, చూడుము, మరియు నీవుగాని ఇతరులుగాని ఇంతవరకు చూడని అద్భుతములను పెక్కింటిని చూడుము.

శ్లో॥ ఇహైకస్థం జగత్కృత్స్నం పశ్యాద్య సచరాచరమ్,
మమదేహే గుడాకేశ! యచ్చాన్యద్ద్రష్టు మిచ్ఛసి. ౭

అర్జునా! ఈ నా శరీరమున శరీరావయమువలె నొకచోటునున్న స్థావరజంగమ సహితమగు విశ్వము సమస్తమును మరి యితరమగు దేనిని చూడగోరుదులో నేడు దానినంతటిని గూడ చూడుము.

శ్లో॥ న తు మాం శక్యసే ద్రష్టు మనేనైవ స్వచక్షుషా,
దివ్యం దదామి తే చక్షుః పశ్యమే యోగ మైశ్వరమ్. ౮

ఈ నీ మాంస చక్షువులతో నన్ను చూడజాలవు కనుక అలౌకికమగు జ్ఞాన నేత్రమును ప్రసాదించుచున్నాను. నా అసాధారణ

మగు యోగశక్తిని జూడుము.

సఞ్జయ ఉవాచ :

శ్లో॥ ఏవముక్త్వా తతో రాజన్! మహాయోగేశ్వరో హరిః.
దర్శయామాస పార్థాయ పరమం రూపమైశ్వరమ్. ౯

సంజయుడు పల్కెను ధృతరాష్ట్రా! మహాయోగేశ్వరుడగు నారాయణుడిట్లు పల్కి అర్జునునకు దివ్యమగు తన విశ్వరూపమును జూపెను.

శ్లో॥ అనేకవక్త్రనయన మనేకాద్భుత దర్శనమ్,
అనేక దివ్యాభరణం దివ్యానేకోద్యతాయుధమ్. ౧౦

ఆ విశ్వరూపము అసంఖ్యములగు ముఖనేత్రములతోడను అనేకములగు అద్భుతాకృతులతోడను నానావిధమగు దివ్యాలంకారములతోడను నొప్పుచుండెను. మరియు పలువిధములగు దివ్యాయుధములను చేబూని యుండెను.

శ్లో; దివ్యమాల్యామ్బరధరం దివ్యగన్ధానులేపనమ్,
సర్వాశ్చర్యమయం దేవ మనన్తం విశ్వతోముఖమ్. ౧౧

ఆ విశ్వరూపము, దివ్యమాలావస్త్ర విభూషితమై దివ్యగంధానులిప్తమై అత్యంతాశ్చర్యమయమై దీప్తిమంతమై అపరిచిన్నమై విశ్వతోముఖమై నొప్పారు చుండెను.

శ్లో॥ దివిసూర్య సహస్రస్య భవే ద్యుగపదుత్థితా,
యదిభా స్సదృశీ సాస్యాద్భాస స్తస్య మహాత్మనః. ౧౨

ఆకాశమున వెయ్యిమంది సూర్యులప్రభ వొకే తడవ సముదితమైన యెడల ఆ కాంతి ఆ విశ్వరూపుని ప్రభను పోలునది కావచ్చును.

శ్లో॥ తత్రైకస్థం జగత్కృత్స్నం ప్రవిభక్త మనేకధా,
అపశ్యద్దేవదేవస్య శరీరే పాండవస్తదా. ౧౩

అప్పుడర్జునుడు ఆ దేవదేవుని శరీరమున దేవ, పితృ, మనుష్యాది నానా రూపముల విభజింపబడిన జగత్తు నంతటిని జూచెను. అది విశ్వరూపమున అవయవమువలె నొక్కట వెలయుచుండెను.

శ్లో॥ తత స్సవిస్మయావిష్టో హృష్టరోమా ధనఞ్జయః,
ప్రణమ్య శిరసా దేవం కృతాఞ్జలి రభాషత. ౧౪

అనంతరము అర్జునుడు ఆశ్చర్యాన్వితుడును పులకితాంగుడును ఆయెను విశ్వరూప ధారియగు భగవంతునకు శిరస్సుతో ప్రణమిల్లి చేతులు జోడించి ఇట్లు పల్కెను.

శ్లో॥ పశ్యామి దేవాంస్తవదేవ! దేహే
సర్వాంస్తథా భూతవిశేషసఙ్ఘాన్,
బ్రహ్మాణ మీశం కమలాసనస్థం
ఋషీంశ్చసర్వా నురగాంశ్చ దివ్యాన్. ౧౫

దేవా ఈ నీ విశ్వరూపమున దేవతలందరిని, చరాచరమగు జగత్తును వసిష్ఠాది ఋషులను తక్షకాది సర్పసమూహమును మేరువును, నీ నాభిపద్మమునమెరయు సృష్టికర్తయగు బ్రహ్మను చూచుచున్నాను.

శ్లో॥ అనేకబాహూదరవక్త్రనేత్రం
పశ్యామి త్వాం సర్వతోఽనన్తరూపమ్,
నాన్తం నమధ్యం నపునస్తవాదిం
పశ్యామి విశ్వేశ్వర విశ్వరూప. ౧౬

విశ్వేశ్వరా. సర్వత్ర అనంతమగు నీ రూపమే కనబడుచున్నది అసంఖ్యములగు హస్తవుదర ముఖనేత్రములు కలిగియున్నావు. అనంత

రూపధరుడ వగు నిన్ను సర్వత్ర చూచుచున్నాడను. మరియు నీ తుదను చూడజాలకున్నాను. మధ్య భాగమును చూడజాలకున్నాడను మొదలును గూడ చూడజాలకున్నాడను.

శ్లో॥ కిరీటినం గదినం చక్రిణంచ
తేజోరాశిం సర్వతో దీప్తిమన్తమ్,
పశ్యామి త్వాం దుర్నిరీక్ష్యం సమన్తా
ద్దీప్తానలార్కద్యుతిమప్రమేయమ్. ౧౭

కిరీటధరునిగను, గదాధారిగను, చక్రహస్తునిగను, సర్వత్ర ప్రకాశించువానిగను ప్రభా పుంజముగను, దుర్దర్శనీయునిగను, సూర్యాగ్నుల కాంతిని బోలు కాంతిగలవానినిగను, అపరిచ్ఛిన్నునిగను, నిన్ను అన్ని యెడల చూచుచున్నాడను.

శ్లో॥ త్వ మక్షరం పరమం వేదితవ్యం
త్వ మస్య విశ్వస్య పరంనిధానమ్,
త్వ మవ్యయ శ్శాశ్వతధర్మగోప్తా
సనాతనస్త్వం పురుషో మతో మే. ౧౮

నీవు పరబ్రహ్మరువు యేకమాత్రమగు జ్ఞేయ వస్తువవు. నీవు విశ్వమునకు శ్రేష్ఠమగు ఆశ్రమవు సనాతన ధర్మరక్షకుడవు. నిత్యుడవు పరమాత్మవు అని నా అభిప్రాయము.

శ్లో॥ అనాదిమధ్యాన్త మనన్తవీర్య
మనన్తబాహుం శశిసూర్యనేత్రమ్,
పశ్యామిత్వాం దీప్తహుతాశవక్త్రం
స్వతేజసా విశ్వ మిదం తపన్తమ్. ౧౯

నీవు ఆదిమధ్యాంత రహితుడవు. అఖండ శక్తిశాలివి. అసంఖ్య బాహు విశిష్టుడవు. చంద్ర సూర్యులు నీనేత్రములు. నీ ముఖమండలమున ప్రదీప్తాగ్నిజ్యోతి దీపిల్లుచున్నది. నీ తేజమున జగత్తు సంతటిని తపింప చేయువానిగను నిన్ను చూచుచున్నాడను.

శ్లో॥ ద్యావాపృథివ్యో రిద మన్తరం హి
వ్యాప్తం త్వయై కేన దిశ శ్చ సర్వాః,
దృష్ట్వాఽద్భుతం రూప ముగ్రం తవేదం
లోకత్రయం ప్రవ్యథితం మహాత్మన్. 20

మహాత్మా భూమి ఆకాశము ఈ మధ్య ప్రదేశము నీయొక్కనిచేతనే వ్యాపింపబడి దిక్కులు అన్నియు గూడా వ్యాపింపబడియున్నవి. నీ ఈ ఆశ్చర్యకరమును అదృష్ట పూర్వమును ఘోరమును అగు విశ్వరూపమును చూచి ముల్లోకములు భయపడుచున్నవి. అని నేను చూచుచున్నాను.

శ్లో॥ అమీ హి త్వాం సురసఙ్ఘావిశన్తి
కేచి ద్భీతాః ప్రాఞ్జలయో గృణన్తి,
స్వస్తీత్యుక్త్వా మహర్షిసిద్ధస ః
స్తువన్తి త్వాం స్తుతిభిః పుష్కలాభిః 21

ఈ యుద్ధమునకు వచ్చు మనుష్య శరీరధారులగు వసువు మొదలగు దేవతలు నీ యందు ప్రవేశించుచున్నారు. కొందరు భీతినంది చేతులు జోడించి నిన్ను నుతించుచున్నారు. మహారుషులు సిద్ధులును జగత్తునకు శుభమగుగాక అని పలికి శ్రేష్ఠములగు స్తోత్రములతో నిన్ను బొగడుచున్నారు.

శ్లో॥ రుద్రాదిత్యా వసవో యేచ సాధ్యా
విశ్వేఽశ్వినౌ మరుతశ్చోష్మపాశ్చ,
గన్ధర్వయక్షాసురసిద్ధసఙ్ఘా
వీక్షన్తే త్వాం విస్మితాశ్చైవ సర్వే 22

రుద్రులును, అదిత్యులు, వసువులు, సాధ్యులు, విశ్వదేవతలు, అశ్వనీదేవతలు, మరుద్గణము పితృదేవతలు, గంధర్వులు, యక్షులు,

అసురులు, సిద్ధులు మున్నగువారు అందరు గూడ విస్మితులై నిన్ను వీక్షించుచున్నారు.

శ్లో॥ రూపం మహత్తే బహువక్త్రనేత్రం
మహాబాహో బహుబాహూరుపాదమ్,
బహూదరం బహుదంష్ట్రాకరాళం
దృష్ట్వాలోకాః ప్రవ్యథితా స్తథాఽహమ్ 23

ప్రభూ అనేకములగు ముఖనేత్రములు హస్తపాదములు పూరువులు, వుదరములతో నొప్పుచు నీ విశ్వరూపము అసంఖ్యములగు దంతములతో భయంకరమై తోచుచున్నది. యీ రూపమును గాంచి ప్రాణులందరును నేనును గూడ భీతిజెందుచున్నారము.

శ్లో॥ నభస్స్పృశం దీప్తమనేకవర్ణం వ్యాత్తాననందీప్తవిశాలనేత్రమ్
దృష్ట్వా హి త్వాం ప్రవ్యథితా న్తరాత్మా ధృతిం న విన్దామి
శమం చ విష్ణో.

సర్వవ్యాపి గగన స్పర్శియును తేజోమయుమును నానావర్ణయుక్తమును విస్ఫారవదనమును వుజ్జ్వల విశాల నేత్రమును అగు నీ విశ్వరూపమును గాంచి నా మనస్సు కలవరపడుచున్నది. ధైర్యమును శాంతిని బొందజాలకున్నాను.

శ్లో॥ దంష్ట్రాకరాళానిచ తే ముఖాని దృష్ట్వైవకాలానలసన్నిభాని,
దిశో నజానే నలభే చ శర్మ ప్రసీద దేవేశ! జగన్నివాస 25

దేవదేవా భయంకరములగు కోరలతో నొప్పునవియును ప్రళయాగ్ని సదృశములును అగు నీ వదనముల జూడ నాకు దిగ్భ్రమ కలుగుచున్నది. నాశాంతి తొలగినది. ప్రసన్నుడవగుము.

శ్లో॥ అమీచ త్వాం ధృతరాష్ట్రస్య పుత్రాః
సర్వే సహైవావని పాలసఙ్ఘైః,
భీష్మో ద్రోణ స్సూతపుత్ర స్తథాసౌ
సహాస్మదీయైరపి యోధముఖ్యైః 26

శ్లో॥ వక్త్రాణితే త్వరమాణా విశన్తి దంష్ట్రాకరాలానిభయానకాని.
కేచిద్విలగ్నా దశనాన్తరేషు సందృశ్యన్తేచూర్ణితైరుత్తమాఙ్గైః

ధృతరాష్ట్రుని పుత్రులు రాజన్యవర్గముతో నీ ముఖవివరముల ప్రవేశించుచున్నారు. భీష్మద్రోణులు కర్ణుడును మన పక్షమునకు జెందిన దృష్టద్యుమ్నాది వీరులతో గూడ నీ యందు ప్రవేశించు చున్నారు.

వారందరును కరాళదంష్ట్రములును భీషణములును అగు నీముఖ గహ్వరముల తొందరపడుచు ప్రవేశించుచున్నారు. కొందరు పంట సందులలో చిక్కుకొని పొడుముగా చేయబడిన సిరస్సులతో కనబడు చున్నారు.

శ్లో॥ యథా నదీనాం బహవో ఽమ్బువేగా
స్సముద్ర మేవాభిముఖా ద్రవన్తి,
తథా తవా మీ నరలోకవీరా
విశంతి వక్త్రాణ్యభివిజ్వలన్తి. 28

పెక్కు నీటి ధారలు యేరీతిగా సముద్రము నెదుర్కొని ప్రవే శించుచున్నవో ఆ రీతిగా యీ మనుష్యయోధులు సర్వత్ర ప్రకాశ మానమగు నీ నోళ్ళలో ప్రవేశించుచున్నారు.

శ్లో॥ యథా ప్రదీప్తం జ్వలనం పతఙ్గా
విశన్తి నాశాయ సమృద్ధవేగాః,

తథైవ నాశాయ విశన్తి లోకా
స్తవాపివక్త్రాణి సమృద్ధవేగాః. 29

మిడుతలు తొందరగా పరుగిడి మండు నిప్పుల బడుట చావు కొరకే యైన రీతిగా జనులందరును గూడా మృతినొంది అతివేగముగ నీ ముఖ వివరముల ప్రవేశించుచున్నారు.

లేలిహ్యసే గ్రసమాన స్సమన్తా
ల్లోకాన్ సమగ్రాన్ వదనైర్జ్వలద్భిః,
తేజోభి రాపూర్య జగత్సమగ్రం
భాసస్తవోగ్రాః ప్రతపన్తి విష్ణో.

భగవంతుడా దివ్యమానములగు వదన సమూహాలతో ఈ వీరుల నందరిని మ్రింగుచు అన్ని వైపులకు నాలుకలను జాపుచు అస్వాదన మొనర్చుచున్నాడవు తీవ్రములగు నీ ప్రభలు కాంతులతో జగత్తునంతటిని నింపి తపింపజేయుచున్నవి.

శ్లో॥ ఆఖ్యాహి మేకో భవానుగ్రరూపో నమోస్తు తే దేవ వీర ప్రసీద
విజ్ఞాతుమిచ్ఛామిభవన్తమాద్యం నహిప్రజానామితవప్రవృత్తిమ్.

అతి క్రూరమగు అకారముగల నీవు యెవరో నాకు చెప్పుము నీకు నమస్కారము. దేవశ్రేష్ఠా ప్రసన్నుడవుకమ్ము ఆది పురుషుడవగు నిన్ను తెలిసికొన కోరెదను నీ వుద్దేశ్యము యేమియో తెలియకున్నది.

శ్రీ భగవా నువాచ :

శ్లో॥ కాలోఽస్మి లోకక్షయకృత్ప్రవృద్ధో
లోకాన్ సమాహర్తుమిహ ప్రవృత్తః,
ఋతేఽపిత్వా నభవిష్యన్తి సర్వే
యేఽవస్థితాః ప్రత్యనీకేషు యోధాః. 32

శ్రీ భగవంతుడు పల్కెను. నేను లోక సంహారార్థము విజృంభించిన కాలుడను. ఇప్పుడు ప్రాణుల సంహరింప మొదలిడితిని. నీవు యుద్ధ మొనర్పక పోయినను శత్రుపక్షమునందలి వీరులు జీవించరు.

శ్లో॥ తస్మాత్త్వముత్తిష్ఠ యశో లభస్వ
జిత్వాశత్రూన్ భుఙ్క్ష్వ రాజ్యం సమృద్ధమ్,
మయైవైతే నిహతాః పూర్వమేవ
నిమిత్తమాత్రం భవ సవ్యసాచిన్ 33

కనుక నీవు లెమ్ము యుద్ధ మొనర్పుము. శత్రువుల నోడించి నిష్కంటకమగు రాజ్యము భోగించుము. నాచే వీరు మును పే చంపబడిరి. అర్జునా నీవు నిమిత్తమాత్రుడవుకమ్ము.

శ్లో॥ ద్రోణఞ్చ భీష్మఞ్చ జయద్రథఞ్చ
కర్ణం తథాఽన్యానపి యోధవీరాన్,
మయా హతాం స్త్వం జహి మావ్యథిష్ఠా
యుధ్యస్వ జేతాసి రణే సపత్నాన్. 34

ఎవరిని జంప నీవు శంకించుచుంటివో అభీష్మ ద్రోణకర్ణ జయద్రథాదులను తదితరులగు యోధులను నేనిదివరకే చంపియుంటిని మృతులైనవారినే నీవు వధింపుము. భయపడకుము. యుద్ధమున తప్పక గెలువగలవు. యుద్ధము చేయుము.

సంజయ ఉవాచ :

శ్లో॥ ఏతచ్ఛ్రుత్వా వచనం కేశవస్య కృతాఞ్జలిర్వేప
మానః కిరీటీ.
నమస్కృత్వాభూయ ఏవాహ కృష్ణంసగద్గదం భీతభీతః
ప్రణమ్య. 35

సంజయుడు పల్కెను శ్రీ కృష్ణుని ఈ పల్కుల విని కిరీటి వణుకుచు చేతులు జోడించి నమస్కరించెను. యెక్కువగా భయపడుచు మరల ప్రణమిల్లి గద్గదస్వరముతో ఇట్లు పల్కెను.

అర్జున ఉవాచ :

శ్లో॥ స్థానే హృషీకేశ తవప్రకీర్త్యా జగత్ప్రహృష్యత్యనురజ్యతేచ,
రక్షాంసి భీతాని దిశో ద్రవన్తి, సర్వేనమస్యన్తి చ సిద్ధసఙ్ఘాః 36

అర్జునుడు పల్కెను. హృషీకేశా నీ మహాత్మ్య కీర్తనమున జగత్తంతయు ఆనందించుచూ ప్రీతిని బొందుచున్నది. రాక్షసులు భీతులై నలుదిక్కుల పరుగిడుచున్నారు. తపోయోగమంత్ర సిద్ధులు నీకు నమస్కరించుచున్నారు. ఇది యంతయును తగియున్నది.

శ్లో॥ కస్మాచ్చ తే న నమేరన్ మహాత్మన్
గరీయసే బ్రహ్మణోఽప్యాదికర్త్రే
అనన్త! దేవేశ! జగన్నివాస!
త్వమక్షరం సదసత్తత్పరం యత్. 37

మహాత్మా! అనంతా దేవేశా! జగదాశ్రయా బ్రహ్మకు కూడ గొప్పవగు మూలకారణమగు నీకు దేవతలు యేల నమస్కరించరు? వ్యక్తమును అవ్యక్తమును రెంటికి అతీతమగు యే పరబ్రహ్మముకలదో అదియును నీవే.

శ్లో॥ త్వమాదిదేవః పురుషః పురాణ
స్త్వమస్య విశ్వస్య పరం నిధానమ్,
వేత్తాసి వేద్యఞ్చ ధామ
త్వయా తతం విశ్వమనన్తరూప! 38

అనంతరూప నీవు దేవతలకు గూడ ఆదిసనాతనుడవగు పురుషుడవు. నీవు ఈ జగత్తునకు ఏకైక మాత్రమగు ఆశ్రయమవు సర్వజ్ఞుడవు జ్ఞేయమవు. శ్రేష్ఠమగు పదము అగుచున్నావు నీచే జగత్తు వ్యాప్తమైయున్నది.

శ్లో॥ వాయుర్యమోఽగ్ని ర్వరుణశ్శశాఙ్కః
ప్రజాపతి స్త్వం ప్రపితామహశ్చ
నమో నమ స్తేస్తు సహస్రకృత్వః
పునశ్చభూయోపి నమో నమస్తే 39

నీవు వాయుదేవుడవు యముడవు, అగ్నివి. వరుణుడవు. చంద్రుడవు ప్రజాపతి రూపమున లోకమునకు తండ్రివి. బ్రహ్మకు జనకుడవగు ప్రపితామహుడవు కూడ నీవే నీకు సహస్ర నమస్కారములు మరల నీకు నమస్సులు తిరిగియును నీకు నమస్కరింతును.

శ్లో॥ నమః పురస్తా దథ పృష్ఠతస్తే నమోఽస్తు తే సర్వత ఏవసర్వ
అనన్తవీర్యామితవిక్రమస్త్వం సర్వంసమాప్నోషితతోఽసిసర్వః.

సర్వాత్మా నీకు యెదురుగను వెనుకగను అన్ని వైపులను నమస్కరించుచున్నాడను నీ బల పరాక్రమములకు అంతము లేదు. నీవు విశ్వము నంతటిని వ్యాపించియున్నాడవు.

శ్లో॥ సఖేతి మత్వా ప్రసభం యదుక్తం
హే! కృష్ణ! యాదవ హే సఖేతి,
అజానతా మహిమానం తవేదం
మయాప్రమాదా త్ప్రణయేన వాపి. 41

శ్లో॥ యచ్చావహాసార్థ మసత్కృతోఽసి
విహారశయ్యాసనభోజనేషు,
ఏకోఽథవాప్యచ్యుత! తత్సమక్షం
తత్ క్షామయే త్వా మహ మప్రమేయమ్ 42

విశ్వరూపధారణా సమర్థమైన నీ మహిమను గుర్తింపజాలక నిన్ను సఖుడవని యెంచి పొరబాటునగాని చనువుచేగాని కృష్ణా యాదవా సఖాయని వినయరహితముగ దేనిని వచించియుంటినో

మరియు అచ్యుతా! విహారశయ్యన ఆసన కాలములగాని నీయెదుటగాని వెనుకగాని నీవు వొక్కడవేయుండునప్పుడుగాని లేక ఇతరులతో నుండునప్పుడుగాని పరిహాసార్థము నీ కొనర్చిన అమర్యాదకును అప్రమేయుడవగు నీ కడ క్షమా ప్రార్థన మొనర్చుచున్నాడను.

శ్లో॥ పితాసి లోకస్యచరాచరస్యత్వమస్య పూజ్యశ్చ గురుర్గరీయాన్
నత్వత్సమోస్త్యభ్య ధికఃకుతోన్యో లోకత్రయేప్య ప్రతిమ
ప్రభావ. 43

నిరుపమ ప్రభావా స్థావరజంగమాత్మకమగు యీ జగత్తునకు నీవు స్రష్టవు, పూజనీయుడవు, గురుడవు, పెద్దవు త్రిభువనముల నీకు సమానులగువారు లేరు నీకంటే శ్రేష్టులగువారు వుండరు.

శ్లో॥ తస్మాత్ ప్రణమ్య ప్రణిధాయ కాయం
ప్రసాదయే త్వామహ మీశ మీడ్యమ్,
పితేవ పుత్రస్య సఖేవ సఖ్యుః
ప్రియః ప్రియాయార్హసి దేవ! సోఢుమ్. 44

కనుక దేవా నీకు సాష్టాంగ ప్రణామ మొనర్చుచున్నాడను. పూజనీయుడవును ఈశ్వరుడవునగు నిన్ను అనుగ్రహింపవేడుచున్నాడను తండ్రి కొడుకు యొక్కయు స్నేహితుడు స్నేహితునియొక్కయు ప్రియుడు ప్రేయసి యొక్కయు లోపముల సహించునట్లు నీవు నా అపరాధమును క్షమింపుము.

శ్లో॥ అదృష్టపూర్వం హృషితోఽస్మి దృష్ట్వా
భయేన చ ప్రవ్యథితం మనో మే
త దేవ మే దర్శయ దేవ! రూపం
ప్రసీద దేవేశ! జగన్నివాస. 45

దేవా నేనుగాని ఇతరులుగాని ఇంతకుమునుపు చూడని విశ్వరూపమునుచూచి ఆనందమునందితిని. నామనస్సు భయవ్యాకులితమగుచున్నది. దేవేశా, జగన్నివాసా అనీ పూర్వరూపమునే చూపుము. ప్రసన్నుడవుకమ్ము.

శ్లో॥ కిరీటినంగదినం చక్రహస్తమిచ్ఛామి త్వాంద్రష్టుమహంతథైవ
తేనైవరూపేణచతుర్భుజేనసహస్రబాహోభవవిశ్వమూర్తే.

సహస్రహస్తా నేను నిన్ను పూర్వరీతిగా కిరీట, చక్ర, గంగాధరునిగ చూడగోరుచున్నాడను దుర్నిరీక్ష్యమగు నీ విశ్వరూపమును వుపసంహరింపుము విశ్వమూర్తీ! నీఅచతుర్భుజరూపమును ధరింపుము.

శ్రీ భగవానువాచ :

శ్లో॥ మయా ప్రసన్నేన తవా ర్జునేదం
రూపం పరం దర్శితమాత్మయోగాత్,
తేజోమయం విశ్వ మనన్త మాద్యం
యన్మేత్వదన్యేన న దృష్టపూర్వమ్, 47

శ్రీ భగవంతుడు పల్కెను. అర్జునా! నేను నీకు ప్రసన్నుడనై నా యోగశక్తి ప్రభావమున తేజఃపూర్ణమును అనంతమును. ఆద్యమును అగు విశ్వరూపమును జూపితిని. నీవుగాక యితరులెవ్వరు పూర్వమీ రూపమును జూడలేదు.

శ్లో॥ నవేదయజ్ఞాధ్యయనైర్నచక్రియాభిర్నతపోభిరుగ్రైః,
ఏవంరూప శ్శక్య అహం నృలోకే ద్రష్టుంత్వదన్యేనకురుప్రవీర

కురుశ్రేష్ఠా వేదములను యజ్ఞవిద్యలను అధ్యాపన మొనర్చినవారు ఈ విశ్వరూపమును చూడలేదు. అగ్నిహోత్రాది శ్రౌతకర్మలను తులాపురుషాది దానములను చాంద్రాయనాదులగు కఠిన తపములను ఆచరించినవారికి గూడ ఈ దర్శనము లభింపలేదు. నీవొక్కడవే

నా యనుగ్రహమున దర్శించి ధన్యుడవైతివి.

శ్లో॥ మా తే వ్యథా మా చ విమూఢభావో
దృష్ట్వా రూపం ఘోర మీదృఙ్మమేదమ్,
వ్యపేతభీః ప్రీతమనాః పున స్త్వం
త దేవ మే రూప మిదం ప్రపశ్య 49

భయంకరమగు నా యీ విశ్వరూపమును గాంచి నీవు భయమును చిత్త వైకల్యమును పొందవలదు. భయమును వీడి ప్రసన్నచిత్తముల నా చతుర్భుజరూపమును జూడుము.

సఞ్జయ ఉవాచ :

శ్లో॥ ఇత్యర్జునం వాసుదేవ స్తథోక్త్వా
స్వకంరూపం దర్శయామాస భూయః,
ఆశ్వాసయామాస చ భీత మేనం
భూత్వా పున స్సౌమ్యవపు ర్మహాత్మా. 50

సంజయుడు పల్కెను. వాసుదేవుడు అర్జునునితో ఇట్లు పల్కి మరల తన పూర్వరూపమును జూపెను. విశ్వాత్ముడు ప్రసన్నరూపుడు అయి భీతినందిన అర్జునుని వోదార్చెను.

అరున ఉవాచ :

శ్లో॥ దృష్ట్వేదం మానుషం రూపం తవ సౌమ్యం జనార్దన,
ఇదానీ మస్మి సంవృత్తః సచేతాః ప్రకృతిం గతః 51

అర్జునుడు పల్కెను. జనార్థనా సౌమ్యమగు ఈ నీ మనుష్యరూపమును గాంచి నా చిత్తము ప్రసన్నతనందినది. స్వస్థుడనైతిని.

శ్రీ భగవా నువాచ :

శ్లో॥ సుదుర్దర్శమిదం రూపం దృష్టవా నసి యన్మమ,
దేవా అప్యస్య రూపస్య నిత్యం దర్శనకాఙ్క్షిణః 52

భగవానుడు పల్కెను నీవు చూచిన ఈవిశ్వరూపము అత్యంత దుర్లభము. దేవతలు గూడ నిత్యము ఈ రూపమును చూడగోరు చుందురు.

శ్లో॥ నాహం వేదైర్న తపసా న దానేన న చేజ్యయా,
శక్య ఏవంవిధో ద్రష్టుం దృష్టవానసి మాం యథా. 53

నీవే రూపమున నన్ను చూచితివో ఆ రూపమున నేను వేద పఠనమునగాని తపస్సువలనగాని దానమునగాని యజ్ఞమువలనగాని చూడసాధ్యుడను కాను.

శ్లో॥ భక్త్యా త్వనన్యయా శక్య అహ మేవంవిధోఽర్జున,
జ్ఞాతుం ద్రష్టుం చ తత్త్వేన ప్రవేష్టుంచ పరంతప. 54

అర్జునా! యదార్థముగ నన్ను గురించిన శాస్త్రజ్ఞానము, ప్రత్యక్షసాక్షాత్కారము, తాదాత్మ్యమగు మోక్షమును, కేవలము అనన్య భక్తి వలననే సంభవమగును. పరంతపా అనన్య భక్తియొక్క టియే విశ్వరూపమును దర్శింపజేయుగలదు.

శ్లో॥ మత్కర్మకృ న్మత్పరమో మద్భక్త స్సంగవర్జితః,
నిర్వైరస్సర్వభూతేషు యస్సమామేతి పాణ్డవ!

అర్జునా! యెవడు నా కొరకు కర్మల నాచరించుచుండునో నన్నే పురుషార్థముగా తలచునో తన మిత్రపుత్రాదులయందాసక్తి కలిగియుండడో నన్నే ఆశ్రయించియుండునో సర్వజీవుల యెడ శత్రు భావము లేకయుండునో అతడు నన్ను పొందును.

దేవతలకును తపోయజ్ఞాది కర్మలకును గూడ సాధ్యముకాని విశ్వరూపమును భక్తుడగు అర్జునునకు భగవంతుడు చూపెను.

ఇతి శ్రీ భగవద్గీతా సూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగ శాస్త్రే శ్రీ కృష్ణార్జునసంవాదే విశ్వరూప సందర్శనయోగోనామ ఏకాదశోఽధ్యాయః.

ఏకాదశోఽధ్యాయః

అస్పర్శయోగము అనే
శ్రీ మద్భగవద్గీత
రాజయోగీయము
ద్వాదశాధ్యాయము
భక్తి యోగము

అర్జున ఉవాచ :

శ్లో॥ ఏవం సతతయుక్తా యే భక్తాస్త్వాం పర్యుపాసతే,
యే చాప్యక్షరమవ్యక్తం తేషాం కే యోగవిత్తమాః. 1

అర్జునుడు పల్కెను. సర్వకర్మార్పణ మొనర్చుచు నిరంతర నిష్ఠులగుచు యే భక్తులు విశ్వరూపివియగు నిన్ను ధ్యానించుచున్నారో మరియు యెవరు నిర్గుణ నిర్విశేషమగు బ్రహ్మమును ధ్యానించుచున్నారో వీరిద్దరిలో శ్రేష్ఠుడగు యోగి యెవడు.

శ్రీ భగవానువాచ :

శ్లో॥ మయ్యావేశ్య మనో యే మాం నిత్యయుక్తా ఉపాసతే,
శ్రద్ధయా పరయోపేతాస్తే మే యుక్తతమా మతాః. 2

శ్రీ కృష్ణుడు పల్కెను. యెవరు యేక నిష్ఠులై పరమ శ్రద్ధతో నా విశ్వరూపమున మనస్సు నిలిపి సర్వజ్ఞుడను అగు నన్ను భజించుచున్నారో వారు శ్రేష్ఠులగు యోగులని నా అభిప్రాయము.

శ్లో॥ యే త్వక్షరమనిర్దేశ్యమవ్యక్తం పర్యుపాసతే,
సర్వత్రగమచిన్త్యఞ్చ కూటస్థమచలం ధ్రువమ్. 3
సన్నియమ్యేన్ద్రియగ్రామం సర్వత్ర సమబుద్ధయః,
తే ప్రాప్నువన్తి మామేవ సర్వభూతహితే రతాః. 4

కాని యెవరు, సర్వకాలముల సమబుద్ధి జగత్తున హిత మొన
ర్చుచు ఇంద్రియ సమూహమును నిగ్రహించి, అనిర్వచనీయమును
అప్రమేయమును, ప్రమాణాతీతమును, మాయకు అధిష్ఠానమై వెలయు
కూటస్థమును స్థిరమును నిత్యమును ఆకాశమువలె సర్వవ్యాపియునగు
నిర్గుణ బ్రహ్మమును వుపాసించుచున్నారో, వారు నన్నే పొందు
చున్నారు.

శ్లో॥ క్లేశోఽధికతర స్తేషా మవ్యక్తాసక్త చేతసామ్,
అవ్యక్తాహి గతిర్దుఃఖం దేహావద్భిరవాప్యతే. 5

నిర్గుణ బ్రహ్మ నిష్ఠులగు యోగులకు శ్రమ మిగుల యెక్కువ
యేలయన దేహాభిమానులగు వారికి నిర్గుణ బ్రహ్మ నిష్ఠ లభించుట
కష్టతరము.

శ్లో॥ యేతు సర్వాణి కర్మాణి మయి సన్న్యస్య మత్పరాః,
అనన్యేనైవ యోగేన మాం ధ్యాయన్త ఉపాసతే. 6
తేషామహం సముద్ధర్తా మృత్యుసంసారసాగరాత్,
భవామి న చిరా త్పార్థ మయ్యావేశితచేతసామ్. 7

పార్థా. యెవరు సమస్త కర్మములను నాకర్పించి, నా యందా
సక్తి గొని, ఏకాంతికమగు భక్తియోగమున నన్ను ధ్యానించుచు
వుపాసించుచున్నారో, మన్నిష్ఠ చిత్తులగు ఆ వ్యక్తులను శీఘ్రముగనే
జనన మరణ రూపమగు సంసార సాగరమునుండి వుద్ధరించుచున్నాను.

శ్లో॥ మయ్యేవ మన ఆధత్స్వ మయి బుద్ధిం నివేశయ,
నివసిష్యసి మయ్యేవ అత ఊర్ధ్వం నసంశయః. 8

కనుక నీవు నా యందే చిత్తమును సుస్థిర మొనర్పుము. బుద్ధిని
కూడా నా యందు యేకాగ్ర మొనర్చుము. యిట్లొనర్చిన యెడల
శరీర త్యాగానంతరము నీవు నా యందే వసింపగలవు. ఈ విషయ
మున సందేహములేదు.

శ్లో॥ అథ చిత్తం సమాధాతుం నశక్నోషి మయి స్థిరమ్,
అభ్యాసయోగేన తతో మామిచ్ఛాప్తుం ధనఞ్జయ. 9

ధనంజయా నీవు నా యందు చిత్తమును స్థిరముగా నిల్పజాలనిచో అభ్యాసయోగమున నన్ను బొంద ప్రియత్నింపుము

శ్లో॥ అభ్యాసేఽప్య సమర్థోఽసి మత్కర్మ పరమో భవ,
మదర్థ మపి కర్మాణి కుర్వన్ సిద్ధి మవాప్స్యసి. 10

ఇట్టి అభ్యాసము నొనర్చుటకు గూడ నీవు సమర్థుడవు కానిచో భగవత్ప్రీతికరములగు కర్మముల నాచరింపుము. ఇట్టి కర్మముల నాచరించుచుండిన నీవు సిద్ధిని పొందగలవు.

శ్లో॥ అథైత దప్యశక్తోఽసి కర్తుం మద్యోగ మాశ్రితః,
సర్వకర్మఫలత్యాగం తతః కురు యతాత్మవాన్. 11

ఇట్లును ఆచరింప అసమర్థుడవైనచో నన్ను శరణుబొంది చిత్తమును నిగ్రహించి కర్మఫలముల త్యజింపుము.

శ్లో॥ శ్రేయోహిజ్ఞానమభ్యాసాత్ జ్ఞానాద్ధ్యానం విశిష్యతే,
ధ్యానాత్కర్మఫలత్యాగ స్త్యాగాచ్ఛాన్తిరనన్తరమ్ 12

జ్ఞాన రహితమగు అభ్యాసముకంటె యుక్తసహితముగ నుపదేశింపబడు జ్ఞానము శ్రేష్ఠము. ఇట్టి తత్త్వనిశ్చయముకన్న ధ్యానము శ్రేష్టము ధ్యానముకన్నఆసక్తినివృత్తిని గలిగించు కర్మఫలత్యాగము మంచిది.కర్మఫలత్యాగమ్మునర్చిన వెంటనే సంసారోపరమ రూపముగు శాంతి లభించును.

శ్లో॥ అద్వేష్టా సర్వభూతానాం మైత్రః కరుణ ఏవ చ,
నిర్మమో నిరహఙ్కార స్సమదుఃఖసుఖః క్షమీ. 13

శ్లో॥ సంతుష్టస్సతతం యోగీ యతాత్మా దృఢనిశ్చయః,
మయ్యర్పితమనో బుద్ధిర్యోమద్భక్తస్స మే ప్రియః. 14

సకల ప్రాణులను ద్వేషింపనివాడును, మిత్రభావము కలవాడును

దయకలవాడును, మమకారము లేనివాడును. అహంకారము లేనివాడును, సుఖదుఃఖముల సమాన బుద్ధికలవాడును, క్షమాశీలుడును యెల్లప్పుడు సంతోషము కలవాడును. సమాహిత చిత్తుడును, సంయత స్వభావుడును, దృఢమగు సంకల్పముగలవాడును, నా యందు మనస్సును, బుద్ధిని, అర్పించినవాడును, నా భక్తుడగు వాడు యెవడో అతడు నాకు ఇష్టుడు.

శ్లో॥ యస్మాన్నోద్విజతే లోకో లోకాన్నోద్విజతేచ యః,
హర్షామర్షభయోద్వేగైర్ముక్తో యస్సచ మే ప్రియః. 15

యెవడు యెవ్వరికిని వుద్వేగమును గలిగింపకుండునో యెవడు యెవ్వరినుండియు వుద్వేగమును పొందడో మరియు నెవ్వడు ఆనంద విషాద భయ సంక్షోభముల పొందకుండునో అతడు నాకు ప్రియుడు.

శ్లో॥ అనపేక్షశ్శుచిర్దక్ష ఉదాసీనో గతవ్యథః,
సర్వారమ్భపరిత్యాగీ యో మద్భక్తస్సమే ప్రియః. 16

నిస్పృహుడును బాహ్యాభ్యంతర శౌచసంపన్నుడును. దక్షుడును పక్షపాత శూన్యుడును సర్వసకామ కర్మత్యాగియును అగు భక్తుడు నాకు ఇష్టుడు.

శ్లో॥ యో నహృష్యతి నద్వేష్టి నశోచతి నకాఙ్క్షతి,
శుభాశుభపరిత్యాగీ భక్తిమాన్ యస్సమే ప్రియః. 17

శుభము చేకూరిన సంతోషపడడు. కీడు వాటిల్లినా ద్వేషమును బొందడు. ఇష్టవియోగమైన దుఃఖంపడు. తనకు లేని వస్తువునుగోరడు. పుణ్యపాపములనిచ్చు కర్మముల నాచరింపడు. ఇట్టి భక్తుని నేను ప్రేమింతును.

శ్లో॥ సమశ్శత్రౌచ మిత్రేచ తథా మానాపమానయోః,
శీతోష్ణసుఖదుఃఖేషు సమస్సఙ్గవివర్జితః. 18

శ్లో॥ తుల్యనిందాస్తుతిర్మౌనీ సంతుష్టో యేన కేనచిత్,
అనికేతః స్థిరమతి ర్భక్తిమాన్ మే ప్రియో నరః. 19

శత్రుమిత్రులు పూజాపరాభవములు శీతోష్ణ సుఖదుఃఖములు నిందాస్తుతులు వీనియెడ సమదృష్టిని గల్గి లభించిన ఏ కొద్దితోనో పరితృప్తి నందుచు మౌనియై స్థిర నివాసములేక నిశ్చలచిత్తము ను భక్తియు గలిగియుండు వ్యక్తి నాకు ప్రియుడు.

శ్లో॥ యేతుధర్మ్యామృతమిదం యథోక్తం పర్యుపాసతే,
శ్రద్ధధానా మత్పరమా భక్తాస్తే ఽతీవ మే ప్రియాః.

కాని యెవరు శ్రద్ధావంతులును మత్పరాయణులును అగుచు ఈ అమృత తుల్యమగు ధర్మమును చెప్పబడిన రీతిగా అనుష్ఠించు చున్నారో, అట్టి భక్తులు నాకు అత్యంతము ప్రియులు. ఇందు భక్తునకుండవలసిన కళ్యాణ గుణములు వర్ణింపబడినవి. ఆయా గుణములతో నొప్పువాడు నాకు ప్రియుడు కాని ఈ గుణములన్నిటితో శోభిల్లు వాడు నాకు అత్యంత ప్రియుడని భగవంతుని అభిప్రాయము.

అస్పర్శయోగము అనే

శ్రీ మద్భగవద్గీత

రాజయోగీయము

త్రయోదశాధ్యాయము

క్షేత్రక్షేత్రజ్ఞ విభాగయోగము

అర్జున ఉవాచ :

శ్లో॥ ప్రకృతిం పురుషం చైవ క్షేత్రం క్షేత్రజ్ఞ మేవచ,
ఏతద్వేదితుమిచ్ఛామి జ్ఞానంజ్ఞేయఞ్చ కేశవ! 1

అర్జునుడు పల్కెను కృష్ణా! ప్రకృతిని పురుషని క్షేత్రమును క్షేత్రజ్ఞుని, జ్ఞానమును జ్ఞేయమును, అను విషయములను తెలుసుకొనగోరెదను.

శ్రీ భగవా నువాచ :

శ్లో॥ ఇదం శరీరం కౌన్తేయ! క్షేత్రమిత్యభిధీయ తే,
ఏతద్యో వేత్తి తం ప్రాహుః క్షేత్రజ్ఞ ఇతి తద్విదః. 2

శ్రీ కృష్ణుడు పల్కెను కుంతీపుత్రా, ఈ భోగాయతనమగు దేహము క్షేత్రము అని చెప్పబడును. యెవడు దీనిని తెలుసుకొను చున్నాడో క్షేత్రక్షేత్రజ్ఞ వేత్తలు, దానిని క్షేత్రజ్ఞుడని అనుచున్నారు

శ్లో॥ క్షేత్రజ్ఞంచాపి మాం విద్ధి సర్వక్షేత్రేషు భారత,
క్షేత్రక్షేత్రజ్ఞయోర్జ్ఞానం యత్తత్ జ్ఞానం మతం మమ. 3

భారత! అర్జునా! సర్వశరీరముల వెలయు నన్ను క్షేత్రజ్ఞునిగా తెలిసికొనుము. క్షేత్రక్షేత్రజ్ఞుల జ్ఞానము యేదియో అదియే యథార్థ మగు జ్ఞానమని నా అభిప్రాయము.

శ్లో॥ తత్ క్షేత్రం యచ్చ యాదృక్చ యద్వికారి యతశ్చ యత్,
స చ యో యత్ప్రభావశ్చ తత్సమాసేన మే శృణు. 4

ఆ క్షేత్రము యెయ్యదియో యెటువంటిదో యెట్టి వికారములతో గూడినదో యెద్దాని నుండి యేరీతిగా వుత్పన్నమైనదో ఆ క్షేత్రజ్ఞుడు యెవడో అతని ప్రభావము యెటువంటిదో దానిని సంగ్రహముగ నుడివెదను వినుము.

శ్లో॥ బహుభి ర్బహుధా గీతం ఛన్దోభి ర్వివిధైః పృథక్,
బ్రహ్మసూత్రపదైశ్చైవ హేతుమద్భిర్వినిశ్చితైః 5

క్షేత్రక్షేత్రజ్ఞుల మహాత్యము ఋషులచే విభిన్నములగు వేదమంత్రములచే వేరుగ పెక్కు రీతుల నిరూపితములైనవి. సంశయ రహితములగు హేతువులతో గూడిన బ్రహ్మ సూచకములగు వుపనిషద్వాక్యముల వలన వర్ణింపబడినది.

శ్లో॥ మహాభూతా న్యహఙ్కారో బుద్ధి రవ్యక్తమేవచ,
ఇన్ద్రియాణి దశైకఞ్చ పఞ్చ చేన్ద్రియగోచరాః 6
ఇచ్ఛా ద్వేష స్సుఖం దుఃఖం సఙ్ఘాతశ్చేతనాధృతిః,
ఏతత్ క్షేత్రం సమాసేన సవికారముదాహృతమ్. 7

పంచ సూక్ష్మ భూతములు, మహాభూతములకు కారణమగు అహంకారము, దీనికి కారణమగు బుద్ధి, బుద్ధికి కారణమగు మూల ప్రకృతి మరియు దశేంద్రియములు మనస్సు యింద్రియ విషయములగు స్థూలభూతములును, ఇచ్ఛా ద్వేషము దుఃఖములును శరీరమును దానియందు దోచు చేతనమును, ధృతియును, గలసి క్షేత్ర మనబడుచున్నది. మహదాది వికారములతో గూడిన క్షేత్ర తత్వము సంగ్రహముగ చెప్పబడినది.

శ్లో॥ అమానిత్వ మదమ్భిత్వ మహింసా క్షాన్తి రార్జవమ్,
ఆచార్యోపాసనం శౌచం స్థైర్య మాత్మవినిగ్రహః. 8

అమానిత్వము, స్వధర్మమును ప్రకటింపకుండుట, పరులను పీడింపకుండుట, తను సగౌరవముగు శుశ్రూష బాహ్యాభ్యంతర,శౌచము, మోక్ష మార్గమునయే కనిష్ట ఆత్మనిగ్రహము.

శ్లో॥ ఇన్ద్రియార్థేషు వైరాగ్య మనహంకార ఏవచ,
జన్మమృత్యు జరావ్యాధి దుఃఖదోషాను దర్శనమ్. 9

భోగ్యములగు యింద్రియ విషయముల విరక్తి అభిమాన రాహిత్యము జన్మ మృత్యు జరా వ్యాధులనెడి దుఃఖములనుండి దోషమును మాటిమాటికి చూచుచుండుట

శ్లో॥ అసక్తిరనభిష్వఙ్గః పుత్రదార గృహాదిషు,
నిత్యఞ్చ సమచిత్తత్వ మిష్టానిష్టోపపత్తిషు. 10

పుత్రదార గృహాదుల ఆసక్తి,మమత్వములు. లేకుండుట,శుభాశుభ ప్రాప్తుల మనస్సు లోణకకుండుట.

శ్లో॥ మయి చానన్యయోగేన భక్తి రవ్యభిచారిణీ,
వివిక్త దేశ సేవిత్వమరతి ర్జనసంసది. 11

నా యందు సర్వాత్మ దృష్టితో ఏకాంతిక భక్తిని కల్గియుండుట, చిత్త ప్రసాదకరములగు ప్రదేశముల నివసించుట, ప్రాకృత జనసంసర్గ త్యాగము.

శ్లో॥ అధ్యాత్మజ్ఞాన నిత్యత్వం తత్త్వజ్ఞానార్థదర్శనమ్,
ఏతత్ జ్ఞానమితి ప్రోక్త మజ్ఞానంయదతో ఽన్యథా. 12

ఆత్మ జ్ఞాననిష్ఠ మోక్షమున సర్వోత్కృష్ట బుద్ధి, ఇదంతయును జ్ఞానమని చెప్పబడుచున్నది దీనికి విపరీతములగు మానిత్వదంభాదులు అజ్ఞానము, జ్ఞాన ప్రతిబంధకమగుట వలన, సర్వథా త్యాజ్యములు.

శ్లో॥ జ్ఞేయంయత్తత్ప్రవక్ష్యామి యద్జ్ఞాత్వాఽమృత మశ్నుతే,
అనాదిమ త్పరం బ్రహ్మ న సత్తన్నా సదుచ్యతే. 13

యేది తెలుసుకొనదగినదో, యెద్దానిని యెరిగిన అమరత్వము అను మోక్షమును పొందునో దానిని చెప్పెదను. అది ఆదిరహితము పరబ్రహ్మము, సత్ శబ్దగోచరముకాదు. అసత్ ప్రత్యయ గోచర మునుకాదు అని చెప్పబడుచున్నది.

శ్లో॥ సర్వతః పాణిపాదం తత్సర్వతోఽక్షిశిరోముఖమ్.
సర్వత శ్శ్రుతిమ ల్లోకే సర్వ మావృత్య తిష్ఠతి. 14

సర్వత్ర హస్తపాదములుకలది. సర్వత్ర కన్నులు, తలలు, నోరు కలది, అది బ్రహ్మము ఇహలోకమున సమస్తమును వ్యాపించి వెలయు చున్నది.

శ్లో॥ సర్వేన్ద్రియగుణాభాసం సర్వేన్ద్రియ వివర్జితమ్,
అసక్తం సర్వభృచ్చైవ నిర్గుణం గుణ భోక్తృచ. 15

అది ఇంద్రియ వ్యాపారములనన్నిటియందును ప్రకాశించు చున్నది. కాని యెట్టి ఇంద్రియమును లేనిది. సంగరహితము. అన్నిటి కిని ఆధారము. త్రిగుణ రహితముగా వున్నను గుణముల పాలించును.

శ్లో॥ బహి రన్తశ్చ భూతానా మచరం చర మేవచ.
సూక్ష్మత్వాత్తదవిజ్ఞేయం దూరస్థం చాన్తికేచ తత్. 16

మరియు అది చరాచర భూతముల బయటను లోపలను గూడ నున్నది. స్థావరము జంగమము కూడ అగుచున్నది సూక్ష్మముగుట వలన అది తెలియబడకున్నది. విషయ బుద్ధులకు దూరమున నున్నది మరియు శుద్ధ చిత్తులకు దగ్గరనేయున్నది.

శ్లో॥ అవిభక్తఞ్చ భూతేషు విభక్త మివ చ స్థితమ్,
భూతభర్తృచ తద్జ్ఞేయం గ్రసిష్ణుప్రభవిష్ణు చ. 17

ఆ బ్రహ్మము సర్వ భూతములలో కారణ స్వరూపమున అభిన్నమే యైనను, కార్య స్వరూపమున భిన్నమైన దానివలె వెలయుచున్నది. ఇదియే భూతముల నన్నిటిని స్థితికాలమున పోషించుచున్నది. ప్రళయకాలమున సంహరించుచున్నది. సృష్టికాలమున ప్రసరించుచున్నది.

శ్లో॥ జ్యోతిషా మపి తజ్జ్యోతిస్తమసః పర ముచ్యతే,
జ్ఞానం జ్ఞేయం జ్ఞానగమ్యం హృది సర్వస్య విష్ఠితమ్. 18

ఇది ఆదిత్యాది జ్యోతిస్సమూహమును గూడ ప్రకాశింపజేయుచున్నది. అజ్ఞానాంధకారముచే తాకబడనిది అని చెప్పబడుచున్నది. ఇదియే బుద్ధి వృత్తుల అభివ్యక్తమగు జ్ఞానము. రూపాది ఆకారముల తెలియుపడు జ్ఞేయము అమానిత్వాది సాధనలచే తెలియబడునది. ఇది అందరి హృదయముల అంతర్యామిగ వెలయుచున్నది.

శ్లో॥ ఇతి క్షేత్రం తథా జ్ఞానం జ్ఞేయంచోక్తం సమాసతః,
మద్భక్త ఏత ద్విజ్ఞాయ మద్భావాయోపపద్యతే. 19

ఇట్లు క్షేత్రము జ్ఞానము జ్ఞేయమును సంక్షేపముగ చెప్పబడినవి నా భక్తుడు యీ మూడు తత్వములను గ్రహించి నా స్వరూపమగు బ్రహ్మమును బొందు సమర్థుడగును.

శ్లో॥ ప్రకృతిం పురుషంచైవ విద్ధ్యనాదీ ఉభావపి,
వికారాంశ్చ గుణాంశ్చైవ విద్ధి ప్రకృతి సమ్భవాన్. 20

ప్రకృతి పురుషుల నిద్దరిని గూడ అనాదియని గ్రహింపుము శరీరేంద్రియ రూపములగు వికారములును సుఖదుఃఖమోహాదులగు గుణపరిణామములును ప్రకృతి నుండి గల్గినవి అని గ్రహింపుము.

శ్లో॥ కార్యకారణకర్తృత్వే హేతుః ప్రకృతిరుచ్యతే,
పురుషస్సుఖ దుఃఖానాం భోక్తృత్వే హేతురుచ్యతే. 21

ఈశ్వరుని త్రిగుణాత్మకమగు మాయాశక్తి దేహేంద్రియము లను సృష్టించుచున్నది. జీవుడు సుఖదుఃఖము లను భోగించుచున్నాడు అని చెప్పబడుచున్నది.

శ్లో॥ పురుషః ప్రకృతిస్థోహి భుఙ్క్తే ప్రకృతిజాన్ గుణాన్,
కారణం గుణ సఙ్గోఽస్య స దసద్యోనిజన్మసు. 22

భోక్తయగు జీవుడు ప్రకృతియందు వెలయుచు సుఖదుఃఖ మోహాకారముల అభివ్యక్తములగు గుణ సమూహములను భోగించు చున్నాడు. ఈ గుణశక్తియే జీవుని దేవ మనుష్య పశుజన్మముల గ్రహింపజేయుచున్నది.

శ్లో॥ ఉపద్రష్టాఽనుమన్తా చ భర్తా భోక్తా మహేశ్వరః,
పరమాత్మేతి చాప్యుక్తో దేహేఽస్మిన్ పురుషః పరః 23

అతడు యీ శరీరమున పరమ పురుషుడు, స్వతంత్రుడు, సాక్షి అనుగ్రాహకుడు, పాలకుడు, భోగించువాడు, పరమేశ్వరుడు,పరమాత్మ అని చెప్పబడును.

శ్లో॥ య ఏనం వేత్తి పురుషం ప్రకృతించ గుణైస్సహ,
సర్వథా వర్తమానోఽపి న స భూయోఽభిజాయతే. 24

యెవడు బ్రహ్మమును సాక్షాత్తుగ ఆత్మభావమున తెలిసికొను చున్నాడో,మరియు వికారయుక్తమగు ప్రకృతిని గ్రహించునో, అతడు సర్వభావముల సర్వావస్థల వెలయుచున్నను మరల జన్మింపడు.

శ్లో॥ ధ్యానేనాత్మని పశ్యన్తి కేచిదాత్మానమాత్మనా,
అన్యే సాఙ్ఖ్యేన యోగేన కర్మయోగేన చాపరే. 25

కొందరు ధ్యానమువలన బుద్ధియందు, కొందరు శుద్ధాంతఃకర ణము ద్వారా చైతన్యమును దర్శించుచున్నారు. ఇతరులు జ్ఞానయో గమువలనను, తదితరుల కర్మయోగము వలనను దర్శన మొనర్చు చున్నారు.

శ్లో॥ అన్యే త్వేవ మజానన్తః శ్రుత్వాఽన్యేభ్య ఉపాసతే,
తేఽపిచాతితరన్త్యేవ మృత్యుం శ్రుతిపరాయణాః 26

కొందరీయాత్మ తత్త్వమును యెరుంగజాలక గురూపదేశము నంది వుపాసించుచున్నారు. వీరు కూడా గురూపదేశమున జన్మ మృత్యుమయమగు సంసారమును అతిక్రమించుచున్నారు.

శ్లో॥ యావత్సంజాయతే కిఞ్చి త్సత్త్వం స్థావరజఙ్గమమ్,
క్షేత్రక్షేత్రజ్ఞసంయోగా త్తద్విద్ధి భరతర్షభ. 27

అర్జునా! స్థిరచరరూపమగు వస్తువు యేదైనను పుట్టుచున్నదో అది క్షేత్రక్షేత్రజ్ఞుల కూడికవలన అని గ్రహింపుము.

శ్లో॥ సమం సర్వేషు భూతేషు తిష్ఠన్తం పరమేశ్వరమ్,
వినశ్యత్స్వవినశ్యన్తం యః పశ్యతి స పశ్యతి. 28

సర్వభూతములలో సమానముగ వెలయుచున్నవాడును నశ్వరమగు వస్తువులతో నశింపక వెలయువాడును అగు పరమేశ్వరుని యెవడు చూచునో అతడు యదార్థదర్శి.

శ్లో॥ సమం పశ్యన్ హి సర్వత్ర సమవస్థిత మీశ్వరమ్,
న హినస్త్యాత్మనాత్మానం తతో యాతి పరాంగతిమ్. 29

యెల్లయెడల అంతటను సమానముగ వెలయుచున్న పరమాత్మను చూచుచున్న వ్యక్తి తన్నుతాను హింసించుకొనడు. కనుక మోక్షమును పొందును

శ్లో॥ ప్రకృత్యైవచ కర్మాణి క్రియమాణాని సర్వశః,
యః పశ్యతి తథాత్మాన మకర్తారం స పశ్యతి. 30

మనోవాక్కాయ కృతములగు కర్మముల నన్నిటిని దేహేంద్రియాకారముగ పరిణమించిన ప్రకృతియే సర్వ ప్రకారముల నొనర్చుచున్నదనియు, ఆత్మ సర్వోపాధివివర్జితమనియు గ్రహించునతడు యదార్థ దర్శి.

శ్లో॥ యదా భూతపృథగ్భావ మేకస్థ మనుపశ్యతి,
తత ఏవచ విస్తారం బ్రహ్మసమ్పద్యతే తదా. 31

యోగియెప్పుడు వివిధములగు భూతముల వునికిని ఆత్మయందు దర్శించునో, మరియు ఆ ఆత్మనుండియే భూతముల వుత్పత్తి యని గ్రహించునో, అప్పుడతడు బ్రహ్మ స్వరూపుడగును

శ్లో॥ అనాదిత్వాన్నిర్గుణత్వాత్పరమాత్మాఽయమవ్యయః,
శరీరస్థోఽపి కౌన్తేయ న కరోతి న లిప్యతే. 32

లేక యోగి యెప్పుడు ఈ భేదదృష్టి అంతయు ప్రళయకాలమున యేకమై ఈశ్వర శక్తియగు ప్రకృతి యందు వెలయుచు మరల సృష్టి సమయమున వెలికివచ్చుచున్నది. ఇదంతయును దాని విస్తృతియే అని గ్రహించునో, అప్పుడు అభేద దర్శనముగ అతడు బ్రహ్మమేయగును.

శ్లో॥ యథా సర్వగతం సౌక్ష్మ్యాదాకాశం నోపలిప్యతే,
సర్వత్రావస్థితో దేహే తథాత్మా నోపలిప్యతే. 33

సర్వవ్యాపకమగు ఆకాశము సూక్ష్మమగుటవలన యేరీతిగ అంటబడదో అట్లే వివిధ శరీరముల వెలయుచున్నను ఆత్మనిర్లిప్తము.

శ్లో॥ యథా ప్రకాశయత్యేకః కృత్స్నం లోకమిమం రవిః,
క్షేత్రం క్షేత్రీ తథా కృత్స్నం ప్రకాశయతి భారత. 34

అర్జునా! ఒక్కడగు సూర్యుడు యీ సమస్తమగు జగత్తును యేరీతిగ ప్రకాశింపజేయుచున్నాడో అట్లే పరమాత్మ సమస్తమగు శరీరమును మహాభూతములను జగత్తును ప్రకాశింప జేయుచున్నాడు.

శ్లో॥ క్షేత్రక్షేత్రజ్ఞయోరేవ మన్తరం జ్ఞానచక్షుషా,
భూతప్రకృతిమోక్షంచ యేవిదుర్యాన్తి తే పరమ్. 35

యెవరు యీ రీతిగ క్షేత్రక్షేత్రజ్ఞుల ప్రభేదమును, మరియు భూతసమూహమునకు చెందిన అవిద్యా లక్షణమగు ప్రకృతియొక్క మిథ్యాత్వమును జ్ఞాననేత్రమున యెరుగుదురో వారు పరబ్రహ్మమును పొందుచున్నారు.

క్షేత్రక్షేత్రజ్ఞయోగమను పదమూడవ అధ్యాయం సమాప్తం

అస్పర్శయోగము అనే
శ్రీ మద్భగవద్గీత
రాజయోగీయము
చతుర్దశాధ్యాయము
గుణత్రయవిభాగయోగము

శ్రీ భగవానువాచ :

శ్లో॥ పరం భూయః ప్రవక్ష్యామి జ్ఞానానాం జ్ఞాన ముత్తమమ్,
యద్ జ్ఞాత్వా మునయ స్సర్వే పరాం సిద్ధి మితో గతాః 1

కృష్ణుడు పలికెను జ్ఞానములన్నిటిలో శ్రేష్ఠమును పరమార్థ విషయమును అగు జ్ఞానమును దేనిని గ్రహించి మునులు అందరును యీ శరీరమునుండి విడబడి మోక్షరూపమను సిద్ధిని పొందిరో దానిని మరల చెప్పెదను,

శ్లో॥ ఇదం జ్ఞాన ముపాశ్రిత్య మమ సాధర్మ్యమాగతాః,
సర్గేఽపి నోపజాయన్తే ప్రళయే న వ్యథన్తి చ. 2

యీ జ్ఞానమును అనుష్ఠించి నా స్వరూపమును పొందినవారు సృష్టికాలమున కూడ పుట్టరు. ప్రళయకాలమున దుఃఖమును పొందరు.

శ్లో॥ మమ యోని ర్మహ ద్బ్రహ్మ తస్మిన్ గర్భం దధా మ్యహమ్,
సమ్భవ స్సర్వభూతానాం తతో భవతి భారత. 3

అర్జునా! త్రిగుణాత్మికయగు ప్రకృతి నాకు గర్భస్థానము దాని యందు నేను సృష్టి బీజమును వుంచుచున్నాను. అందువలన సర్వ భూతముల వుత్పత్తి అగుచున్నది.

శ్లో॥ సర్వయోనిషు కౌన్తేయ! మూర్తయ స్సమ్భవన్తి యాః,
తాసాం బ్రహ్మ మహ ద్యోని రహం బీజప్రదః పితా. 4

అర్జునా! దేవ, పితృ, మనుష్య, పశు యోనులలో యే దేహములు కలుగుచున్నవో వానికి జనని త్రిగుణాత్మకయగు ప్రకృతి నేను బీజము నొసగెడి జనకుడను.

శ్లో॥ సత్త్వం రజ స్తమ ఇతి గుణాః ప్రకృతిసమ్భవాః,
నిబధ్నన్తి మహాబాహో దేహే దేహినమవ్యయమ్. 5

అర్జునా! సత్త్వము రజస్సు తమము అని ప్రకృతి జాతములగు త్రిగుణములు నిర్వికారమగు ఆత్మను శరీరమున బంధించుచున్నవి

శ్లో॥ తత్ర సత్త్వం నిర్మలత్వాత్ప్రకాశక మనామయమ్,
సుఖసంగేన బధ్నాతి జ్ఞానసఙ్గేన చానఘ 6

అనఘా! సత్త్వగుణము నిర్మలమును శాంతమును ప్రకాశ స్వభావమును అయియున్నది. ఇది జ్ఞానశక్తిని సుఖాసక్తిని కలిగించి ఆత్మను బంధించు దానివలెనున్నది.

శ్లో॥ రజో రాగాత్మకం విద్ధి తృష్ణాసఙ్గసముద్భవమ్,
త న్నిబధ్నాతి కౌన్తేయ! కర్మసఙ్గేన దేహినమ్. 7

అర్జునా! రజోగుణము ఆసక్తికి మూలమై తృష్ణను పెంపొంద చేయుచున్నది. ఇది జీవునకు వివిధములను కర్మముల యందనురాగమును కలిగించి వివిధములను ఫలములను బొందవలెనను ఆశను పురిగొల్పి బంధించుదానివలెనున్నది.

శ్లో॥ తమ స్త్వజ్ఞానజం విద్ధి మోహనం సర్వదేహినామ్,
ప్రమాదాలస్య నిద్రాభిస్తన్నిబధ్నాతి భారత. 8

భారతా! తమోగుణము ఆవరణశక్తి ప్రధానమగు ప్రకృతి అంశమునుండి వుత్పన్నమై దేహధారులందరికిని మోహమును కలిగించుచున్నది. అని గ్రహింపుము. ఇది మరుపు, మత్తు, నిద్ర యను వానివలన ఆత్మను శరీరమున బంధించుదానివలెనున్నది.

శ్లో॥ సత్త్వం సుఖే సఞ్జయతి రజః కర్మణి భారత!
జ్ఞానమావృత్యతు తమః ప్రమాదే సఞ్జయత్యుత. 9

అర్జునా! సత్త్వగుణము జీవుని సుఖముతో కలుపుచున్నది. రజోగుణము కర్మలయందు చేర్చుచున్నది. మరియు తమోగుణము జ్ఞానమును ఆవరించి పొరపాటును కలిగించి బంధించుచున్నది.

శ్లో॥ రజస్తమశ్చాభిభూయ సత్త్వం భవతి భారత!
రజస్సత్త్వం తమశ్చైవ తమస్సత్త్వం రజస్తథా 10

భారతా! సత్త్వగుణము రజస్తమములనాక్రమించి ప్రబలమగుచున్నది. రజోగుణము సత్త్వతమములను తిరస్కరించి ప్రాధాన్యమునందుచున్నది. తమోగుణము సత్త్వరజములను పరాభవించి పైకి వచ్చుచున్నది.

శ్లో॥ సర్వద్వారేషు దేహేఽస్మిన్ ప్రకాశ ఉపజాయతే,
జ్ఞానం యదా తదా విద్యాద్వివృద్ధం సత్త్వమిత్యుత. 11

యెప్పుడు శరీరద్వారములగు శ్రోత్రాదులయందు శబ్దాదిజ్ఞానాత్మకమగు ప్రకాశము కలుగుచున్నదో లేక అశబ్దాదుల సుఖము పరిరక్షితమగుచున్నదో అప్పుడు సత్త్వగుణము వృద్ధినిజెందినది అని తెలిసికొనవలెను.

శ్లో॥ లోభః ప్రవృత్తి రారమ్భః కర్మణా మశమః స్పృహా,
రజస్యేతాని జాయన్తే వివృద్ధే భరతర్షభ. 12

అర్జునా! ధనము పెక్కు రీతుల లభించుచున్నను ఇంకను కావలయుననెడి అభిలాష (లోభము) యెల్లప్పుడును యేదో ఒక పని నొనర్చుచుండుట (ప్రవృత్తి) పెద్దవియగు మేడలను, మిద్దెలను కట్టుటను బోలు ప్రయత్నములు (కర్మముల నారంభించుట) యీ పని ముగించి ఆ పనిని ప్రారంభించుట, ఇట్టి సంకల్పవికల్పములు శాంతిం

పకుండుట (అశాంతి), ఏ వస్తువునైనను చూచినతోడనే కోరుట (స్పృహా) అనునవి రజోగుణము వృద్ధిపొందిన కలుగుచున్నవి. ఈ చిన్నములున్న యెడల రజోగుణము ప్రబలమైనదని గ్రహింపుము.

శ్లో॥ అప్రకాశో ప్రవృత్తిశ్చ ప్రమాదో మోహ ఏవచ,
తమ స్యేతాని జాయన్తే వివృద్ధేకురునన్దన 13

అర్జునా అవివేకము ప్రయత్నశూన్యత కర్తవ్యము నెడల ఔదాసీన్యము మూఢత్వము అనునవి, తమోగుణము వృద్ధినందిన కలుగుచున్నవి. ఇవి తమోవృద్ధి సూచకములు అని గ్రహింపుము.

శ్లో॥ యదా సత్త్వే ప్రవృద్ధేతు ప్రళయం యాతి దేహభృత్,
తదోత్తమవిదాం లోకా నమలాన్ ప్రతిపద్యతే. 14

సత్త్వవృద్ధి కాలమున దేహత్యాగ మొనర్చిన మనుష్యుడు హిరణ్యగర్భాది వుపాసకులకు లభించు ప్రకాశమయ లోకములను బొందుచున్నాడు.

శ్లో॥ రజసి ప్రళయం గత్వా కర్మసఙ్గిషు జాయతే,
తథా ప్రలీన స్తమసి మూఢ యోనిషు జాయతే. 15

రజోగుణము ప్రబలమైన స్థితిలో మరణించిన, కర్మాసక్తుడగు మనుష్యలోకమున జన్మించుచున్నాడు. అట్లే తమోగుణము వృద్ధి నందినప్పుడు చనిపోయిన యెడల పశ్వాది మూఢయోనుల పుట్టుచున్నాడు.

శ్లో॥ కర్మణస్సుకృతస్యాహు స్సాత్త్వికం నిర్మలంఫలమ్,
రజసస్తు ఫలం దుఃఖ మజ్ఞానం తమసః ఫలమ్. 16

సాత్త్విక కర్మముల ఫలము నిర్మల సుఖమనియు రాజసిక కర్మల ఫలము దుఃఖమనియు, తామసిక కర్మముల ఫలము అజ్ఞానమనియూ శిష్టులు చెప్పుచున్నారు.

శ్లో॥ సత్త్వాత్సఞ్జాయతే జ్ఞానం రజసో లోభఏవచ,
ప్రమాదమోహౌ తమసో భవతోఽజ్ఞానమేవచ. 17

సత్త్వగుణమునుండి జ్ఞానము కలుగుచున్నది. రజోగుణమునుండి లోభముకలుగుచున్నది. తమస్సునుండి అవివేకము, కర్తవ్య ఔదాసీన్యము, విమూఢత్వమును కలుగుచున్నవి.

శ్లో॥ ఊర్ధ్వం గచ్ఛన్తి సత్త్వస్థా మధ్యే తిష్ఠన్తి రాజసాః,
జఘన్యగుణవృత్తిస్థా అధోగచ్ఛన్తి తామసాః. 18

సాత్త్వికులు మనుష్య లోకమునుండి దేవలోకమునకు పోవుచున్నారు. రాజసికులు మనుష్య లోకమున వుందురు. నీచగుణయుక్తులగు తామసికులు నరకలోకమును పొందుదురు.

శ్లో॥ నాన్యం గుణేభ్యః కర్తారం యదా ద్రష్టానుపశ్యతి,
గుణేభ్యశ్చ పరంవేత్తి మద్భావం సోఽధిగచ్ఛతి. 19

ద్రష్టయగు జీవుడెప్పుడు వివేకమును గణించి గుణములకంటె వేరగు కర్తను చూడడో, మరియు ఈ గుణ వ్యాపారములకు అతీతుడై సాక్షిగానున్న ఆత్మను దర్శించునో అప్పుడతడు నా భావమును బొందును.

శ్లో॥ గుణానేతానతీత్య త్రీన్ దేహీ దేహసముద్భవాన్,
జన్మమృత్యుజరాదుఃఖైర్విముక్తోఽమృతమశ్నుతే. 20

దేహోత్పత్తికి కారణములగు ఈ గుణత్రయమునతిక్రమించిన జీవుడు, జనన మరణ జరాదుఃఖములనుండి విడివడి అమృతత్వమును బొందుచున్నాడు.

అర్జున ఉవాచ :

శ్లో॥ కైర్లిఙ్గైస్త్రీన్ గుణానేతానతీతో భవతి ప్రభో!
కిమాచారః కథంచైతాంస్త్రీన్ గుణానతివర్తతే. 21

అర్జునుడు ప్రశ్నించెను. ప్రభూ! గుణాతీత పురుషుని లక్షణ మేమి. అతని ఆచరణ యెట్లుండును? ఈ గుణముల నతిక్రమించుట యెట్లు?

శ్రీ భగవానువాచ :

శ్లో॥ ప్రకాశంచ ప్రవృత్తించ మోహమేవచ పాణ్డవ,
న ద్వేష్టి సంప్రవృత్తాని న నివృత్తాని కాఙ్క్షతి. 22

శ్రీకృష్ణుడు పల్కెను. అర్జునా! సత్వగుణ ధర్మమును, రజోగుణ ధర్మమును తమోగుణధర్మమును. ఆవిర్భవించిన యెవడు ద్వేషింపకుండునో, అవి తొలగిన కోరకుండునో, అతడు గుణాతీతుడని చెప్పబడును,

శ్లో॥ ఉదాసీనవదాసీనో గుణైర్యో న విచాల్యతే.
గుణా వర్తన్త ఇత్యేవ యోఽవతిష్ఠతి నేఙ్గతే 23

యెవడు తటస్థునివలె వొప్పుచు గుణములవలన చలింపబడడో గుణములు స్వకార్యముల వర్తిల్లుచున్నవి, అని ఇట్లు గ్రహించి యెవడు వెలయుచుండునో, మరిచలింపడో, అతడు గుణాతీతుడు,

శ్లో॥ సమదుఃఖసుఖస్స్వస్థ స్సమలోష్టాశ్మకాఞ్చనః,
తుల్యప్రియాప్రియో ధీర స్తుల్యనిన్దాత్మసంస్తుతిః, 24

శ్లో॥ మానావమానయో స్తుల్య స్తుల్యో మిత్రారిపక్షయోః,
సర్వారమ్భ పరిత్యాగీ గుణాతీత స్స ఉచ్యతే 25

సుఖదుఃఖముల సమబుద్ధియును. ఆత్మస్వరూపస్థితుడును శిలా మృత్పిండసువర్ణముల సమదృష్టియును, ప్రియాప్రియముల తుల్యజ్ఞానమును. నిందా ప్రశంసల నొకే రీతిగ గ్రహించువాడును అగు ధీరుడు గుణాతీతుడు.

మానావమానముల యెడను శత్రుమిత్రుల యెడను. సమబుద్ధి నుంచువాడును. దృష్టాదృష్ట ఫలదాయకములగు కర్మలన్నిటిని త్యజించినవాడును, అగు పురుషుడు త్రిగుణాతీతుడని చెప్పబడును.

శ్లో॥ మాంచ యోఽవ్యభిచారేణ భక్తియోగేణ సేవతే,
సగుణాంత్సమతీత్యైతాన్ బ్రహ్మభూయాయ కల్పతే. 26

యెవడు ఏకాంతికమగు భక్తితో సర్వభూత హృదయ స్థితుడనగు నన్ను వుపాసించుచున్నాడో, అతడు గుణముల నతిక్రమించి బ్రహ్మ భావమునొందక సమర్థుడగుచున్నాడు.

శ్లో॥ బ్రహ్మణోహి ప్రతిష్ఠాఽహ మమృతస్యావ్యయస్యచః.
శాశ్వతస్య చ ధర్మస్య సుఖస్యైకాన్తికస్యచ. 27

యేలయన నేను వికార రహితుడను వినాశరహితమును, నిత్యమును జ్ఞానయోగ ధర్మప్రాప్యమును అవ్యభిచారసుఖస్వరూపమును, అగు బ్రహ్మమునకు ఆశ్రయుడను కనుక నా భక్తులు బ్రహ్మ భావమును బొందెదరు.

చతుర్దశాధ్యాయము పూర్తి.

అపూర్వయోగము అనే
శ్రీ మద్భగవద్గీత
రాజయోగీయము
పంచదశాధ్యాయము
పురుషోత్తమప్రాప్తి యోగము

శ్రీ భగవానువాచ :

శ్లో॥ ఊర్ధ్వమూలమధశ్శాఖమశ్వత్థం ప్రాహురవ్యయమ్,
ఛన్దాంసి యస్య పర్ణాని యస్తం వేద సవేదవిత్. 1

శ్రీ కృష్ణుడు పల్కెను. ఈ సంసార వృక్షమునకు కారణము వూర్ధ్వముననున్నది. దీని శాఖలు క్రిందుగ నున్నవి. కర్మకాండరూపములగు వేదములు దీని పత్రములు. అనాదియును క్షణికమును అగు ఈ సంసారము వేదశాస్త్ర పురాణములలో మాయామయ వృక్షమని చెప్పబడియున్నది. యిట్టిసంసార వృక్షమును తెలిసికొనినవాడే వేదజ్ఞుడు.

శ్లో॥ అధశ్చోర్ధ్వం ప్రసృతాస్తస్య శాఖా
గుణప్రవృద్ధా విషయ ప్రవాళాః,
అధశ్చ మూలాన్యనుసన్తతాని
కర్మానుబన్ధీని మనుష్యలోకే. 2

యీ సంసార వృక్షముయొక్క శాఖా సమూహములగుజీవులు గుణత్రయమువలన పరిపుష్టినందుచు రూపరసాదులగు విషయ పల్లవములతోగూడి వూర్ధ్వాధో దేశముల వ్యాపించియున్నవి. కాని మనుష్యలోకముననే ధర్మాధర్మ జనకములగు దీని మూల సమూహములు క్రిందుగ పాదుకొనియున్నవి అనగా కర్మాచరణయందు కేవలము మనుష్యులకే అధికారముండుటచేతను, సుకృతులగు దేవయోనులయందును. మనుష్యులనుండి బ్రహ్మవరకుగల జీవులయందు జన్మించుట, మనుష్యులనుండి పశ్వాదయోనులయందు స్థావరపర్యంతముగల నిమ్నయోనుల జన్మించుట మనుష్యలోకముననేయని చెప్పబడినది. గనుక లింగదేహము వాసనల కాశ్రయము.

శ్లో॥ నరూప మస్యేహ త థోపలభ్యతే
నాన్తో నచాదిర్న చ సంప్రతిష్ఠా,
అశ్వత్థ మేనం సువిరూఢమూల
మసఙ్గశ స్త్రేణ దృఢేన ఛిత్త్వా. 3
తతః పదం త త్పరిమార్గితవ్యం
యస్మిన్ గతా న నివర్తన్తి భూయః,
త మేవ చాద్యం పురుషం ప్రపద్యే
యతః ప్రవృత్తిః ప్రసృతా పురాణీ 4

ఇహలోకమున ప్రాణులు ఈ సంసార రూపమగు అశ్వత్థము యొక్క స్వరూపమును వెనుక చెప్పబడిన రీతిగా తెలిసికొనజాలకున్నారు. దీనికి ఆరంభము లేదు. అనాది దీనికి అంతము లేదు. దీని స్థితిని ఇది యెట్లున్నదీ, తెలియజాలము ఇది ప్రామాణ్యము కాదు. ప్రతీతి మాత్రము (తోచుట) ఈ సంసారాశ్వత్థమును తీవ్ర వైరాగ్యమను దృఢశస్త్రముతో ఛేదించి.

పిదప దేనిని బడసిన మరల ఈ సంసారమునకు వచ్చుట యనునది లేదో ఆపదమును అన్వేషింపవలయును. యెవని నుండి అనాది యగు ఈ సంసార ప్రవాహము నిర్గతమైనదో నేను ఆ ఆదిపురుషుని శరణు జొచ్చుచున్నాడను.

శ్లో॥ నిర్మానమోహా జితసఙ్గదోషా
అధ్యాత్మనిత్యా వినివృత్తకామాః,
ద్వన్ద్వైర్విముక్తా స్సుఖదుఃఖసంజ్ఞై
ర్గచ్ఛన్త్యమూఢాః పద మవ్యయన్తత్. 5

అహంకారము అవివేకము లేనివారును, ఆసక్తియను దోషమును జయించిన వారును పరమాత్మ జ్ఞాననిష్ఠులును నిష్కాములును

సుఖదుఃఖములను ద్వంద్వములనుండి విడివడినవారును అగు స్వచ్ఛందులు అక్షయమగు ఆస్థానమును పొందుచున్నారు.

శ్లో॥ నతద్భాసయతే సూర్యో నశశాఙ్కో న పావకః,
యద్గత్వా ననివర్తన్తే తద్ధామ పరమం మమ. 6

ఏ పదమును పొందిన తిరిగి రారో దానిని రవి ప్రకాశింపజేయజాలడు చంద్రుడుగాని అగ్నిగాని ప్రకాశింప జేయజాలరు. అది నా శ్రేష్ఠమగు పదము.

శ్లో॥ మమైవాంశో జీవలోకే జీవభూత స్సనాతనః,
మనష్షష్ఠా నీన్ద్రియాణి ప్రకృతిస్థాని కర్షతి. 7

నా అంశమే లోకమున కర్తయును భోక్తయును అగు జీవుడుగా ప్రసిద్ధి. ఇతడే సుషుప్తి ప్రళయకాలముల ప్రకృతియందు లీనమైన ఇంద్రియ పంచకమును మనస్సును మరల సంసారోపభోగార్థము ఆకర్షించుచున్నాడు.

శ్లో॥ శరీరంయదవాప్నోతి యచ్చాప్యుత్క్రామతీశ్వరః.
గృహీత్వైతాని సంయాతి వాయుర్గన్ధానివాశయాత్. 8

దేహాది సంఘాతమునకు స్వామి యనగా జీవుడు ఎప్పుడు దేహమును పొందుచున్నాడో మరియు ఎప్పుడు త్యజించునో అప్పుడు వాయువు సుగంధ దుర్గంధములను గ్రహించునట్లు ఈ ఇంద్రియములను గ్రహించి వెలువడుచున్నాడు.

శ్లో॥ శ్రోత్రంచక్షుః స్పర్శనంచ రసనం ఘ్రాణమేవచ,
అధిష్ఠాయ మన శ్చాయం విషయా నుపసేవతే. 9

ఈ దేహి కర్ణమును నేత్రమును త్వక్కును జిహ్వను నాసికను మనస్సును ఆశ్రయించిరూపరసాది విషయములను భోగించుచున్నాడు

శ్లో॥ ఉత్క్రామన్తం స్థితం వాపి భుఞ్జానం వా గుణాన్వితమ్,
విమూఢా నానుపశ్యన్తి పశ్యన్తి జ్ఞానచక్షుషః. 10

దేహాంతరమున కరుగువాడును. శరీరమున వెలయువాడును. విషయముల భోగించువాడును. త్రిగుణ పరిణామములగు సుఖదుఃఖ మోహములతో కూడువాడును అగు జీవాత్మను మూఢులెరుంగజాలకున్నారు. ఏలయన వారి మనస్సు విషయాకర్షణవలన బహిర్ముఖముగనున్నది. కాని అంతర్ముఖులగు వ్యక్తులు జ్ఞాన చక్షువుతో ఆ జీవాత్మను చూడగలరు.

శ్లో॥ యతన్తో యోగినశ్చైనం పశ్యన్త్యాత్మన్యవస్థితమ్,
యతన్తోఽప్యకృతాత్మానో నైనం పశ్యన్త్యచేతసః. 11

సమాహిత చిత్తులగు యోగులు ఈ ఆత్మను స్వీయమగు బుద్ధియందు సాక్షిరూపమున వెలయువానిని చూచుచున్నారు. ప్రయత్నించుచుండినను అశుద్ధ చిత్తులగు అవివేకులు ఈ ఆత్మను దర్శింపజాలరు.

శ్లో॥ యదాదిత్యగతం తేజో జగద్భాసయతేఽఖిలమ్,
యచ్చన్ద్రమసి యచ్చాగ్నౌ తత్తేజో విద్ధి మామకమ్. 12

సూర్యునియందుండు యే తేజస్సు విశ్వమునంతటిని ప్రకాశింపజేయుచున్నదో మరియు చంద్రునియందున్న కాంతి యేదిగలదో అగ్నియందున్న ప్రభయెయ్యదియో ఆ జ్యోతిస నాదిగా తెలిసికొనుము.

శ్లో॥ గామావిశ్య చ భూతాని ధారయామ్యహమోజసా,
పుష్ణామి చౌషధీస్సర్వాః సోమో భూత్వా రసాత్మకః 13

నేను ఈశ్వరీయమగు శక్తివలన పృథివిని ప్రవేశించి చరాచరములగు భూతములను ధరించుచున్నాడను. మరియు రసస్వరూపినగు

చంద్రుడనై వ్రీహియవాదులగు ఓషధులను (పంట నొసగి యెండి పోవునవి) పోషించుచున్నాడను.

శ్లో॥ అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహమాశ్రితః,
ప్రాణాపానసమాయుక్తః పచామ్యన్నం చతుర్విధమ్ 14

నేను జఠరాగ్నినై జీవుల శరీరమును ఆశ్రయించి ప్రాణాపాన వాయువులతో గూడి భక్ష్య భోజ్య లేహ్య చోష్యములను నాల్గు విధముల ఖాద్యములను పరిపాక మొనర్చుచున్నాను.

శ్లో॥ సర్వస్య చాహం హృది సన్నివిష్టో
మత్తస్స్మృతి ర్జ్ఞానమపోహనం చ,
వేదైశ్చ సర్వై రహ మేవ వేద్యో
వేదాన్తకృద్వేదవి దేవచాహమ్ 15

నేను ఆబ్రహ్మస్తంభ పర్యంతముగల ప్రాణులందరియొక్కయు బుద్ధియందు ప్రతిష్ఠుడను నా నుండి జ్ఞప్తి జ్ఞానము. యీ రెంటి యొక్క విస్మృతియును కలుగుచున్నవి. వేదములు నాల్గింటిచేతను నేనే తెలిసికొనదగినవాడను వేదాంత సంప్రదాయ ప్రవర్తకుడను వేదార్థవేత్తను కూడా నేనే.

శ్లో॥ ద్వావిమౌ పురుషౌ లోకే క్షరశ్చాక్షర ఏవచ,
క్షరస్సర్వాణి భూతాని కూటస్థోఽక్షర ఉచ్యతే. 16

క్షరుడు అక్షరుడును అను ఈ యిరువురు పురుషులే జగత్తున ప్రసిద్ధులు వినాశియగు క్షరపురుషుడు సమస్త వికారజాతమంతయును అక్షర పురుషుడు కూటరూపమున (ఆకాశాదికము) చెప్పబడుచున్నది అనగా క్షరమునకు బీజభూతమగు మాయాశక్తి.

శ్లో॥ ఉత్తమఃపురుష స్త్వన్యః పరమాత్మేత్యుదాహృతః,
యో లోకత్రయమావిశ్య బిభర్త్యవ్యయ ఈశ్వరః. 17

క్షరాక్షరుల కంటెను వేరగు పురుషోత్తముడు పరమాత్మ యని చెప్పబడును. అక్షయమగు పరమాత్మయే లోకత్రయమున ప్రవేశించి పాలించుచున్నాడు.

శ్లో॥ యస్మాత్క్షర మతీతోహ మక్షరాదపిచోత్తమః,
అతోస్మిలోకే వేదేచ ప్రథితః పురుషోత్తమః. 18

యెందువలన నేను క్షరము లేక అశ్వత్థ మనబడు సంసార మాయా వృక్షమునకు అతీతుడనో, అక్షరము లేక సంసార బీజభూత మగు శక్తి కంటెను గూడ శ్రేష్టుడనో అందువలన లోకమునను వేదమునను పురుషోత్తముడనని ప్రసిద్ధుడనైతిని. అస్పృశ్య పద్ధతి వల్ల పురుషోత్తముడని నిర్ణయము

శ్లో॥ యోమామేవమసమ్మూఢో జానాతి పురుషోత్తమమ్,
స సర్వవి ద్భజతి మాం సర్వభావేన భారత! 19

అర్జునా ఇట్లు యెవడు అభిమాన రహితుడై పురుషోత్తమునిగా నన్ను యెరుగునో అతడు సర్వాత్మనా నన్ను భజించును. పిదప సర్వజ్ఞుడు అగును.

శ్లో॥ ఇతి గుహ్యతమం శాస్త్ర మిద ముక్తం మయానఘ,
ఏతద్బుద్ధ్వా బుద్ధిమాన్ స్యా త్కృతకృత్యశ్చ భారత. 20

పాప రహితా, ఇట్లు ఈ అత్యంతము రహస్యమగు శాస్త్రము నాచేతను చెప్పబడినది. అర్జునా దీనిని తెలిసికొనిన బుద్ధిమంతుడు కృతార్థుడగును.

పంచదశోధ్యాయః సంపూర్ణః

అక్షరపరబ్రహ్మయోగము అనే

శ్రీ మద్భగవద్గీత

రాజయోగీయము

షోడశాధ్యాయము

దైవాసుర సంపద్విభాగ యోగము

శ్రీ భగవా నువాచ :

శ్లో॥ అభయం సత్త్వసంశుద్ధి ర్జ్ఞానయోగవ్యవస్థితిః,

దానం దమశ్చ యజ్ఞశ్చ స్వాధ్యాయ స్తపఆర్జవమ్. 1

శ్రీ కృష్ణుడు పల్కెను. భయము లేకుండుట, త్రికరణశుద్ధి జ్ఞాననిష్ఠ దానము బాహేంద్రియ సంయమము యజ్ఞము, బ్రహ్మయజ్ఞము తపస్సు ఋజు ప్రవర్తనము.

శ్లో॥ అహింసాసత్య మక్రోధ స్త్యాగశ్శాన్తి రపైశునమ్,

దయాభూతేష్వలోలత్వం మార్దవం హ్రీరచాపలమ్. 2

ప్రాణులను పీడింపకుండుట, నిజమగు దానిని చెప్పుట, కోపము వణచుకొనుట త్యాగము శాంతిః యితరుల దోషములను వెల్లడిచేయకుండుట, దయకలిగియుండుట, విషయములు యెదటనున్నను చలింపకుండుట, మృదుత్వము, సిగ్గుజెందునటువంటి వ్యర్థ కార్యముల నొనర్పకుండుట.

శ్లో॥ తేజః క్షమాధృతిశ్శౌచమద్రోహోనాభిమానితా,

భవన్తి సమ్పదం దైవీ మభిజాతస్య భారత. 3

ప్రతిభ, పరాభవము కల్గినను కోపము రాకుండుట, దుఃఖముల నవసాదమును జెందక ధైర్యమును వహించుట. బాహ్యాభ్యంతర శుద్ధి వైరభావము లేకుండుట యెక్కువగ పూజింపదగినవాడనను భావము లేకుండుట అనునవి అర్జునా దేవతా యోగ్యమగు (సాత్త్వికమగు) స్థితిని అనుసరించి పుట్టినవానికి కలుగుచున్నవి.

శ్లో॥ దంభో దర్పోఽభిమానశ్చ క్రోధః పారుష్య మేవచ,
అజ్ఞానం చాభిజాతస్య పార్థ! సంపద మాసురీమ్. 4

అర్జునా! కపటమగు ధర్మాచరణము విద్యాధన సంపదగర్వము, అతి పూజ్యత్వాభిమానము, కోపము. నిష్ఠురత్వము, అజ్ఞానము రాక్షసమగు స్థితిని అనుసరించి పుట్టినవానికి కలుగుచున్నవి.

శ్లో॥ దైవీసంపద్విమోక్షాయ నిబంధాయాసురీ మతా,
మాశుచ స్సంపదం దైవీ ముపజాతోసి పాండవ. 5

అర్జునా. దేవయోగమగు సాత్త్విక సంపద ముక్తి కొరకును అసుర సంపద బంధహేతువుగను, చెప్పబడినవి. శోకింపకుము. నీవు దైవీక సంపదకు యోగ్యుడవై జన్మించితివి.

శ్లో॥ ద్వౌ భూతసర్గౌ లోకేస్మిన్ దైవ ఆసుర ఏవ చ,
దైవో విస్తరశః ప్రోక్త ఆసురం పార్థమే శృణు, 6

అర్జునా ఈ జగత్తున దైవ స్వభావము, అసుర స్వభావమును గల రెండు విధములుగ మనుష్యులు సృష్టింపబడియున్నారు దైవీ స్వభావ సంపన్నుల విషయము విశదముగనే చెప్పితిని. ఇక అసురస్వభావయుక్తులగు వారిని గురించి చెప్పెదను వినుము.

శ్లో॥ ప్రవృత్తించ నివృత్తించ జనా నవిదు రాసురాః,
నశౌచం నాపిచాచారో నసత్యం తేషు విద్యతే. 7

అసుర స్వభావముగలవారికి ధర్మమున ప్రవృత్తి కలుగదు. అధర్మమునుండి వారు నివృత్తులవరు వారికి శౌచసత్య సదాచారము లుండవు.

శ్లో॥ అసత్య మప్రతిష్ఠంతే జగ దాహు రనీశ్వరమ్.
అపరస్పరసంభూతం కిమన్య త్కామహైతుకమ్. 8

వారు యీజగత్తును అసత్యము ధర్మాధర్మవ్యవస్థాశూన్యము, కర్మమును ఫలదాతయును అగు యీశ్వరుడు లేనిది కామవశమున స్త్రీ పురుష సంయోగమును పునస్కరించుకొని పుత్పన్నమైనది అనియు మరియు దీనికి యితర కారణము లేవియును లేవనియు చెప్పెదరు

శ్లో॥ ఏతాం దృష్టిమవష్టభ్య నష్టాత్మానోఽల్పబుద్ధయః,
ప్రభవం త్యుగ్రకర్మాణః క్షయాయ జగతోఽహితాః. 9

ఇట్టి నాస్తికదృష్టి నవలంబించి పరలోక సాధన చ్యుతులును కూరకర్మలును, అపకారులును. అల్పబుద్ధులును అగు వ్యక్తులు జగత్తుయొక్క క్షయము కొరకే పుట్టుచున్నారు.

శ్లో॥ కామ మాశ్రిత్య దుష్పూరం దంభమానమదాన్వితాః,
మోహాద్గృహీత్వా సద్గ్రాహాన్ ప్రవర్తంతేఽశుచివ్రతాః. 10

అపరిమితమగు కామము నాశ్రయించి అవివేకముతో అశుభ నిశ్చయములు గలవారై అపవిత్రములగు వ్రతముల నొనర్చుచున్నారు.

శ్లో॥ చింతా మపరిమేయాం చ ప్రళయాంతా ముపాశ్రితాః,
కామోపభోగపరమా ఏతావ దితి నిశ్చితాః 11

వారు మృతినందు వరకు మొనలేని చింతను బొందుచు కామ భోగమే పరమ పురుషార్థముఅనియు దానికి మించినదేమియు లేదనియు నమ్ముదురు.

శ్లో॥ ఆశాపాశశతై ర్బద్ధాః కామక్రోధ పరాయణాః
ఈహంతే కామ భోగార్థ మన్యాయేనార్థసంచయాన్. 12

వారు అసంఖ్యములగు ఆశాపాశముల బద్ధులై కామక్రోధము లకు లోబడి విషయ భోగముల ననుభవింప అసదుపాయముల నవలంబించి ధనమును కూడబెట్టు చున్నారు.

శ్లో॥ ఇదమద్య మయా లబ్ధ మిమం ప్రాప్స్యే మనోరథమ్,
ఇదమస్తీద మపి మే భవిష్యతి పునర్ధనమ్. 13

నేడు నాకిది లభించినది. యీ మనోరథము ముందు చేకూర గలదు ఈ ధనము నాకున్నది ఇంకా ధనము రాగలదు.

శ్లో॥ అసౌ మయా హతశ్శత్రు ర్హనిష్యే చాపరా నపి.
ఈశ్వరోహ మహంభోగీ సిద్ధోహం బలవాన్ సుఖీ. 14

ఈ శత్రువును చంపితిని, మిగిలిన వారిని గూడా చంపుదును. నేను ప్రభుడను, భోగిని; పురుషార్థ సంపన్నుడను, బలవంతుడను, సుఖవంతుడను.

శ్లో॥ ఆఢ్యో భిజనవా నస్మి కో న్యోస్తి సదృశో మయా,
యక్ష్యే దాస్యామి మోదిష్య ఇత్యజ్ఞాన విమోహితాః. 15

నేను ధనవంతుడను, సత్కుల జాతుడను నాకు సమునెవ్వడు. యజ్ఞము నొనర్తును. దాన మిచ్చెదను ఆనందింతును అని అవివేక మోహితులై.

శ్లో॥ అనేక చిత్త విభ్రాంతా మోహజాల సమావృతాః.
ప్రసక్తాః కామభోగేషు పతంతి నరకేఽశుచౌ. 16

పెక్కు సంకల్పములతో చిత్తము విక్షిప్తమునంద మోహజాలములు తగుల్కొని విషయ భోగముల యందాసక్తులై అపవిత్రములగు నరకముల బడుచున్నారు,

శ్లో॥ ఆత్మసంభావితాః స్తబ్ధా ధనమానమదాన్వితాః,
యజంతే నామ యజ్ఞైస్తే దంభేనా విధిపూర్వకమ్. 17

వారు ఆత్మశ్లాఘులై తమ గొప్పతనము తామే చెప్పుకొనుచు ఐశ్వర్య మద గర్వమునందుచు డంబముతో శాస్త్రవిధి నుల్లంఘించుచు. పేరునకు మాత్రమే యగు యజ్ఞముల నొనర్చుచున్నారు.

శ్లో॥ అహంకారం బలందర్పం కామంక్రోధం చసంశ్రితాః,
మామాత్మ పరదేహేషు ప్రద్విషంతో భ్యసూయకాః. 18

వారు సర్వానర్థములకును సర్వదోషములకును మూలమగు అహంకారమును, పరపీడాకారమగు బలమును, ధర్మోల్లంఘనకారణమగు దర్పమును, స్త్రీ విషయమగు కామమును ఆశ్రయించి తమ యొక్కయు ఇతరుల యొక్కయు, శరీరముల బుద్ధికిని, కర్మలకును సాక్షినై వెలయుచున్న నన్ను (ఆత్మను) ద్వేషించుచున్నారు. నా శాసనము నతిక్రమించుచున్నారు, మరియు సన్మార్గ వర్తనులగు వారి గుణముల నిందించుచున్నారు.

శ్లో॥ తానహం ద్విషతః క్రూరాన్ సంసారేషు నరాధమాన్,
క్షిపామ్యజస్ర మశుభా నాసురీష్వేవ యోనిషు 19

విద్వేషులును, క్రూరులును, కుకర్ములును అగువారికి మరల మరల అసుర జన్మలనే కలుగజేయుచున్నాడను.

శ్లో॥ ఆసురీం యోని మాపన్నా మూఢా జన్మని జన్మని,
మా మప్రాప్యైవ కౌంతేయ తతో యాంత్యధమాంగతిమ్.

అర్జునా! ఇట్టి మూఢులు ప్రతి జన్మమున అసుర శరీరమునే పొందుచు నన్ను పొందక సన్మార్గ విముఖులై క్రమముగా అధోగతిని, క్రిమి కీటాది జన్మములను బొందుచున్నారు.

శ్లో॥ త్రివిధం నరకస్యేదం ద్వారం నాశన మాత్మనః,
కామః క్రోధ స్తథా లోభ స్తస్మాదేతత్త్రయంత్యజేత్.

కామ క్రోధ లోభములు మూడును నరక ద్వారములు. ఇవి ఆత్మను అధోగతి నందజేయుచున్నవి ఆత్మ వినాశకరములగు ఈ ద్వారముల ప్రవేశించిన మనుష్యుడు పురుషార్థమున కయోగ్యుడగును కనుక ఈ మూడింటిని త్యజించుట వుచితము.

శ్లో॥ ఏతైర్విముక్తః కౌంతేయ తమోద్వారై స్త్రిభిర్నరః
ఆచరత్యాత్మనశ్శ్రేయస్తతో యాతి పరాంగతిమ్. 22

కౌంతేయా. యీ ద్వారములనుండి వెలువడిన మనుజుడు. శ్రేయ కల్యాణ సాధనములను ఆచరించి తత్ఫలముగ మోక్షమును బడయుచున్నాడు.

శ్లో॥ యశ్శాస్త్రవిధిముత్సృజ్య వర్తతే కామకారతః,
నస సిద్ధి మవాప్నోతి నసుఖం నపరాం గతిమ్ 23

ఎవడు వేద విహిత ధర్మమునకు విధి నిషేధములను పాలింపక యథేచ్ఛగ ప్రవర్తిల్లునో అతడు తత్వజ్ఞానమునుగాని, శాంతిని గాని మోక్షమునుగాని బొందడు.

శ్లో॥ తస్మాచ్ఛాస్త్రం ప్రమాణంతే కార్యాకార్యవ్యవస్థితౌ,
జ్ఞాత్వాశాస్త్ర విధానోక్తం కర్మ కర్తు మిహార్హసి, 24

కనుక కర్తవ్యాకర్తవ్య విషయ నిర్ధారణమొనర్ప నీకు శాస్త్ర మొక్కటియే వుపదేష్ట. స్వకల్పనలు కావు అందువలన శాస్త్రీయ మగు విధి నిషేధముల స్వరూపమును నీ అంతఃకరణము నందు నిర్ణయించి కర్మాధికారివి యగు నీవు యథాధికారము కర్మము నొనర్పవగుదువు. అనగా కర్మము నొనర్ప యోగ్యుడవగుదువు.

సంపూర్ణము.

అస్పర్శయోగము అనే
శ్రీ మద్భగవద్గీత
రాజయోగీయము
సప్తదశాధ్యాయము
శ్రద్ధాత్రయ విభాగయోగము

అర్జున ఉవాచ :

శ్లో॥ యేశాస్త్రవిధిముత్సృజ్య యజంతే శ్రద్ధయాన్వితాః,
తేషాంనిష్ఠాతు కాకృష్ణ సత్త్వమాహో రజస్తమః 1

అర్జునుడు ప్రశ్నించెను. కృష్ణా ఆత్మ వినా అర్చించదగినది యేదియు లేదని శ్రుతి స్మృతులయందు నిర్ణయించియుండగ ఆవిధానమును పరిత్యజించి శ్రద్ధాయుక్తులై దేవతలను అర్చించుచున్నారో వారి నిష్ఠ యెట్టిది. సాత్వికమా. రాజసికమా, తామసికమా.

శ్లో॥ త్రివిధా భవతి శ్రద్ధా దేహినాం సాస్వభావజా,
సాత్త్వికీ రాజసీ చైవ తామసీ చేతితాం శృణు. 2

శ్రీ కృష్ణుడు పల్కెను మనుష్యులకు సత్వగుణ ప్రధానము రజోగుణ ప్రధానము, తమోగుణ ప్రధానమును అని మూడు విధములుగ శ్రద్ధ కలుగుచున్నది. ఆ శ్రద్ధ పూర్వ జన్మమునందలి ధర్మ సంస్కారము ననుసరించి వుత్పన్నమగును. దానిని గురించి వినుము.

శ్లో॥ సత్త్వానురూపా సర్వస్య శ్రద్ధా భవతి భారత,
శ్రద్ధామయోऽయం పురుషో యోయచ్ఛ్రద్ధస్సఏవసః 3

అర్జునా మనుష్యులందరికిని వారివారి అంతఃకరణ సంస్కారమునను సరించియే శ్రద్ధ కలుగుచున్నది. మనుష్యుడు శ్రద్ధామయుడు పూర్వ జన్మమున యెవనికెట్టి శ్రద్ధయుండెనో అతడు వర్తమాన జన్మమున అట్టి స్వభావమునే పరిగ్రహించుచున్నాడు.

శ్లో॥ యజంతే సాత్త్వికా దేవాన్ యక్షరక్షాంసి రాజసాః,
ప్రేతాన్ భూతగణాంశ్చాన్యే యజంతే తామసా జనాః. 4

సాత్త్వికులు దేవతలను పూజించుచున్నారు. రాజసికులు యక్షులను రాక్షసులను పూజించుచున్నారు. తామసికులు ప్రేతములను భూతములను పూజించుచున్నారు.

శ్లో॥ అశాస్త్ర విహితం ఘోరం తప్యంతే యే తపో జనాః,
దంభాహంకారసంయుక్తాః కామరాగ బలాన్వితాః 5

శ్లో॥ కర్శయంతశ్శరీరస్థం భూతగ్రామమచేతసః,
మాంచైవాంతశ్శరీరస్థం తాన్ విద్ధ్యాసుర నిశ్చయాన్. 6

దంభాహంకార యుక్తులును కామరాగ బలాన్వితులును అవివేకులగు జనులు శరీరమునందలి యింద్రియ సమూహమును. బుద్ధికి సాక్షియగు నన్ను కష్టపెట్టుచు, శాస్త్ర విరుద్ధమగు తపస్సును, తమకును ఇతరులకును గూడ పీడాకరముల కర్మపద్ధతులు వుపవాసాదులు నొనర్చుచున్నారు. వారిని అసుర స్వభావులని తెలిసికొనుము.

శ్లో॥ ఆహారస్త్వపి సర్వస్య త్రివిధో భవతి ప్రియః
యజ్ఞస్తపస్తథా దానం తేషాం భేదమిమం శృణు. 7

యీ త్రివిధ జనులకు ఆహారము కూడ సత్త్వాది గుణభేదము ననుసరించి మూడు విధములగునది ప్రియమగుచున్నది. అట్లే యజ్ఞ దాన తపములు గూడ మూడు విధములగుచున్నవి. వాని ప్రభేదమును వినుము.

శ్లో॥ ఆయుస్సత్త్వబలారోగ్య సుఖ ప్రీతివివర్ధనాః,
రస్యాః స్నిగ్ధాః స్థిరా హృద్యా ఆహారాస్సాత్త్వికప్రియాః. 8

ఆయువును, వుత్సాహమును, శక్తిని, ఆరోగ్యమును, చిత్త ప్రసాదమును, సంతోషమును, విశేషముగ వృద్ధినందించునవియును

రసవంతములును, స్నేహయుక్తములును, పుష్టికరములును, మనోహరములును, అగు భక్ష్యభోజ్యములు సాత్త్వికులకు ఇష్టములు.

శ్లో॥ కట్వామ్లలవణాత్యుష్ణ తీక్ష్ణరూక్షవిదాహినః,
ఆహారా రాజసస్యేష్టా దుఃఖశోకామయప్రదాః. 9

మిక్కిలి చేదు, పులుపు, ఉప్పు, వేడి, కారములుగ నుండునవియును, నోరు మంటబెట్టునవియును అగు ఆహారములు రాజసులకు ప్రియములుగా నున్నవి. ఇవి రోగ, శోక, దుఃఖముల నొసగుచున్నవి.

శ్లో॥ యాతయామం గతరసం పూతిపర్యుషితంచయత్,
ఉచ్ఛిష్ట మపిచామేధ్యం భోజనం తామసప్రియమ్. 10

ఏ ఆహారము. మందపక్వము, శుష్కమును, దుర్గంధమయమును, చద్దియును, ఇతరులు తినగా మిగిలినదియును. నిషిద్ధమునగు ఆహారము తామసులకు ప్రియము.

శ్లో॥ అఫలాకాంక్షిభి ర్యజ్ఞో విధిదృష్టో య ఇజ్యతే,
యష్టవ్య మేవేతిమన స్సమాధాయ స సాత్త్వికః. 11

ఫలాపేక్ష రహితులగు పురుషులు యజ్ఞానుష్ఠానమే కర్తవ్యము అని నిశ్చయించుకొని వారాచరించు శాస్త్రవిధి సమ్మతమగుయజ్ఞమే సాత్త్వికము అనబడుచున్నది.

శ్లో॥ అభిసంధాయ తు ఫలం దంభార్థమపిచైవయత్,
ఇజ్యతే భరతశ్రేష్ఠ తంయజ్ఞం విద్ధి రాజసమ్. 12

అర్జునా! ఫలాకాంక్షతోడను. తన మహాత్మ్యమును ప్రకటించుకొనుటకు ఒనర్పబడు యజ్ఞము. రాజసమని గ్రహింపుము.

శ్లో॥ విధిహీన మసృష్టాన్నం మంత్రహీనమదక్షిణమ్,
శ్రద్ధావిరహితం యజ్ఞం తామసం పరిచక్షతే. 13

శాస్త్రవిధి, అన్నదానము, మంత్రము, దక్షిణశ్రద్ధ ఇవి లేని

యజ్ఞమును తామస యజ్ఞమని చెప్పుచున్నారు.

శ్లో॥ దేవద్విజగురుప్రాజ్ఞపూజనం శౌచ మార్జవమ్
బ్రహ్మచర్య మహింసా చ శరీరం తప ఉచ్యతే 14

దేవతలను, బ్రాహ్మణులను, గురువులను తత్త్వవేత్తలను పూజించుట మరియు శుచిత్వము సత్ప్రవర్తనము బ్రహ్మచర్యము అహింస అనునవి శరీరముతో నొనర్చబడు తపస్సులు అని చెప్పెదరు.

శ్లో॥ అనుద్వేగకరం వాక్యం సత్యం ప్రియహితంచ యత్
స్వాధ్యాయాభ్యసనం చైవ వాఙ్మయం తప ఉచ్యతే 15

ఏ వాక్యము ప్రాణులకు దుఃఖమును కలిగింపనిదియో యథార్థమో, ప్రియకరమో అదియును మరియు శాస్త్రాభ్యాసమును వాచికమగు తపస్సని చెప్పబడును.

శ్లో॥ మనఃప్రసాదః సౌమ్యత్వం మౌనమాత్మవినిగ్రహః,
భావసంశుద్ధిరిత్యేత త్తపో మానస ముచ్యతే. 16

ప్రశాంతి, సౌమ్యభావము, మనఃసంయమము, మనోనిరోధము అంతఃకరణశుద్ధి అనునవి మనస్సుతో నిర్వర్తింపదగిన తపస్సని యందురు.

శ్లో॥ శ్రద్ధయా పరయా తప్తం తపస్తత్త్రివిధం నరైః
అఫలాకాంక్షిభిర్యుక్తైస్సాత్త్వికం పరిచక్షతే 17

ఫలాకాంక్షా రహితులును ఏకాగ్రచిత్తులును అగు వారు విశేషమగు శ్రద్ధను బూని పూర్వోక్తమగు వాఙ్మనఃకాయ సంబంధమగు తపస్సును ఆచరించిన అది సాత్త్వికమనబడుచున్నది.

శ్లో॥ సత్కారమానపూజార్థం తపోదంభేనచైవయత్
క్రియతేతదిహప్రోక్తం రాజసం చల మధ్రువమ్ 18

ఇతరులచే ఇతడు తపస్వి సాధువు అని ప్రశంసింపబడుటకును

నమస్కారాదులను బొందుటకును ధనాధికమును బడయుటకుగాను డంభముతో ననుష్ఠింపబడు తపస్సును రాజసికమందురు. ఇది అని త్యము క్షణికము.

శ్లో॥ మూఢగ్రాహేణాత్మనో యత్పీడయా క్రియతే తపః
పరస్యోత్సాదనార్థంవా తత్తామస ముదాహృతమ్ 19

మూర్ఖమగు పట్టుదలతో తనకు పీడను కలిగించుకొనుటచేతనో లేక ఇతరుల వినాశమునకో యే తపస్సు యొనర్పబడుచున్నదో అది తామసికమని చెప్పుదురు.

శ్లో॥ దాతవ్య మితి యద్దానందీయతేఽనుపకారిణే
దేశే కాలేచ పాత్రేచ తద్దానం సాత్త్వికం స్మృతం॥ 20

దాన మొనర్చుట కర్తవ్యము అను భావముతో ప్రత్యుపకార మునాశింపక విద్యా తపస్సంపన్నులగు వారికి అర్పింపబడు దానమును సాత్త్విక మందురు.

శ్లో॥ యత్తు ప్రత్యుపకారార్థం ఫలముద్దిశ్యవాపునః
దీయతేచ పరిక్లిష్టం తద్దానంరాజసంస్మృతమ్ 21

ప్రత్యుపకారమునాశించియో అముష్మికఫలమునభిలషించియో లేక అనిచ్ఛాపూర్వకముగనో ఇయ్యబడు దానము రాజసికమందురు.

శ్లో॥ అదేశకాలే యద్దాన మపాత్రేభ్యశ్చ దీయతే,
అసత్కృతమవజ్ఞాతం తత్తామసముదాహృతమ్ 22

అపవిత్రస్థానముల అశౌచాది స్థితులలో అయోగ్యులగు విట నటాదులకు పాద ప్రక్షాళన ప్రియవచనాది సత్కారముల నొనర్పక తిరస్కార భావముతో నొనర్పబడు దానమును తామసికమందురు.

శ్లో॥ ఓంతత్సదితినిర్దేశో బ్రహ్మణస్త్రివిధః స్మృతః
బ్రాహ్మణాస్తేన వేదాశ్చయజ్ఞావిహితాః పురా. 23

ఓం తత్ సత్ అని బ్రహ్మమునకు మూడు విధములగు నామములు చెప్పబడినవి దీనివలన బ్రాహ్మణులును, వేదములును, యజ్ఞములును ప్రాచీనకాలమున నిర్మింపబడినవి.

శ్లో॥ తస్మాదోమిత్యుదాహృత్య యజ్ఞదానతపఃక్రియాః,
ప్రవర్తంతే విధానోక్తాస్సతతం బ్రహ్మవాదినామ్ 24

అందువలన ఓం అని వుచ్చరించి వేదవాదుల శాస్త్ర విహితములగు యజ్ఞ, దాన, తపః క్రియలు యెల్లప్పుడును అనుష్ఠింపబడుచున్నవి.

శ్లో॥ తదిత్యనభిసంధాయ ఫలం యజ్ఞతపఃక్రియాః,
దానక్రియాశ్చవివిధాః క్రియంతే మోక్షకాంక్షిభిః 25

తత్ అను బ్రహ్మవాచకము నుచ్చరించి ముముక్షువులు నిష్కాములై, యజ్ఞ, దాన, తపః క్రియల నొనర్చుచున్నారు.

శ్లో॥ సద్భావేసాధుభావేచసదిత్యేతత్ప్రయుజ్యతే,
ప్రశస్తే కర్మణితథా సచ్ఛబ్దః పార్థయుజ్యతే. 26

అర్జునా! సత్తు అను అర్థమునను మంచిది అను అర్థమునను సత్ అనునది ప్రయోగింపబడుచున్నది మరియు శుభమగు కర్మమునకూడ సత్ అను శబ్దము వాడబడుచున్నది.

శ్లో॥ యజ్ఞేతపసి దానే చ స్థితి స్సదతి చోచ్యతే.
కర్మ చైవ తదర్థీయం సదిత్యేవాభిధీయతే. 27

యజ్ఞము, తపము, దానము, యీ మూడింటికిని సంబంధించిన నిష్ఠకూడ సత్‌శబ్దము తోడనే చెప్పబడుచున్నది భగవత్ప్రీతి నిమిత్తమగు కర్మము గూడ సత్‌శబ్దము తోనే చెప్పబడుచున్నది.

శ్లో॥ అశ్రద్ధయాహుతందత్తం తపస్తప్తంకృతంచయత్.
అసదిత్యుచ్యతే పార్థ నచ తత్ప్రేత్యనో ఇహ. 28

బ్రహ్మము యొక్క నిర్ణయ పద్ధతి తెలియక. అశ్రద్ధతో అనుష్ఠితమైన యజ్ఞము యొసగబడిన దానము చేయబడిన తపస్సు, మరియు ఇంక నెయ్యది యొనర్పబడినదో, అది అంతయును. అసత్తు అని చెప్పబడుచున్నది, అర్జునా! అవి వైగుణ్యమగుటవలన పరలోకమున గాని అయశస్కరములగుటవలన ఇహలోకమునను గూడ నిష్ఫలము లగుచున్నవి.

17 వ అధ్యాయము, సమాప్తము

అస్పర్శయోగము అనే

శ్రీ మద్భగవద్గీత

రాజయోగీయము

అష్టాదశాధ్యాయము

మోక్ష సన్న్యాస యోగము

అర్జున ఉవాచ :

శ్లో॥ సన్న్యాసస్య మహాబాహో తత్త్వ మిచ్ఛామి వేదితుమ్.

త్యాగస్య చ హృషీకేశ పృథక్కేశినిషూదన. 1

అర్జునుడు పల్కెను. శ్రీ కృష్ణా. హృషీకేశా, కేశినాశకా. సన్న్యాసము యొక్కయు. త్యాగము యొక్కయు తత్త్వమును వేరు వేరుగా తెలిసికొన గోరుచున్నాను.

శ్రీ భగవా నువాచ :

శ్లో॥ కామ్యానాం కర్మణాం న్యాసం సన్న్యాసం కవయోవిదుః

సర్వకర్మఫలత్యాగం ప్రాహు స్త్యాగం విచక్షణాః 2

శ్రీ భగవానుడు పల్కెను. స్వర్గాది ఫలముల కొరకు కామ్య కర్మముల పరిత్యాగమును పండితులు సన్న్యాసమందురు. అనుష్ఠేయములగు నిత్యనైమిత్తికములగు సమస్త కర్మముల ఫలత్యాగమును జ్ఞానులు త్యాగమందురు.

శ్లో॥ త్యాజ్యం దోషవదిత్యేకేకర్మప్రాహుర్మనీషిణః,

యజ్ఞ దానతపఃకర్మ నత్యాజ్య మితి చాపరే. 3

కొందరు పండితులగు సాంఖ్యవాదులు కర్మము బంధకారణము కనుక త్యజింపదగినది అందురు. మరికొందరు మీమాంసకులు యజ్ఞ దాన తపో రూపములగు కర్మములు త్యజింపకూడదు అందురు.

శ్లో॥ నిశ్చయం శృణు మే తత్ర త్యాగే భరతసత్తమ,
త్యాగో హి పురుషవ్యాఘ్ర త్రివిధః సంప్రకీర్తితః 4

భరతశ్రేష్ఠా యీ త్యాగ విషయమున నా సిద్ధాంతమును వినుము. పురుషప్రవరా త్యాగమే సత్త్వాది గుణభేదముచే మూఁడు విధములని చెప్పబడినది.

శ్లో॥ యజ్ఞదానతపఃకర్మ న త్యాజ్యం కార్యమేవ తత్,
యజ్ఞో దానం తపశ్చైవ పావనాని మనీషిణామ్ 5

యజ్ఞ, దాన తపోరూపమగు కర్మమును త్యజింపఁగూడదు. దాని నొనర్చుటయే కర్తవ్యము. యజ్ఞము, దానము తపస్సునుగూడ ఫలాభిసక్తి లేని బుద్ధిమంతులకు అంతఃకరణ శుద్ధికరములు.

శ్లో॥ ఏతాన్యపి తు కర్మాణి సంగం త్యక్త్వా ఫలాని చ,
కర్తవ్యానీతి మే పార్థ నిశ్చితం మతముత్తమమ్ 6

అర్జునా! కాని ఈ కర్మములే కర్తృత్వరహితముగ ఫలములను త్యజించి చేయదగినవి అని నా స్థిర మొనర్పబడిన శ్రేష్ఠమగు అభిప్రాయము.

శ్లో॥ నియతస్య తు సన్న్యాసః కర్మణో నోపపద్యతే,
మోహాత్తస్య పరిత్యాగ స్తామసః పరికీర్తితః 7

కాని నిత్య కర్మముల త్యాగము యుక్తియుక్తము కాదు. అవివేకము వలన యాకర్మలను త్యజించుట తామసము అనబడుచున్నది.

శ్లో॥ దుఃఖమిత్యేవ యత్కర్మ కాయక్లేశభయాత్త్యజేత్,
స కృత్వా రాజసం త్యాగం నైవ త్యాగఫలం లభేత్ 8

యెవఁడు కర్మమును కష్టప్రదమని తలచి శరీరము నొచ్చుననే భీతితో త్యజించునో, అతఁడు రాజసమగు త్యాగమును చేసి మోక్షమును పొందనేపొందఁడు.

శ్లో॥ కార్యమిత్యేవ యత్కర్మ నియతం క్రియతేఽర్జున!
సఙ్గం త్యక్త్వా ఫలం చైవ స త్యాగస్సాత్త్వికో మతః. 9

అర్జునా! కర్తృత్వమును ఫలమును గూడ త్యజించి కర్తవ్యము అని యే నిత్యకర్మము అనుష్ఠింపబడుచున్నదో ఆ కర్తృత్వ ఫలముల త్యాగమే సాత్త్వికమని నిశ్చయము.

శ్లో॥ న ద్వేష్ట్యకుశలం కర్మ కుశలే నానుషజ్జతే,
త్యాగీ సత్త్వసమావిష్టో మేధావీ ఛిన్నసంశయః. 10

కర్తృత్వమును ఫలమును త్యజించి నిష్కామ కర్మానుష్ఠానమొనర్చు వ్యక్తి, ఆత్మ జ్ఞానియును సత్వగుణయుక్తుడై అవిద్యా కృతములగు సంశయములన్నిటినుండియు ముక్తుడైనప్పుడు కామ్య కర్మములను సంసార కారణమని ద్వేషింపడు. మోక్షకారణములని నిత్యకర్మముల ప్రీతిగొనడు పూర్ణనిష్టయందుండును. ఇదియే పూర్వోక్తమగు కర్తృత్వరహిత కర్మయోగఫలము అనగా తామరాకు మీది నీటిబిందువు వలె వుండును. అర్జునా! కర్తృత్వ రహితకర్మ త్యాగము వలన కలుగు జ్ఞాననిష్ఠయు ఫలమును తెలిసికున్నావా.

శ్లో॥ న హి దేహభృతా శక్యంత్యక్తుం కర్మాణ్యశేషతః,
యస్తు కర్మఫలత్యాగీ స త్యాగీత్యభిధీయతే 11

గుర్తెరిగే దేహాభిమానులకు సంపూర్ణముగ కర్మములను త్యజింప సాధ్యముకాదు. కనుక కర్తృత్వరహిత కర్మఫల త్యాగియో. అతడు త్యాగి యని చెప్పబడును.

శ్లో॥ అనిష్ట మిష్టం మిశ్రం చ త్రివిధం కర్మణః ఫలమ్,
భవత్యత్యాగినాం ప్రేత్యన తు సన్న్యాసినాం క్వచిత్. 12

ధర్మాధర్మ రూపములగు కర్మములకు ఫలముగ మరణానంతరమున పశ్వాదియోనుల జన్మము. దేవాదియోనుల జన్మము. మనుష్య

జన్మము అను మూడు విధములుగ కలుగుచున్నది. కాని కర్తృత్వ రహిత కర్మాచరణపరులకు యే జన్మ మెన్నడును కలుగదు.

శ్లో॥ పఞ్చైతాని మహాబాహో! కారణాని నిబోధ మే
సాంఖ్యే కృతాన్తే ప్రోక్తాని సిద్ధయే సర్వకర్మణామ్. 13

అర్జునా! కర్మ కాండాంతమగు వేదాంతమున, సమస్త కర్మములను సంపాదింప చెప్పబడిన యీ ఐదు కారణములు నిరూపింపబడినవి వానిని నా వలన వినుము.

శ్లో॥ అధిష్ఠానం తథా కర్తా కరణం చ పృథగ్విధమ్,
వివిధాశ్చ పృథక్చేష్టా దైవం చైవాత్ర పఞ్చమమ్. 14

1. శరీరము, 2. అహంకారము 3. మనోబుద్ధులతో గూడిన ఇంద్రియములు 4. ప్రాణాదుల వివిధ కార్యములు 5. కూటస్థుడగు దైవము అను నీ యైదును సమస్త కర్మములకును కారణములు.

శ్లో॥ శరీరవాఙ్మనోభిర్యత్కర్మ ప్రారభతే నరః,
న్యాయ్యం వా విపరీతం వా పఞ్చైతే తస్య హేతవః. 15

త్రికరణములతో మనుష్యుడారంభించెడి ధర్మాధర్మ కర్మములన్నిటికి హేతువు లీయైదును అని గ్రహింపుము.

శ్లో॥ తత్రైవం సతి కర్తార మాత్మానం కేవలం తు యః,
పశ్యత్యకృతబుద్ధిత్వాన్న స పశ్యతి దుర్మతిః. 16

ఇట్లు కర్మములన్నియును ఈ ఐదు హేతువులచే జర్గుచుండ అసంగుడగు పరిపూర్ణ ఆత్మను కర్మగా తలచు దుర్మతి సమ్యగదర్శి కాడు. అతని బుద్ధి శాస్త్రాచార్యోపదేశము వలన సంస్కరింపబడలేదు. ఆతడు అవివేకము వలననే ఇట్లు చూచుచున్నాడు.

శ్లో॥ యస్య నాహంకృతో భావో బుద్ధిర్యస్య న లిప్యతే,
హత్వాఽపి స ఇమాన్లోకాన్న హన్తి న నిబధ్యతే. 17

యెవనికి నేను కర్మను అను అభిమానము లేదో. యెవని బుద్ధి కర్మలయందు వాటి ఫలములయందు నిస్సంగమో అతడు ఈ జగత్తు నందలి ప్రాణుల నందరిని వధించినను వధింపనట్లే. అనగా వధించుట లేదు మరియు ఆతడు హత్యాఫలమున అధర్మమున బద్ధుడు కాడు. యెందుకనగా సృష్టికి కారణమైన పరమాత్మ నాచేత గొప్ప బ్రహ్మాండము సృష్టింపబడి సకల లోకంబులు లోకేషులు లోకస్తులు సర్వవిధముల సంతోషములు పొందుచున్నారు. అని తాను ఆనందించడు. జల ప్రళయము జరిగి సర్వజీవులు సర్వలోకంబులు నశించినను ఆ కర్మ ఆత్మా ఫలమగు అధర్మమున బద్ధుడుకాడు. అనే పద్ధతిగా ఆ పరమాత్మగా సృష్టింపనైన మానవుడు తన అహంవృత్తి యను (నేను కర్తను) అభిమానము విడిచి త్రివర్ణములను పరమాత్మ పద్ధతిగా యే కర్మలు ఆచరించినను నతడు ధర్మాధర్మమునకు బద్ధుడుకాడు. పాప పుణ్యములు అతన్ని అంటవు.

శ్లో॥ జ్ఞానం జ్ఞేయం పరిజ్ఞాతా త్రివిధా కర్మచోదనా,
కరణం కర్మ కర్తేతి త్రివిధః కర్మసంగ్రహః. 18

జ్ఞానము జ్ఞేయము జ్ఞాత అని మూడు విధములగు కర్మప్రవర్తకములు జ్ఞానమనగా యిష్ట సాధన విషయము జ్ఞేయమనగా ఇష్ట సాధనకు సంబంధించిన కర్మము. జ్ఞాత అనగా తెలియువాడు.

శ్లో॥ జ్ఞానం కర్మ చ కర్తా చ త్రిధైవ గుణభేదతః,
ప్రోచ్యతే గుణసంఖ్యానే యథావచ్ఛృణు తాన్యపి. 19

సాంఖ్య శాస్త్రమున జ్ఞానమును క్రియలును ఫలములను గూడ సాత్వికాదిగుణ భేదములచే మూడు రీతులుగనే చెప్పబడుచున్నది. వాని నన్నిటిని గూడ నిస్సందేహముగ వినుము.

శ్లో॥ సర్వభూతేషు యేనైకం భావమవ్యయమీక్షతే,
అవిభక్తం విభక్తేషు తజ్జ్ఞానం విద్ధి సాత్త్వికమ్. 20

ఏ జ్ఞానము వలన విభిన్నములగు సమస్త ప్రాణులయందున అభిన్న భావమున వెలయుచున్న అద్వితీయమును అక్షయమునగు ఆత్మ వస్తువును మనుష్యుడు దర్శించుచున్నాడో ఆ జ్ఞానము సాత్త్వికమని గ్రహింపుము.

శ్లో॥ పృథక్త్వేన తు యజ్జ్ఞానం నానాభావాన్పృథగ్విధాన్,
వేత్తి సర్వేషు భూతేషు తజ్జ్ఞానం విద్ధి రాజసమ్. 21

కాని ఏ జ్ఞానము వలన సమస్త భూతములయందు వేరువేరుగ నుండు ఆత్మలను అనేకముల నిగ్రహించునో ఆ జ్ఞానము రాజసికమని గ్రహింపుము.

శ్లో॥ యత్తు కృత్స్నవదేకస్మిన్కార్యే సక్తమహైతుకమ్,
అతత్త్వార్థవదల్పం చ తత్తామస ముదాహృతమ్. 22

మరి ఏ జ్ఞానము వలన నొకానొక శరీరమున లేక ప్రతిమయందే సంపూర్ణమగు ఆత్మ లేక యీశ్వరుని వునికి వున్నట్లు నమ్మునో అది యుక్తియుక్తము కానిదియు ఆ యథార్థమును తుచ్ఛమును అగు జ్ఞానము తామసమని చెప్పబడును.

శ్లో॥ నియతం సఙ్గరహిత మరాగద్వేషతః కృతమ్,
అఫలప్రేప్సునాకర్మ యత్తత్సాత్త్విక ముచ్యతే. 23

ఫలకాంచలేని వ్యక్తి రాగద్వేషములను వర్జించి ఆసక్తి రహితుడై అనుష్ఠించు నిత్య కర్మాచరణమే సాత్త్విక కర్మమనబడును.

శ్లో॥ యత్తు కామేప్సునా కర్మ సాహంకారేణ వా పునః
క్రియతే బహులాయాసం తద్రాజస ముదాహృతమ్. 24

మరి ఫలకాంక్ష తోడనే లేక అహంకారముతోడనే అనుష్ఠిత మును బహుకష్ట సాధ్యమును అగు కర్మము రాజసికమనబడును.

శ్లో॥ అనుబంధంక్షయంహింసా మనపేక్ష్యచపౌరుషమ్,
మోహాదారభ్య తే కర్మతత్తామసముదాహృతమ్. 25

పర్యవసానములను శుభాశుభములను శక్తి క్షయమును పరపీడను స్వసామర్థ్యమును విచారింపక అవివేకముతో ఏ కర్మములు అనుష్ఠింప బడుచున్నవో అవి తామసికములు.

శ్లో॥ ముక్తసంగోనహంవాదీ ధృత్యుత్సాహసమన్వితః,
సిద్ధ్యసిద్ధ్యోర్నిర్వికారః కర్తాసాత్త్విక ఉచ్యతే. 26

అసాసక్తుడును. గర్వోక్తి రహితుడు ధైర్యోత్సాహ సమన్వితు డును లాభ నష్టముల హర్ష విషాదముల జెందనివాడును. అగు కర్త సాత్త్వికుడు.

శ్లో॥ రాగీకర్మఫలప్రేప్సు ర్లుబ్ధోహింసాత్మకోఽశుచిః,
హర్ష శోకాన్వితఃకర్తా రాజసఃపరికీర్తితః 27

వాసనాకుల చిత్తుడును, కర్మఫలాకాంక్షియును, పరద్రవ్యా సక్తుడును, స్వధనదానా సమర్థుడును. పరులను పీడించు స్వభావము కలవాడును. అపవిత్రుడును, యిష్ట ప్రాప్తియైన హర్షమును. అనిష్ట ప్రాప్తియైన శోకమును బొందెడి కర్త రాజసికుడు.

శ్లో॥ అయుక్తఃప్రాకృత స్స్తబ్ధశ్శఠో నైష్కృతికోఽలసః,
విషాదీ దీర్ఘసూత్రీచ కర్తాతామస ఉచ్యతే. 28

యేకాగ్రత లేనివాడును. బాలునివలె అత్యంతము అసంస్కృత మగు బుద్ధికలవాడును. (అవివేకి) వినయములేనివాడును. వంచకుడును స్వార్థపరుడై పరుల వ్యాపారమును పాడుచేయువాడును. (యితరుల నవమానించువాడు) వుత్సాహ రహితుడును, శోకించువాడును, నేడో

రేపో చేయదగిన పనిని వొక మాసములోనైనను చేయక కాలయాపన చేయువాడును. అగు కర్తను తామసికుడందురు.

శ్లో॥ బుద్ధేర్భేదంధృతేశ్చైవ గుణతస్త్రివిధంశృణు,
ప్రోచ్యమానమశేషేణ పృథక్త్వేన ధనంజయ 29

అర్జునా! సత్త్వరజస్తమోగుణముల ననుసరించి బుద్ధియును, ధృతియునుగూడ మూడు విధములుగనున్నవి. వీనిని గురించి వేరువేరుగ సంపూర్ణముగ నుడివెదను వినుము.

శ్లో॥ ప్రవృత్తించ నివృత్తించ కార్యాకార్యేభయాభయే,
బన్ధంమోక్షంచయోవేత్తి బుద్ధిస్సాపార్థ! సాత్త్వికీ. 30

అర్జునా! ప్రవృత్తి మార్గమును, నివృత్తిమార్గమును, కర్తవ్యాకర్తవ్యములను, భయమును, అభయమును, బంధమును మోక్షమును యేబుద్ధి గ్రహించునో ఆ బుద్ధి సాత్త్వికము.

శ్లో॥ యయా ధర్మమధర్మంచ కార్యంచాకార్యమేవచ,
అయథావత్ప్రజానాతి బుద్ధిస్సాపార్థ! రాజసీ. 31

అర్జునా! యే బుద్ధివలన శాస్త్రవిహితమగు కర్మమును శాస్త్ర విరుద్ధమగు కర్మమును కర్తవ్యమును అకర్తవ్యమును నిర్ణయింపబడి నట్లుగాక మరియొక రీతిగ తెలిసికొనునో ఆ బుద్ధి రాజసికము.

అధర్మం ధర్మమితియా మన్యతే తమసావృతా,
సర్వార్థాన్ విపరీతాంశ్చ బుద్ధిస్సా పార్థ! తామసీ. 32

పార్థా! యే బుద్ధి అధర్మమును ధర్మము అని యెంచునో జ్ఞేయ పదార్థముల నన్నిటిని విపరీతముగ గ్రహించునో ఆబుద్ధి తమోగుణము వలన ఆవరింపబడిన తామసికము.

ధృత్యాయయాధారయతే మనఃప్రాణేంద్రియక్రియాః,
యోగేనా వ్యభిచారిణ్యా ధృతిస్సా పార్థ సాత్త్వికీ. 33

పార్థా! యేకాగ్రచిత్తమున స్థిరమగు ధృతివలన మనస్సు ప్రాణము, ఇంద్రియముల క్రియలు, శాస్త్ర మార్గమున నియమింపబడు చున్నదో ఆ ధృతి సాత్త్వికము.

యయాతుధర్మకామార్థాన్ ధృత్యాధారయ తేర్జున,
ప్రసంగేన ఫలాకాంక్షీ ధృతిస్సా పార్థ రాజసీ. 34

పార్థా! మనుష్యుడే ధృతివలన ధర్మార్థకామము లనే ప్రధానముగ గ్రహించునో మరియు కర్తృత్వాదులు అభినివేశము ఫలము నాకాంక్షించునో అది రాజసికము.

యయాస్వప్నం భయంశోకం విషాదంమదమేవచ,
నవిముఞ్చతి దుర్మేధా ధృతిస్సా పార్థతామసీ. 35

అర్జునా! దుర్బుద్ధియగు వ్యక్తి యే ధృతివలన నిద్రను, భయమును, సంతాపమును, విషాదమును, విషయ సేవ వలన కలుగు మహత్తును పరిత్యజింపకుండునో ఆ ధృతి తామసికము.

సుఖం త్విదానీం త్రివిధం శృణుమే భరతర్షభ,
అభ్యాసా ద్రమతే యత్ర దుఃఖాన్తంచ నిగచ్ఛతి. 36
యత్తదగ్రేవిషమివ పరిణామేఽమృతోపమమ్,
తత్సుఖం సాత్త్వికం ప్రోక్త మాత్మబుద్ధి ప్రసాదజమ్ 37

అర్జునా! యే సుఖమున దీర్ఘాభ్యాసమువలన క్రమముగ మనుష్యుడు ప్రీతిని పరితృప్తిని పొందునో సంసారదుఃఖమునుండి విడివడునో మరియు యే సుఖము మొదట విషమువలె కష్టదాయకమో కాని తుదకు అమృత తుల్యమగునో, మరియు నెయ్యది ఆత్మనిష్ఠమగు బుద్ధి యొక్క పరాకాష్ఠ లేక నిర్మలతనుండి వుత్పన్నమగుచున్నదో అదియే సాత్త్విక సుఖ మనబడును.

విషయేన్ద్రియసంయోగాద్యత్తదగ్రేఽమృతోపమమ్,
పరిణామే విషమివ తత్సుఖం రాజసం స్మృతమ్. 38

విషయముల యొక్కయు యింద్రియముల యొక్కయు కూడికవలన యే సుఖము మొదట అనుభవించునప్పుడు అమృతమువలెను భోగాంతమున విష తుల్యముగను అగునో ఆ సుఖము రాజసికమని చెప్పబడును.

యదగ్రేచానుబన్ధేచ సుఖం మోహన మాత్మనః,
నిద్రాలస్యప్రమాదోత్థం తత్తామసముదాహృతమ్. 39

మరియు యే సుఖము మొదటను వెనుకను ఆత్మను మోహపరచునో నిద్ర సోమరితనము పొరపాటువలన కలుగుచున్నదో, అది తామసికమని చెప్పబడును.

న తదస్తి పృథివ్యాం వా దివిదేవేషు వా పునః,
సత్త్వం ప్రకృతిజైర్ముక్తం యదేభిస్స్యాత్త్రిభిర్గుణైః 40

భూలోకమునగాని, స్వర్గమునగాని లేక దేవతలయందు గాని యీ త్రిగుణ ప్రకృతిబంధన కారణములనుండి ముక్తినందిన ప్రాణిలేదు.

బ్రాహ్మణ క్షత్రియవిశాం శూద్రాణాంచ పరంతప!
కర్మాణి ప్రవిభక్తాని స్వభావప్రభవై ర్గుణైః 41

అర్జునా! బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య శూద్రులకు కర్మములు ప్రకృతిజాతీయములగు గుణముల వలన విభజింపబడినవి.

శమోదమస్తపశ్శౌచం క్షాన్తి రార్జవ మేవచ.
జ్ఞానం విజ్ఞాన మాస్తిక్యం బ్రాహ్మంకర్మ స్వభావజమ్

అంతరింద్రియ నిగ్రహము బహిరింద్రియ నిగ్రహము, తపస్సు బహిరంతర శౌచము క్షమ సరళత శాస్త్రజ్ఞానము, అనుభూతి శాస్త్రమునను భగవంతునియందును విశ్వాసము ఇవి స్వభావ జాతమగు బ్రాహ్మణ ధర్మములు.

శ్లో॥ శౌర్యం తేజోధృతిర్దాక్ష్యం యుద్ధేచాప్యపలాయనమ్,
దాన మీశ్వర భావశ్చ క్షాత్రం కర్మస్వభావజమ్, 43

పరాక్రమము తేజస్సు, ధృతి, కర్మకౌశలము యుద్ధమున పారిపోకుండుట ఔదార్యము శాసింపగల శక్తి. ఇవి క్షత్రియుని స్వాభావిక లక్షణములు.

శ్లో॥ కృషి గోరక్ష వాణిజ్యం వైశ్యంకర్మ స్వభావజమ్,
పరిచర్యాత్మకం కర్మ శూద్రస్యాపి స్వభావజమ్. 44

కృషి, గోరక్షణము, వాణిజ్యమును, వైశ్య స్వభావ కర్మలు, సేవా రూపమగు కర్మములు శూద్రులకు స్వభావజాతమైనవి.

శ్లో॥ స్వే స్వే కర్మణ్యభిరత స్సంసిద్ధిం లభతేనరః,
స్వకర్మనిరత స్సిద్ధిం యథా విన్దతి తచ్ఛృణు. 45

తనతన వర్ణనమునకును ఆశ్రమమునకును జెందిన కర్మమున నిరతుడగు మనుష్యుడు సిద్ధిని పొందును. అనగా కర్మఫల ప్రాప్తిని పొందును గాని తన మానవత్వ నిర్ణయమగు ఆత్మప్రాప్తిని పొందలేడు. తన ఆత్మ నిర్ణయ కర్మమున తత్పరుడగు వ్యక్తి యే రీతిగా స్థితిని పొందునో దానిని వినుము.

శ్లో॥ యతఃప్రవృత్తిర్భూతానాం యేనసర్వ మిదన్తతమ్,
స్వకర్మణాత మభ్యర్చ్య సిద్ధిం విన్దతి మానవః. 46

యెవని నుండి ప్రాణుల వుత్పత్తి కర్మ ప్రయత్నము జరుగుచున్నదో యెవ్వనిచే యీ జగత్తంతయు సువ్యాప్తమో ఆ పరమాత్మ నిర్మిత మనుష్యుడు ఆత్మ నిర్మిత స్వకర్మ ఆచరణవలన అసర్వాంతర్యామియగు పరమేశ్వరున్ని అర్చించి సిద్ధిని పొందును.

శ్లో॥ శ్రేయాన్ స్వధర్మోవిగుణః పరధర్మాత్స్వనుష్ఠితాత్,
స్వభావ నియతం కర్మ కుర్వ న్నాప్నోతి కిల్బిషమ్. 47

ఆత్మ నిర్ణయానుసారము ఆచరించు కర్మ అంగహీనముగ అనుష్ఠింపబడినను గుణ నిశ్రిత కర్మ పద్ధతులకన్న శ్రేష్టమే యగుచున్నది. అనగా బంధువధాది దోషములతో గూడినదే యైనను నీ ధర్మమగు యుద్ధము పరధర్మమగు భిక్షాటనకంటె శ్రేష్టమే యగుచున్నది.

శ్లో॥ సహజం కర్మ కౌన్తేయ సదోషమపి న త్యజేత్,
సర్వారమ్భాహి దోషేణ ధూమేనాగ్నిరివా వృతాః. 48

అర్జునా! దోషయుక్తమైనను సత్యాసత్యాన్వేషణముగల మానవోపాధియందు యుండు నీవు ఆత్మ నిశ్రితమగు స్వధర్మ నిష్ఠమగు కర్మము త్యజింప గూడదు. యెందుకనగా కర్మము లన్నియును. నిప్పు పొగచేత కప్పబడినట్లు గుణత్రియ దోషమువలన ఆవరింపబడియున్నవి.

శ్లో॥ అసక్తబుద్ధిస్సర్వత్ర జితాత్మా విగతస్పృహః,
నైష్కర్మ్యసిద్ధిం పరమాంసన్న్యాసేనాధిగచ్ఛతి. 49

అన్ని విషయములందును ఆసక్తి లేనివాడును సంయత చిత్తుడును భోగకాంక్ష లేనివాడును కర్తృత్వ రహిత కర్మాచరణగల వ్యక్తి సమ్యక్ దర్శనమగు నిష్క్రియమగు ఆత్మ స్వరూపమును బొందుట అను సిద్ధిని పొందును.

సిద్ధిం ప్రాప్తోయథా। బ్రహ్మ తథాప్నోతి నిబోధమే,
సమాసేనైవకౌన్తేయ! నిష్ఠాజ్ఞానస్య యా పరా. 50

అర్జునా! సిద్ధిని పొందిన వ్యక్తి యే రీతిగ బ్రహ్మమును పొందునో యేది జ్ఞానము యొక్క పరిసమాప్తియో ఆక్రమమును సంక్షేపముగ నా నుండి తెలిసికొనుము.

బుద్ధ్యావిశుద్ధయాయుక్తోధృత్యాత్మానంనియమ్యచ,
శబ్దాదీన్ విషయాంస్త్యక్త్వా రాగద్వేషౌవ్యుదస్యచ. 51

ఆత్మను బ్రహ్మమని నిశ్చయించుకొనుట వలన సంశయ విపర్యా యములు తొలగిన బుద్ధితో ధైర్యము నవలంబించి శరీరేంద్రియములను వశమొనర్చుకొని శరీరస్థితికి వ్యపయోగపడు విషయముల యొక్క ఆసక్తిదోషములు గూడ పరిత్యజించి.

వివిక్తసేవీ లఘ్వాశీ యతవాక్కాయమానసః,
ధ్యానయోగపరో నిత్యం వైరాగ్యం సముపాశ్రితః. 52

విషయరహిత అంతఃకరణ నివాసియును, మితముగ భుజించువాడు త్రికరణముల నేకరూపు నియమించి యెల్లప్పుడు ధ్యానయోగపరాయణుడై దృష్టాదృష్ట విషయ వైరాగ్యమును అవలంభించి.

అహఙ్కారం బలం దర్పం కామం క్రోధం పరిగ్రహమ్,
విముచ్య నిర్మమ శ్శాన్తో బ్రహ్మభూయాయ కల్పతే. 53

దేహేంద్రియముల యందాత్మ బుద్ధిని మొండిపట్టును యోగబల గర్వమును ప్రారబ్ధవశమున లభించు విషయములయందలి కోర్కెను కోపమును, పరిగ్రహమును వదలి శరీరమనినను జీవితమనినను అభిమానములేక చిత్తవిక్షేప రహితమగు శాంతిని బొందిన వ్యక్తి ఈ జీవితముననే బ్రహ్మజ్ఞానము బొందుటకు సమర్థుడగును.

బ్రహ్మభూతః ప్రసన్నాత్మా నశోచతి నకాఙ్క్షతి,
సమస్సర్వేషు భూతేషు మద్భక్తిం లభతే పరామ్. 54

బ్రహ్మజ్ఞాన నిష్ఠుడగు వ్యక్తి ఆత్మ ప్రసన్నతను బొంది ప్రాప్త వస్తు నాశనమైన శోకింపడు. అప్రాప్త వస్తువును కోరడు. సర్వభూతముల సుఖదుఃఖములను తనవిగా చూచు యతి జ్ఞాన లక్షణమును మత్సంబంధమును అగు పరాభక్తిని పొందును.

భక్త్యామా మభిజానాతి యావాన్ యశ్చాస్మి తత్త్వతః,
తతో మాం తత్త్వతో జ్ఞాత్వా విశతే తదనన్తరమ్. 55

యతి జ్ఞాన లక్షణమగు భక్తి వలన ఏయే వుపాధులవలన భేద వైశిష్ట్యములను సవిశేషరూపములను మరియు సర్వోపాధి శూన్యమును నిర్విశేషమును నేను అగుచుంటినో ఆరూపముల నన్ను యథార్థముగ ఆత్మరూపమున గ్రహించును. యీ సాక్షాత్కారము వలన నన్ను యదార్థ రూపమున తెలిసికొని వెనువెంటనే నాయందు ప్రవేశించును జీవిత కాలముననే నా అఖండరూపము పొందును. అనగా నా సర్వ వ్యాపిత్వము పొందును.

సర్వకర్మాణ్యపిసదా కుర్వాణో మద్వ్యపాశ్రయః,
మత్ప్రసాదాదవాప్నోతిశాశ్వతంపదమవ్యయమ్. 56

యెల్లపుడు ను సమస్త కర్మములను చేయుచున్నను నన్ను అను సరించిన భక్తుడు నా అనుగ్రహమున సనాతనమును అక్షయమునగు స్థానమును పొందును.

చేతసా సర్వకర్మాణి మయి సన్న్యస్య మత్పరః,
బుద్ధియోగముపాశ్రిత్య మచ్చిత్తస్సతతం భవ. 57

వివేక బుద్ధివలన ఐహికాముష్మిక విషయములగు కర్మముల నన్నిటిని కర్తృత్వరహితపద్ధతిగా నాయందు సమర్పించి నా యందా సక్తిని కల్గి బుద్ధిని యేకాగ్రి మొనర్చి యెల్లప్పుడు మద్గత చిత్తుడవు కమ్ము.

మచ్చిత్త స్సర్వదుర్గాణి మత్ప్రసాదాత్తరిష్యసి,
అథచేత్త్వమహఙ్కారాన్న శ్రోష్యసి వినఙ్క్ష్యసి. 58

మద్గత చిత్తుడవైనచో నా అనుగ్రహము వలన దుస్తరమగు జన్మ హేతువులను అన్నిటిని అతిక్రమింపగలవు. మరి నీవు పాండిత్యాభి మానమున నేను చెప్పినది విననియెడల పురుషార్థ భ్రష్టుడవగుదువు.

శ్లో॥ యద్యహంకార మాశ్రిత్య నయోత్స్యఇతి మన్యసే
మిథ్యైషవ్యవసాయస్తే ప్రకృతి స్త్వాం నియోక్ష్యతి 59

అహంకారము నాశ్రయించి యుద్ధమొనర్పను. అని నీవు తలచునది భ్రమమూలకము. నీ ప్రయత్నము వ్యర్థమే యగును. గుణత్రయ అభిమానము నిన్ను నియోగింపగలదు.

శ్లో॥ స్వభావజేన కౌంతేయ! నిబద్ధ స్స్వేన కర్మణా
కర్తుం నేచ్ఛసి యన్మోహా త్కరిష్య స్యవశోఽపితత్. 60

అర్జునా! అవివేకమున దేనిని చేయ నిచ్ఛగింపవో స్వభావజాతమగు నీ పూర్వ జన్మ కర్మమువలన బద్ధుడవై నీ యిష్టమునకు వ్యతిరేకముగనే దానినే చేయుదువు.

శ్లో॥ ఈశ్వర స్సర్వ భూతానాం హృద్దేశేఽర్జున తిష్ఠతి
భ్రామయన్ సర్వభూతాని యన్త్రారూఢాని మాయయా. 61

అర్జునా! అంతర్యామి యగు చేతన పురుషుడు సర్వజీవుల హృదయము నధిష్ఠించి యంత్రమున నున్న బొమ్మలవలె త్రిప్పుచు నియమించుచున్నాడు.

శ్లో॥ తమేవ శరణంగచ్ఛ సర్వభావేన భారత
తత్ప్రసాదా త్పరాం శాంతిం స్థానం ప్రాప్స్యసిశాశ్వతమ్. 62

అర్జునా! సర్వతో భావముగ ఆ పురుషునే శరణు బొందుము ఆయన కృపవలన పరమ శాంతిని శాశ్వత స్థానమును పొందగలవు.

శ్లో॥ ఇతితేజ్ఞాన మాఖ్యాతం గుహ్యాద్గుహ్యాంతరం మయా
విమృశ్యైత దశేషేణ యథేచ్ఛసి తథా కురు. 63

యీ రహస్యము కంటెను. అత్యంత రహస్యమగు గీతాజ్ఞానము నీకు నా వలన చెప్పబడినది. అనగా క్షరాక్షరుల నిర్భయ స్పర్శ పద్ధతిగా నేను వుంటున్న వుత్తమ పురుష పద్ధతిగా నిర్ణయముగా

తెలిపినాను. సంపూర్ణముగ దీనిని వివేచన మొనర్చి యెటులయెంతువో అటులనే చేయుము.

శ్లో॥ సర్వగుహ్యతమం భూయః శృణు! మే పరమం వచః
ఇష్టోఽసి మేదృఢమితి తతో వక్ష్యామి తే హితమ్. 64

పరమ రహస్యమగు నా శ్రేష్ఠమగు వాక్యమును మరలవినుము నాకు అత్యంతము ప్రియుడవు అగుదువు యీ కారణమున నీ హితమును అగు వుత్తమ పురుషప్రాప్తి వుపాయమును చెప్పుచున్నాను.

శ్లో॥ మన్మనాభవ మద్భక్తో మద్యాజీ మాంనమస్కురు
మామే వైష్యసి సత్యంతే ప్రతిజానే ప్రియోఽసిమే 65

నీ మనస్సును నాయందు నిల్పుము. నా భక్తుడవు కమ్ము నన్ను పూజింపుము, నాకు నమస్కరింపుము నీవు నాకు అత్యంత ప్రియుడవగుదువు. నన్నే పొందెదవు, నేను సత్యమును ప్రతిజ్ఞాపూర్వకముగా నుడువుచున్నాను.

సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ
అహంత్వా సర్వ పాపేభ్యో మోక్షయిష్యామి మాశుచః 66

నా నిర్ణయమునకు పూర్వము నిర్ణయింపబడియున్న ధర్మాధర్మముల నన్నింటిని త్యజించి వుత్తమ పురుషుడనగు నన్ను వొక్కనినే ఆత్మరూపమున ఆశ్రయింపుము నేను నిన్ను ధర్మాధర్మబంధన రూపములగు పుణ్యపాపములనుండి ముక్తి నందజేతును శోకింపకుము. అనగా క్షరాక్షర స్పర్శ దోషమగు కర్మజ్ఞాన భ్రాంతి దోషము వలన పుణ్యపాపజన్మ కర్మబంధములు తొలగగలవని నిర్ణయము.

ఇదంతే నాఽతపస్కాయ నాఽభక్తాయ కదాచన
నచాఽశుశ్రూష వేవాచ్యంనచమాం యోఽభ్యసూయతి. 67

యీ గీతాశాస్త్రమును తపోరహితునకు నీవు యెన్నటికిని చెప్ప కూడదు. మరియు భక్తుడుకాని వానికిని వినగోరని వానికిని యెవడు నన్ను మనుష్యునిగా తలచి ద్వేషించునో వానికిని చెప్పదగదు.

యఇదం పరమం గుహ్యాం మద్భక్తే ష్వభిధాస్యతి
భక్తిం మయిపరాం కృత్వా మామేవైష్య త్యసంశయః 68

యెవడు యథోక్తమగు పరమ రహస్యమగు గీతాశాస్త్రమును నా భక్తులకు వివరించి చెప్పునో అతడు నాయందు పరమభక్తిని చేసి సందేహ రహితుడై నన్నే పొందును.

నచ తస్మా న్మనుష్యేషు కశ్చిన్మేప్రియకృత్తమః
భవితా నచమే తస్మా దన్యః ప్రియతరో భువి 69

గీతోపదేశము నొనర్చువానికంటె నధిక ప్రియుడు నాకు ఈ జగత్తున లేడు. మరియు అతనికంటె ప్రియుడగువాడు యికముందు కూడా కలుగబోడు.

అధ్యేష్యతే చ య ఇమం ధర్మ్యం సంవాద మావయోః
జ్ఞానయజ్ఞేన తే నాఽహ మిష్ట స్స్యా మితి మే మతిః 70

మరియును యెవడు మన యిర్వురి ఈ ధర్మ విషయమగు సంవాదమును అధ్యయన మొనర్చునో వానిచే నేను జ్ఞాన యజ్ఞమువలన పూజితుడను అగుదును అని నా నిశ్చయము.

యజ్ఞము అనునది 1. విధి 2. జప 3. వుపాంశు 4. మానసములని నాల్గు విధములు.

1. విధి, యజ్ఞము, వేదములు విధించు యజ్ఞకర్మలు
2. జప యజ్ఞము. యితరులకు వినబడునట్లొనర్పబడు మంత్రోచ్చారణము.
3. వుపాంశు. కేవలము స్వశ్రవణగోచరమగునది

4. మానసము జ్ఞానయజ్ఞము గనుక అన్నిటిలో యిది శ్రేష్ఠము

శ్రద్ధావా ననసూయశ్చ శృణుయాదపి యోనరః
సోపి ముక్త శ్శుభాన్ లోకాన్ ప్రాప్నుయాత్పుణ్య కర్మణామ్.

శ్రద్ధాయుక్తుడును అసూయా రహితుడును యే మనుష్యుడు అర్థ జ్ఞానము లేకపోయినను కేవలము వినునో అతడు కూడా ముక్తుడై అగ్నిహోత్రాది పుణ్యకర్మల నొనర్చువారి పుణ్యలోకములను పొందును.

కచ్చిదేత చ్ఛ్రుతం పార్థ! త్వయైకాగ్రేణ చేతసా
కచ్చిదజ్ఞాన సమ్మోహః ప్రణష్టస్తే ధనంజయ. 72

అర్జునా! నీవు నిశ్చలమగు మనస్సుతో దీనిని వింటివికదా పార్థా! నీ అజ్ఞాన జనితమగు మోహము తొలగినదికదా.

అర్జున ఉవాచ :

నష్టో మోహః స్మృతి ర్లబ్ధా త్వత్ప్రసాదా న్మయాఽచ్యుత
స్థితోఽస్మి గత సందేహః కరిష్యే వచనం తవ 73

అర్జునుడు పల్కెను. కృష్ణా! నీ కృపవలన అజ్ఞానము తొలగినది అనగా యింతవరకు నిర్ణయించియున్న ధర్మశాస్త్రములయందు కర్మ సన్న్యాసము కర్మఫల త్యాగము నిర్ణయించిన పద్ధతులు ప్రయోజనహీనములు. నీ నిర్ణయ పద్ధతులగు కర్తృత్వ త్యాగము. క్షరాక్షర పురుష స్పర్శలేని పుత్తమ పురుష పద్ధతి అస్పర్శయోగము యొక్క పద్ధతి తెలిసి నా వలన స్మృతి పొందబడినది. సంశయ రహితుడనై తిని నీ వుపదేశమును పాలింతును.

ఇత్యహం వాసుదేవస్య పార్థస్య చ మహాత్మనః
సంవాద మిమ మశ్రౌష మద్భుతం రోమహర్షణమ్. 74

సంజయుడు పల్కెను. విస్మయకరమును రోమ హర్షణకరమును అగు శ్రీ కృష్ణార్జునుల సంవాదమును నేను ఇట్లు వింటిని.

వ్యాసప్రసాదా చ్ఛ్రుతవా నేత ద్గుహ్య తమం పరమ్,
యోగంయోగేశ్వరా త్కృష్ణా త్సాక్షాత్కథయతస్స్వయమ్.

నేను వ్యాసుని కృప వలన యీ అత్యంత రహస్యమగు యోగ తత్త్వమగు గీతాశాస్త్రమును స్వయముగ వచించు యోగీశ్వరుడగు శ్రీ కృష్ణునినుండి ప్రత్యక్షముగ వినియుంటిని.

రాజన్ సంస్మృత్య సంస్మృత్య సంవాద మిమమద్భుతమ్,
కేశవార్జునయోఃపుణ్యంహృష్యామిచముహుర్ముహుః 76

ధృతరాష్ట్రా! శ్రీ కృష్ణార్జునుల ఈ శుభకరమును విస్మయ కరమును అగు సంభాషణమును తలచి తలచి అనుక్షణము ఆనందించు చున్నాను.

తచ్చ సంస్మృత్య సంస్మృత్య రూపమత్యద్భుతంహరేః,
విస్మయో మేమహాన్ రాజన్! హృష్యామిచపునఃపునః 77

మహారాజా! శ్రీకృష్ణుని యీ అత్యద్భుతమగు విశ్వరూపమును మరల మరల స్మరించుచు గూడ నాకు అత్యంతాశ్చర్యము కలుగు చున్నది. వెలలేని సంతోషము నందుచున్నాను.

యత్రయోగేశ్వరఃకృష్ణో యత్రపార్థోధనుర్ధరః,
తత్రశ్రీర్విజయోభూతి ర్ధ్రువా నీతి ర్మతి ర్మమ. 78

ఏ పక్షమున యోగీశ్వరుడగు శ్రీ కృష్ణుడును ఏ పక్షమున ధనుర్ధరుడగు అర్జునుడును కలరో ఆ పక్షమునకు రాజ్యలక్ష్మియును, విజయమును, అభ్యుదయమును, స్థిరమగు రాజనీతియును వుండునని నా అభిప్రాయము.

ఇట్లు

శ్రీ మదచలఋషి రామకుగు శివరామ దీక్షిత అచల గురుపీఠ

రాజయోగాశ్రమ పీఠాధిపతులు శ్రీ శివరామ

దీక్షితాచల గురూపపీఠ రాజయోగాశ్రమ

ప్రతిష్ఠాపనాచార్యులు అచల ఋషి

దయానంద మౌన్నాల రాజయోగీంద్రుల వారిచే

రచింపబడిన అస్పర్శయోగము

సమాప్తము.

